ఓమ్

శ్రీరామచంద్ర పరబ్రహ్మణేనమః.

శిశుపాలీయము

ఇది

విశాఖపట్టణ మండల ద్వితీయశ్రేణి న్యాయవాది

దూర్వాసుల వరాహనరసింహముచే

రచియింపఁబడి

శ్రీశారదాముకుట ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడి ప్రచురింపఁబడియె.

విశాఖపట్టణము.

1924.

దీనివెల రు 0-12-0.

పీఠిక.

చ॥ కవివరులెందరో యమిత గాథలనెంచి రసోచితమ్ముగా
భువియందు నాటకమ్ములను బొందుగ వ్రాసిరి మద్వితీయ పూర్వమం
భవత్కృతపుణ్య లేశమున వ్రాయుదుగా శిశుపాలముదస
భవవధనాఁగ నొప్పు విదితంబగు విష్ణుకథా ప్రధానమున్॥

ఈ నాటకమునందలి కథ శ్రీమాఘుని కావ్యమునందువలెఁగాక రుక్మిణీ శ్రీకృష్ణుల కల్యాణ విఘ్నానంతరమున నారంభమై శిశుపాలుఁడు ధర్మజ రాజసూయమందున శ్రీకృష్ణునిచే సంహరింపఁబడి తన మొదటి రూపంబున నగు జయుని రూపంబున విష్ణులోకంబున కేగుటకై విమానారూఢుండై దివంబున కరుగువఱకును గలదు. సంస్కృత నాటక సంప్రదాయముంబట్టి వధను రంగస్థలంబునఁ జూపరామి శిశుపాలుని తిరోహితుంగావించి వానిస్థానమున జయునుద్భవింపఁజేసి వాని విష్ణులోకా రోహణమున నాటకము సుఖాంత్యసానము కల్గునట్లుగాఁ జేసినాఁడు. శ్రీమదాంధ్రమహాభారత సభాపర్వమునందు ధర్మజ రాజసూయయజ్ఞమున శ్రీకృష్ణుని వాక్కులుగాఁ జెప్పఁబడిన

సీ॥ ప్రాగ్జ్యోతిషంబున భగదత్తుపై నేము
పోయిన నీతఁడన్యాయవృత్తి,
నిటబాలవృద్ధుల కెల్ల భయంబుగా
ద్వారకాపురిఁగాల్చె వీరులైన,
భోజరాజన్యులఁ బొలతుల తోడ రై
వతకాద్రిఁ గ్రీడాభిరతిఁ బ్రమత్తు,
లైయున్న వారల ననయుఁడై వధియించె
దేవాభుఁడగు వసుదేవుచేయు,
ఆ॥ నశ్వమేధమునకు నభ్యర్చితంబైన
హయము నపహరించి యజ్ఞమునకు

విఘ్నమాచరించి వేడఱి పాపుఁడై
బభ్రుభార్యఁదనకుఁ భార్యఁజేసె॥

అను పద్యమును సాధారముగఁ జేసికొని బభ్రుభార్యను ముఖ్యనాయికను గా నుంచికొని యీ వృత్తాంతమును గల్పించి పైపద్యము ననుసరించియే గ్రంథాంతరంబులం జిక్కని నాటక వస్త్వంశముల విస్తరించి వ్రాసినాఁడను. మఱియు నా చిత్తశోధనకై బభ్రుభార్యను శిశుపాలునకు భార్యగ నొనరించియుండుట మొదలగు కొన్ని మార్పులు గావించితిని. ఇది నా మొదటి ప్రయత్నమగుట లోపములనే కము లుండవచ్చును; కావునఁ బాఠకమహాశయులు

గీ॥ నీరములవీడి క్షీరముల్ నేర్పుమీఱ
నానఁగల్గెడు నట్టిరాయంచకరణి
నెరసులెన్నియుఁగల్గిన నరకుఁగొనక
విర గణుతింప వేఁడువాఁడ॥

జయపురము,
21-2-1924.

ఇట్లు బుధజనవిధేయుఁడు,
దూర్వాసుల వరాహనరసింహము.

ఈ నాటకమందలి పాత్రలు.

పురుషులు.



శిశుపాలుఁడు—కథానాయకుఁడు.
దంతవక్త్రుఁడు.
మంత్రపాలుఁడు—శిశుపాలునిమంత్రి
సునీథుఁడు—శిశుపాలుని సేనాధిపతి
జరాసంధుఁడు.
రుక్మి.
7 వాచాలుఁడు—విదూషకుఁడు.
8 సిద్ధుఁడు.
9 శ్రీకృష్ణుఁడు.
10 బలరాముఁడు.
11 సాత్యకి.
12 కృతవర్మ.
13 ఉద్ధవుఁడు.
14 అక్రూరుఁడు.
15 ఉగ్రసేనుఁడు.
16 బభ్రువు.
17 ధర్మరాజు.
18 భీముఁడు.
19 సహదేవుఁడు.
20 భీష్ముఁడు.
21 కణ్వుఁడు.
22 గర్గముని.
23 వశిష్ఠుఁడు.
24 భరద్వాజుఁడు.
25 సాధ్వలుఁడు—వైలకిమల్లుఁడు.
26 నారదుఁడు.
27 ధర్మదేవుఁడు.
28 జయుఁడు—విష్ణుమందిర ద్వారపాలకుఁడు.
29 మైత్రేయుఁడు — శిశుపాలుని పురోహితుఁడు.
30 సుశర్మ— శివపుర వాస్తవ్యుఁడు.

సూత్రధారుఁడు, ప్రతీహారులు, లేఖహారకుఁడు, భటులు, చారుఁడు, వేత్రహస్తులు, రక్షకభటులు, బ్రాహ్మణుఁడు, మొదలగువారు.





1 చారుమతి—శిశుపాలునిరాణి.
2 చతురిక—చారుమతి పరిచారిక.
3 మాలతి—చారుమతి పరిచారిక.
4 నటి.
5 సుకేశిని—బభ్రుభార్య.
6 మధురిక—సుకేశిని పరిచారిక.
7 భూదేవి.





ఓమ్

శ్రీ రామచంద్ర పరబ్రహ్మణే నమః.

శిశుపాలీయము.

నాంది.

శ్రీ రంజిల్ల నశేష రాజ్యవిభవ శ్రీయోభివృద్ధ్యాస్పద
స్ఫారోదారవరప్రసాదకలనస్వాంతంబునన్ ఢిల్లినాఁ
చేరంబొల్చుపురాణవారణపురీస్థితోరుసింహాసనా
స్తారుండేలుత భారతావనిఁ బ్రజాస్వాతంత్ర్యమే పారగాన్॥

ఉ॥ ఆరయలోక రక్షణ సమంచిత సాంద్రదయారసాన్వితో
దారగుణ ప్రపూర్ణమతి దానవకోటి విభంజనక్రియా
పారగుఁడై ముదంబొదవఁ బావని నాంధ్రరమన్ వరించి యిం
పార వెలుంగు నాంధ్ర జలజాక్షుఁడు తచ్ఛిశు పాలకుండగున్॥

(నాంద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించి)

సూత్ర—నటీ, యేతత్సమయోచిత నేపథ్యాలంకారంబైనచో వేగిరమ్మిటు రమ్ము.

నటి—(ప్రవేశించి) దేవరయాజ్ఞ శిరసావహించి యిదె వచ్చితి. సర్వంబును సిద్ధంబయ్యె. ఆచరణీయం బెద్దియొ వక్కాణింపుఁడు.

సూత్ర—అతివిస్తరమేల? జయపుర పురాధీశ్వరులైన స్వస్తిశ్రీ రామచంద్రదేవ మహారాజులుంగారి యాజ్ఞానుసారంబుగ నిప్పుడధికోత్సాహంబునం జరుగు నీ యనన్యస్థల సాధారణ శరన్నవరాత్ర మహోత్సవ దర్శనాగత మహాజనానీ

కంబు నన్నురావించి తమ మనంబు లభినవనాటకదర్శనోత్సుకతంబులై యుం డుటంజేసి యట్టినాటక ప్రదర్శనంబున హృదయామోదంబు గావింపుమని యా నతిచ్చెం గావునఁ గుశీలవులతో సంగీత మారంభింపుఁడని చెప్పి నీవును సిద్ధంబు గ నుండుము.

నటి—నాథా, యిపు డేనాటక ప్రదర్శనంబుఁ గావింపనుంటిరో యానతిండు.

సూత్ర—నూతనంబుగ నాంధ్రంబున రచియింపంబడిన శిశుపాలీయంబను నాట కరాజంబతి రమణీయంబుగ నుండును. దాని నాడి వీరి డెందంబుల నానందింపఁ జేయ నభిలషించితి.

నటి—నూతనాంధ్ర నాటకమా? సరిసరి! కాళిదాసాది మహాకవి కృత పురాణ గీర్వాణ నాటక రత్నంబులం గనిన నవరస రసిక శిఖామణులగు నీసభాసదు లెక్కఁడ? ఆనూత నాంధ్ర నాటకంబు వీరిమనంబుల రంజించు టెక్కఁడ?

సూత్ర—ఏమీ! నూతనాంధ్ర నాటకంబని నీవతి నీరస భావంబునంబలుకుచుంటివి! నూతన పురాతనంబులకుం గల భేదమేమి?

గీ॥ ప్రాఁతది యటన్న మాత్రనఁ బాత్రమగుచు
గ్రొత్తది యనంగ దానికిఁ గొఱఁత గలదె
క్రొత్త ప్రియమును మఱివేఁడి రుచియు ననుచుఁ
దరుణి లోకోక్తి వినమె నూతనమె ఘనము॥

ఇఁక నాటకాచరణంబునకు నీయాభాష యన నేల?

గీ॥ భాష యేదైన నేమి విశేషభావ
రసగుణమ్ములు గల్గినఁ బసదనర్చు
జాతితో నేమి సుగుణసంజాతయైన
భామ గూర్పదె సౌఖ్యంబు భర్తకెపుడు॥

మఱియు నాంధ్రభాషయనఁ గొఱంతయేమి?

సీ॥ కావ్యనాటకముఖగ్రంథ సంహతికెల్ల
నందమౌ మండనం బాంధ్రభాష,
సుందరాలంకార సురభూరుహాళికి
నాలవాలంబు దా నాంధ్రభాష,

కవిమనోంతర్భావ గరిమ మేర్పడఁ దెల్ప
నసమ నైఘంటికం బాంధ్రభాష,
గానోప యుక్త సంధాన స్వరాళికి
నమర హార్మోనియం బాంధ్రభాష,
గీ॥ యనగ నుతిగాంచి యలరారు నాంధ్రభాష
సరస కవితకు నెలకొను సదనమయ్యె
దేశభాషల యందునఁ దెలుఁగులెస్స
యనుచు నాంధ్రసరోజాక్షుఁ డనఁడె తొల్లి॥

ఇంతియగాక,

మ॥ పదలాలిత్యము నర్థగౌరవము సద్భావాస్ఫుర ద్వృత్తమున్
మృదులోక్తుల్ రసపుష్టిభావగుణముల్ నీతిప్రబంధంబులున్
సదలంకారము వర్ణ సౌష్ఠవ గతుల్ సంగీత సాహిత్యముల్
విదితంబుల్ కవితాసతీమణి కొగింబెంపొందునాంధ్రంబునన్॥

మృదుమధురంబై సర్వజన సుజ్ఞేయంబైన యిట్టి యాంధ్రభాషన్విడిచి కేవల గ్రాంథిక భాషయగు గీర్వాణంబున నాటక ప్రదర్శనంబుఁ గావింపఁ బండితేతర జనంబున కదియెట్లు ముదావహంబగును! కాన నాంధ్రభాషయే సర్వవిధంబుల నుత్తమంబు.

నటి—తమయుక్తి యుక్తవచోరచనాసామర్థ్యంబున నాస్వాంతం బిపుడు శాంతం బయ్యె తన్నాటక గ్రంథకర్తను దదీయ కవితా సామర్థ్యంబునుం దెలుపఁ బ్రార్థించెద.

సీ॥ దూర్వాసులాన్వయ దుగ్ధాబ్ధి చంద్రుండు
శ్రీవత్స గోత్రభూ శేఖరుండు,
కామేశ్వరమనీషి గారాబు కొమరుండు
వినయ విద్యాశీల విశ్రుతుండు,
వారిరుహోద్భవ వంశ సంజాతుండు
వరకవి మార్గాను వర్తనుండు,
వంతుల శ్రీరామ పండిత శిష్యుండు
శిష్టజనానీక సేవకుండు,

గీ॥ కీర్తియుతమూర్తి మల్లాది కృష్ణమూర్తి
పండిత మనోజ్ఞమిత్రుండు పావనుండు
అంచిత వరాహ నారసింహాహ్వయుండు
కమ్ర శిశుపాలనాటక కవివరుండు॥

మఱియు నాతని కవితా సామర్థ్యతా పరిశీలనంబునకు నీసభవారే యున్నారు.

గీ॥ కవిసమర్థత నెంచంగఁ గలుగునట్టి
గుణవిచక్షణ పారీణ కుశలమతులు
సభ్యులుండంగ నర్హులు సర్వవిదులు
మగుప మున్నుగఁ దెల్పంగనగునె నాకు॥

ఇట్టిమహనీయ గుణగరిష్ఠులు పరిశీలింపఁ గవితాగుణ గ్రహణంబున కెట్టి కొఱంతయు నుండనేరదు. ఏలయన,

గీ॥ నీరములవీడి క్షీరముల్ నేర్పుమీఱ
నానఁగ్రోలెడునట్టి రాయంచకరణి
నెరసు లెన్నియుఁ గల్గిన సరకుఁ గొనక
విరళగుణములె గణుతింత్రు విబుధవరులు॥

నటి— సరే యింక సకల కలావిశారదులగు నార్యపుత్రులు సూత్రధారులై సర్వ కార్యనిర్వాహకంబు నెఱవేర్చుచుండ నాటక సామాజికుల శక్తిని వేఱుగ నడుగనేల? ముందుగ నేనే ఋతువు నాశ్రయించి పాడవలయునో దేవర యాజ్ఞాపింతురుగాక.

సూత్ర— సీ॥ ధాళధళ్యంబులై ధారాధరంబులు
గగన భాగంబునం గ్రాలుచుండఁ,
చారునిర్మల సారవారి పూరంబులై
ధరవాహినీతతుల్ దనరుచుండఁ,
పాండురంబై నేలఁ బిండారబోసిన
కరణిని వెన్నెలల్ గాయుచుండఁ,
బక్వమై గారుడోపల కాంతులను వీడి
సస్యరాజి సువర్ణ సమత నొంద,

గీ॥ నేఁడు గన్గొన్న మఱిమఱి జూడనగుచు
వసుధ కన్గవ పండువై మిసిమిదోప
మానసాహ్లాద కరమౌచు మహిత భూతి
ఋతువులకు మేటి యీశరదృతువు బోటి॥

కాన సకలజనసుఖదంబై యతిమనోహరంబైన యీశరదృతువు నాశ్రయిం చియే గానం బొనర్పుము.

నటి—చిత్తము. (అని పాడును).

సీ॥ ఇంద్రచాప ప్రభల్ హీనమై తొలఁగంగ
బరమ హంసాళికిఁ బ్రమద మొసఁగ,
దుర్దినంబుల బాధ దూరమై పోవంగ
గోగణపాలుర కోర్కె దీర,
భూధర వాహినీ పుంజంబు గృశియింప
నలనిశాటప్రభా హైన్య మొదవ,
పుణ్యజన శ్రేణి భూరియాత్రలు వోవఁ
బంక సంకుల భూమి భారముడుప,

గీ॥ ధాత్రి నవతార మొందిన దానవారి
దేవకీ సూను మాడ్కి నిదే జరిలుచు
నరయనే తెంచె లోకంబు హర్ష మొంద
ఘనతరంబైన శారద కాలమిపుడు॥

సూత్ర—ఆహా! ఏమి నీగాన మాధుర్యము! నీశబ్ద ప్రయోగ కౌశల్యంబును నీడుదీ యక యున్నదే! ఋతువర్ణనా వ్యాజంబున నాటక వస్తుసూచన నెంత ర మ్యంబుగఁ జేసితివి! నీగాన సుధారసముం గ్రోల నామనంబు తనివి దీఱకయు న్నది. మఱియు నొకసారి పాడుమా.

నటి—చిత్తము. (అని పూర్వోక్త పద్యము నే పాడును). సీ॥ ఇంద్రచాప ప్రభల్...

సూత్ర—ఆహా! ఏమి మనోహరముగా నున్నది! (అని మైమఱపు నభినయిం చుచు నూఱకుండును).

నటి—నాథా! ఇట్లూఱక యుండెద రేలా?

సూత్రి—(తెలివినొందుట నభినయించి) ప్రేయసీ, నేనిపుడేమి సేయవలయును?

నటి—ఆర్యపుత్రా. యనమాన సామర్థ్యులరగు తమరు సూత్రధారులై యుండ నేమిసేయవలయును నేను మనవిసేయవలయునా? ఇపుడు రూపకారంభంబునకుఁ బాత్రప్రవేశంబు సేయవలయునన్నసంగతి మఱచి యుంటిరాయేమి?

సూత్రి—ఆహా, నీమాట సత్యమే. నీగానామృత పానాసక్తంబడి నాచిత్తంబించుక పరాయత్తంబగుటచేఁ గర్తవ్యం బెద్దియొ మఱచియే యుంటిని.

గీ॥ వనిత నీగాన మధురసాస్వాదనమునఁ
చిత్తమధుపంబు చంచలస్థితివహించె
ప్రబలు రుక్మిణీ మోహవిభ్రాంతికతనఁ
జలన మొందిన శిశుపాలు స్వాంతమట్లు॥

నటి—నాథా, శిశుపాల వేషధారి యిదె రంగస్థలంబునకు వచ్చుచున్నవాఁడు.

సూత్రి—అటులయిన మనమిచట నుండవలను పడదు. పోవుదము రమ్ము.

(ఇద్దఱు నిష్క్రమింతురు).

ఇది ప్రస్తావన.



శ్రీ

శిశుపాలీయము.




ప్రథమాంకము.



ప్రథమరంగము — చేదీపురోద్యానవనము.

(శిశుపాలుఁడు ప్రవేశించును).



హా భామామణి మోహనాంగి నవఫుల్లాంభోజ పత్రేక్షణా
హా భృంగాలకభార సుందరరదనా హాపూర్ణచంద్రాననా
హా భీష్మాత్మజ రుక్మిణీ గుణనిధీ హాపక్వబింబాధరా
హా భాస్వన్మణి భూషణాంచిత తనూ యాహా మనోహారిణీ॥

ఉ॥ ఇంతిదలంప నీవలన నెంతయు మోహమునంతమౌచు న
త్యంతమవార్యమౌట నిఁక స్వాంతమొకింతయు నిల్వదయ్యె నా
వంతయుఁ జింత సేయక లతాంత శరాహతి నొంచినన్ను బల్
వంతకుఁ దావలంబుగనవశ్యముఁ జేయుఁదొడంగెఁ గంతుఁడున్॥

గీ॥ వనిత నీరూప లావణ్య వైభవములఁ
దవిలి నామది విడువంగఁ దాళదయ్యె
నేమిసేయుదు నేమందు నెట్లుగాంతు
మదన తాపాగ్ని చల్లారు మార్గమకట॥

పూర్వదిగ్భిత్తిం గట్టిన వర్ణంబోయన నొప్పుచు నదె చంద్రబింబంబుద
యించి నామనంబునకుఁ దాపోద్రేకంబుఁ గావించుచున్నది.

సీ॥ వాసవాశాంచిత వారణముఖపట్టిఁ
బొల్పారు బల్కెంపు పొడియనంగ,
విరహులపైదాడి వెడలు కందర్పుండు
దర్పించి యెత్తిన ధ్వజమనంగ,
ప్రాగ్దిశా కన్యకా పాణిగ్రహణమందుఁ
జెలువొప్పఁగట్టు బాసిక మనంగ,
ఆకాశలక్ష్మీ ముఖారవిందంబున
దీపించు సిందూర తిలకమనఁగ,
గీ॥ సమయ పురుషుండు లీలమై సంధరించి
పటిమఁ జిమ్మిన బంగారు బంతియనఁగ
నల్లదె మదీయ తాపంబు వెల్లిఁగొల్పఁ
దూర్పుకొండను నుదయించె తుహినకరుఁడు॥

అహహా! ఈశృంగార వనవిహార వ్యాపారంబున భీష్మకన్యానురాగభంగ సంజనితమదనసంతాపంబు వలన నూఱటయగునని తలంప నైజముచే శైత్యగుణ ప్రధానంబులయ్యు నీమలయ మారుతాదులు దుర్దర్పుండగు నాకందర్పునిం గూడి నాహృదయంబున కమిత తాపప్రదాయకంబు లగుచున్నవి. ఏమి వీని దుర్నయము!

సీ॥ వైరమా యిదినీకు బీరమా నీకూలా
చారమా శౌరి కుమారమార,
అందమా యిదినీకుఁ జందమా కువలయా
నందమా పున్నమ చందమామ,
మేలమా యిదినీకు శీలమా దుష్కర
కాలమా చందన శైలపవన;
పంతమా నీకు సామంతమా నిర్దయా
స్వాంతమా క్రూర వసంత యింత,
గీ॥ సీతమా నీకుఁ జాతమా పోతరంబ
నాదమా నీకు షట్పదనాదమా ప్రి

లాపమా పికాలాపమా కోపగింప
నెంచి తిలకించి వంచించి నొంచనేల॥

(కొంచె మరిగి కొలకొలను సమీపించి చూచి) ఈపూర్ణిమా చంద్రాతపంబున నీకాసారమతి మనోహరంబై నేత్రపర్వంబుఁ గొలుపుచు నీయుద్యానవనాధిష్ఠాన దేవతవోయన విరాజిల్లుచున్నను జూడఁజూడ నామనంబునకు మిక్కిలి వెక్కసంబై తోఁచెడిని. అయ్యయో! ఈకమలాకర దర్శనంబునఁ "దానొకటి దలఁప దైవంబు వేఱొండు దలంచు న"న్నటుల మదీయ వేదనాభరంబు ఇంత యధిక మగుచున్నది.

సీ॥ వికసిత కమనీయ విపులాబ్జ విభవంబు
నాకెంపు సోగమీనములసొంపు,
నిరతమ్ము విరజిమ్ము విరితేనియలసోన
కడునిక్కు జక్కవ కవలపెంపు,
నన్నుత కదళికాస్తంభ సౌభాగ్యంబు
విలసిత వేదికాస్థలులచెన్ను,
తరళతరంబైన దరము సౌందర్యంబు
నాయత శైవాల శ్యామలతయు,
గీ॥ రమణ నేపారు శుకపికా రావములును
రాజహంసలు కూర్మముల్ రాజిలంగ
నందమొప్పారు నీకమలాకరంబు
పోలఁతి యవయవంబుల తీవిఁదలఁపఁ జేసి
హృదయ సంతాపమెంతయు నినుమడించు॥

ఇఁక నారుక్మిణీ తరుణీమణీ బాహులతికాంతర సుఖోన్నతిం బడయ నేరని నేనిఁక అలఁజెఱకు వింటివాని వాఁడి తూపుల వేడిమికిఁ బోఁడిమి చెడక యుండ నిపుడెట కేఁగువాఁడ?

సీ॥ కుసుమాస్త్రునకు నోడి కొలను జేరెదనన్న
నరవిందములఁగాంచి యడలుగుండె,

మనసిజు భీతిచే వనముఁ జొచ్చెదవన్న
నటనశోకముఁగాంచి యువయుమనము,
కావుననొదిగి యూరకుమే గెదనన్నఁ
జూతముల్ గాంచిన భీతిగల్గు,
స్మరచాపములనుచ్చి పెరటదాగెదనన్న
మాల్లి కాతతిఁగాంచి యుల్లమదరు,

గీ॥ మరునిధాటికిఁ దుదకంతి పురముఁ జొరగఁ
జెలులకన్నోత్పలంబులఁ జేతములుకు
ఫాలనేత్రుని శరణంబు వడసిగాని
పంచశరుధాటి కేనింక బ్రతుకజాల॥

మదీయ మదనసామ్రాజ్య కార్య నిర్వహణ పరాయణుండగు వాచాలుండింక
ను రాకతడయఁ కారణం బేమియో కదా!

(వాచాలుఁడు ప్రవేశించును.)

వాచా— (స్వ) ఇదె నామిత్రుఁ డెవతెందలంచియో మదన తాపానల దందహ్య
మానమానసుండై యున్నటులఁ గాన్పించుచున్నవాఁడు (ప్ర) మిత్రమా, యా
ఫాలనేత్రుని యపరమూర్తి నగు నా శరణంబు వేడిన నీమరంత చింతకుఁ బ్రతీకా
రంబు గాపింపక యుందునా?

శిశు —(వాచాలునివంకఁజూచి) ఓహో! వాచాలుఁడా! ఈనాదురవస్థలో నాపా
లిటి భాగ్యదేవతవలె వచ్చితివి. ఇదె నీశరణంబుఁ జొచ్చితి. శంబరాంతకు శాత
శరాహతి కోర్వజాల, రక్షించు, రక్షించు. (అని చేతులు జోడించును).

వాచా—వయస్యా, నీభాగ్యదేవత కేమిగాని యిప్పుడే భోగ్యదేవత కొఱకైయిట్లుత్త
ట్లూఁగుచున్నావు?

శిశు—మిత్రమా, ఇఁక వేఱే యెవరి కొఱకైయుందును?

గీ॥ పతనూమధ్య భీష్మకుఁడెలమిఁ బెంచి
ప్రియముతోడుత నాకిచ్చి పెండ్లి సేయ
నున్నతిఁగాంచి యాలరి వెన్నదొంగ
ముచ్చిలించెను యెంపరారో హా, యాల

లామ, యానీలవేణి, యాకోమలాంగి,
యామనోహారి, యెలనాగ, యామిటారి,
యాకలువకంటి, కరభోరు, హంసయాన,
యామధుకాలాప నవమోహనాంగి నాదు
మానసంబును హరియించి సూనశరుని
విశిఖవృష్టిని వనుఁదోఁచి వెడలె నెటుల
విరహసాగర మీఁదినే దరిని జేరు
సాధనాంతర మీక్షింపఁ జాలువాఁడ॥

రాచా — ఓహో! దీనికి యింతయారాటము! ఇది కూడులేదన్న దుఃఖమా గుడ్డలేదన్న దుఃఖమా? నాకుఁబొట్టనిండ మెతుకులకు దట్టముగఁ గమ్మని కుడుములు లభించిన నిట్టివానికి గుట్టుచెడి పట్టువడుదునా? మహారాజా, యీధుక్కియే చక్కదనముల చుక్కయనుకొంటివా? నిన్ను వరింప ముదితవనితామణులు లేరా? ఈభువనత్రయంబున నున్నయే యుత్తమమత్తకాశిని నిన్నుఁ జిత్తంబునఁ దలంచి యుత్తలపాటు నొందకయుండును? శిశుపాలుఁడేమి పశుపాలునికన్న నధముఁడా?

ఉ॥ శీలము రూపముం గులముఁ జెల్వగు ప్రాయము సంపదుత్కరం
బాలమునందుసం దనరు నద్భుతసాహసశౌర్యధైర్యముల్
చాలఁగ నెంచిచూడ నలజంభవిభేదికి నైనఁ జేదిభూ
పాలునిఁ బోలనౌనె పరపార్థివముఖ్యుల మాటలేటికిన్॥

అట్టి నిన్నువరించి సుఖంబువడయఁ దోఁచని యారుక్మిణికి నీవెట్లు లభింపఁగలవు? కావున,

గీ॥ ఓయిమిత్రమ యీవ్యథ నోసరించి
నాదుపలుకుల నాలింప మోదమొదవు
రుక్మిణీకాంతఁ మదిదల్ప రోషహీన
మానసుఁడవె భూపాలమౌళిచంద్ర
నీతిశూన్యంబు మోహంబు నిండుసున్న
భక్తిపూజ్యంబు విశ్వాస భయములిల్ల

స్థిరతపనలేదు సౌభాగ్యత యరయఁగల్ల
పసులకాపరిఁ దగిలిన రసవిహీన
వినవు నెలఁతకునై యింతవ్యసనమేల
శునకసంస్పృశితాన్నంబు శుద్ధమగున
హస్తవిగళిత ఘటమున కాపఁజేయు
వెంగలి గలండె యెందైన నంగిడీఁడ॥

శిశు—ఛీ! మూఢాత్మా, నీవస్తుతత్వజ్ఞాన మింతవిపరీతముగాఁ బరిణమించినది? "ఎద్దున కేమి దెలియు నడుకులరుచి" యని రుక్మిణీసుగుణసంపద నీకెట్లు గ్రాహ్యంబగును?

చ॥ సుగుణగణాలవాల కడుశోభితలక్షణ లక్షితాంగియై
మగువ మనోహరాకృతిని మానవనాథవరాన్వయంబునన్
జగములు సన్నుతింప నిల జన్మమునొందిన యాదిలక్ష్మి నా
నగడెడుదాని నిట్టులతి నింద్యముగాఁ బలుకంగఁ జెల్లునే॥

ఇంతియగాక,

శా॥ ఆలావణ్యము నామరాళగమనం బావాక్య మాధుర్య మా
నీలోత్ఫుల్లసరోజనేత్రియుగ మానెమ్మోము శృంగార మా
రోలంబాలకబంధ మాగురుకుచశ్రోణీభరం బాగళం
బేలోలాక్షికినైన నొందఁదరమా యీలీల నొక్కుమ్మడిన్॥

వాచా—శిశుపాలసార్వభౌమా, యేమి యింతవెఱ్ఱిబాగులవాఁడవు? సుగుణముల మీద సుగుణములను లావణ్యముపై లావణ్యమును దొంతరవెట్టిననే రుక్మిణియైనదనుకొన్నను నీకుంగల ప్రయోజనమేమి? నీతియు జాతియులేని కలువేషధారిని వరించి నీవంక జూడనైన లేదే! తనకుంగాని దానిఁదలంపనేల?

శిశు—వాచాటుఁడా, యేమియు నెఱుంగని యాగోపబందూలనాడెదవేల! అవుత్తి యుండు బలాత్కారంబునం గొంపోవ నామచ్చెకంటి యేమిసేయఁగల్గును? తల్లిదండ్రైన యామతకరి గొల్లవి నవవలెంగాక.

వాచా—మిత్రమా, గంజివోసి పెట్టిన సుటికంకనే చూచుచుంటివా? అగొల్లఁడు చేసిన పల్లదమేమి?

శిశు — ఏమియా? వినము.

ఉ॥ చిన్నటనాటనుండి మన చేదినృపాలున కేను సంగెదన్
కన్నియ నంచు భీష్మకుఁడు గార్యము సర్వ వివాహపత్రికన్
మన్ననఁ బనేము నటుమామక బంధులఁ గూడి యేగినన్
ఖిన్నులఁ జేయఁడే ఖలుఁడు కృష్ణుఁడు చౌర్యతఁ గొంచు రుక్మిణిన్॥

వాచా — ఇదియేనా నీకుఁ దెలిసినది? ఆబాల యేమియు నెఱుంగని గోలయనియా నీ యూహ? చూచుటకుఁ జంచువలెనుండియుఁ జేసినవి యందఱకుఁ చేష్ట లేయని పాపము నీవెఱుంగవు గాఁబోలు?

శిశు — ఆమె చేసిన దేమి?

వాచా — ఇంకను మఱియేమి సేయఁగలయును? తాను చేయవలసినదంతయుఁ జేయుటచేతనే యింతవచ్చినది.

ఉ॥ అన్నులమిన్న నీకొసఁగి యన్నవివాహము సేయనున్న నా
పన్న యెఱింగి విప్రకులసత్తము నొక్కనిఁ జీరి సాహసా
భ్యున్నతి మీఱఁ దన్నుఁ గొని పొమ్మని కమ్మ లిఖించి పంపినన్
గ్రన్నన వచ్చి శౌరి నినుఁ గన్నడ సేసి హరించె రుక్మిణిన్॥

శిశు — ఏమీ! నిజముగా నిట్లు జరిగినదా?

వాచా — అహా, నిస్సందేహముగా నట్లనే జరిగియున్నది. ముమ్మాటికి నా మాట నమ్ముము. ఆశ్రీకృష్ణ నూజనసంప్రాప్తయౌవనయైన నాటంగోలె నామాయలమల్లి కల్లగొల్లనియందే బద్ధానురాగయై యున్నదని నెఱింగి జననీజనకులును బాంధవులును కృష్ణునకిచ్చి వివాహము సేయఁ గృతనిశ్చయులైరి. రుక్మి నీయందలిస్నేహమును బట్టి వారిని వారించి కన్యాదానంబు నీకుం జేయనెంచి సమస్తంబు సిద్ధంబు సేయ నా రుక్మిణి చేసిన కొంటెతనంబున నీయుద్వాహంబునకు విఘ్నంబు వాటిల్లె.

శిశు — ఏమియాశ్చర్యము! ఏమి దారుణము! ఇదియంతయు సత్యమైయుండునా?

వాచా — నేను మహాబ్రాహ్మణుండను, నామాట నసత్యము కచ్చునా? అందుల నా యెలికవగు నీయెడల నా? ఇదె నా జంధెంబు ముట్టి చెప్పెద. (అని యజ్ఞోపవీతము చేతఁబట్టి) నే చెప్పినదానిలో లేశమైన నసత్యము లేదు. నీవు సందేహింపకుము. ఇంతకును స్త్రీలమనసంబుల నెవఁడెఱుంగఁ గలఁడు?

చ॥ వలగొనుమాట నొక్కరుని వావిరిచూపుల మేపు నొక్కరుం
డలవడఁ జేష్టఁదన్ను నొరు నాశ నొకొక్కనివంకఁ జూపెడున్
నలుగడ విభ్రమంబులను నమ్మకముల్ పెరనాల్గుదిక్కులన్
దెలియఁగరాదు బ్రహ్మకును దెల్లముగా సుదతీ మనంబులన్॥

అందుచేతనే పెద్దలిట్లందురు.

శ్లో॥ "ఔదుంబరాణి పుష్పాణి శ్వేతవర్ణంచవాయసమ్
మత్స్యపాదం జలేపశ్యే న్న నారీహృదయస్థితిమ్॥"

శిశు—నీవు చెప్పినది వారాంగనల యెడల వర్తించును. పెద్దలు చెప్పినది స్త్రీజన సామాన్యముగా సత్యమేయైనను నుత్తమవంశ సంజాతయైన రుక్మిణి యట్టిది యగునా యని నామనంబున నించుక సందియంబు వొడముచున్నది.

(ప్రతీహారుఁడు ప్రవేశించును.)

ప్రతీ—ప్రభువరా కుండినపురంబునుండి యొక లేఖహారకుండు వచ్చియున్నాఁడు.

శిశు—వాని నిటకుందోడితెమ్ము.

ప్రతీ—చిత్తము. (అని నిష్క్రమించి లేఖహారకునితోఁ బ్రవేశించును.)

లేఖ—మహాప్రభూ రుక్మి కుమారమహారాజావారు తమతావున కీలేఖ నంపిరి. (అని యొక లేఖం జేతికిచ్చును).

శిశు—(లేఖను జదువుకొని) సరి మీరుభయులు వెళ్లవచ్చును. (ఉభయులు నిష్క్రమింతురు). వాచాలా, రుక్మి యొక్క యీయుత్తరము నందలి కొన్ని యంశములు నీనుడువుల స్థిరపరుచుచున్నవి. నేనెంత భ్రమపడితిని! (పెద్దనిట్టూర్పు విడిచి) ఏమి యాశ్చర్యము! అసూర్యంపశ్యలగు వనితల కిట్టిసాహసంబు వొడముట మహాద్భుతంబుగ నున్నది. (నిట్టూర్పు విడిచి) పరానురక్తయని తెలియ నేరకుంటి నే! ఈరుక్మిణీకృత దుష్టకృత్యంబుఁ దలంప నామనం బెంతయు రోయుచున్నది. ఛీ! నికృష్టాత్మురాలా! నిన్నుదలంచిన మహాపాతకంబు లొదవు.

వాచా—(స్వ) బలే! యిప్పుడుకదా నేధన్యుఁడనైతిని! రుక్మిణీ సుగుణ సంపత్తి నెఱిఁగియుఁ బ్రభుమనోవ్యథం బాప నేపన్నిన పన్నుగడ ఫలించినది. ఆయుత్తము మత్తకాశినిని వృథా నిందించిన పాపంబువలన దైవంబు ననుంగాచుగాత!

శిశు—ఆనీచురాలి దుష్టకృత్యంబుతో నాకేల? ఆయదుకుల పాంసనుఁడు గావించి

న తిరస్కారంబుఁ దలంప నాహృదయంబెంతయుఁ గ్రోధఘూర్ణిత మగుచున్న
ది. (సగర్వముగఁ దలవంకించి)

మ॥ చిరకాలార్జిత ఘోరవైరజనితాక్షీణోగ్ర కోపాగ్ని దు
స్తర విస్ఫారమదాంధతోద్భట తిరస్కారాజ్య ధారాహుతిన్
బురసంహార విజృంభమాణ భయకృద్భూతేశ బాణాగ్ని భీ
కరమై పర్వె నభోంతరాళము సమగ్ర ప్రజ్వల జ్వాలలన్॥

అట్టి మదీయ క్రోధానల జ్వాలలకు నాయాదవాధముని శలభప్రాయునిఁ జే
యక నాకుఁ గన్నారఁ గూర్కురానేరదు.

పంచచామరము.

దురాత్ముఁ గ్రూరకర్ముఁ బట్టి దోర్బలంబు పెంపునన్
కరాళ ఖడ్గ ధారఘాతఁ గంఠ మొక్క పెట్టునన్
చిరానఁ ద్రుంచి శోణితంబుఁ బీల్చినాఁడు క్రోధమున్
బరాబరిన్ బ్రశాంతిఁ జేసిపాయుదున్ మనోవ్యథన్॥

వా చా—అట్లు చేసినఁగాని నాకుఁ గడుపారఁ దిండియుండదు.

శిశు—(కోపావేశముతో) ఇదె నాప్రతిన వినుము.

ద్విపద॥ చిరశత్రు శిరము నాశిరముఁ ద్రుంపక యు
పరమార్థమును లేను పడయంగనోప॥

వా చా—హరహర! (అని చెవులుమూసికొని) అమంగళము ప్రతిహతమగుఁగాక!

శిశు—మూర్ఖా, శత్రుపక్షంబునఁ బలుకుచుంటివి! అదురాత్ముని శిరశ్ఛేదంబు నీక మంగళమా?

వా చా—మిత్రమా, యది కాదు. ద్వి॥ "చిరశత్రు శిరమునా శిరముద్రుంపక యు" అనుటకు మాఱుగ వ్యత్యస్తముగఁ బలికితివి.

శిశు—ఓహో! అలాగా!

గీ॥ శత్రుదండనమందున సమధికముగ
హృదయ మెప్పుడు లగ్నమై కదిసియుంట
నుడువు పొరపడి యుండినఁ జెడుగ దేల
యంతమాత్రన సంభవమగును సఖుఁడ॥

వాచా—మహారాజా, చెడుగు సంభవించుననికాదు. నాకుఁ గర్ణకఠోరంబుగ నుండుటచే నట్లంటిని.

శిశు—ఆశత్రునిఁ గఠినముగా శిక్షింప మంత్రాలోచనంబు సేయనరుగవలయు (అని నిష్క్రమించును).

వాచా—మహారాణిగారు సాపత్న్య రాహిత్యంబునకై సోమిన వ్రతోద్యాపన సంతర్పణ మాసచక్రంబుల కొఱకుటకు నేనింతలోఁ బోయివచ్చెద.

(అని నిష్క్రమించును.)

తెరజాఱును.

ద్వితీయరంగము—శిశుపాలసభామందిరము.

(శిశుపాలదంతవక్త్రులు మంత్రిపాలసునీథాది మంత్రులును బ్రవేశింతురు).

శిశు—కరూశాధిపా, మంత్రిపాలాది సచివులార!

ద్వి॥ చెప్పెద నొకమాటఁ జెవియొగ్గి వినుఁడు
తప్పుఁగాపించెను దప్పఁగొంపోయి
యాదవాధముఁడైన యాకృష్ణఖలుఁడు
మీఁదు మిక్కిలి యిపుడు చేదిభూపాలు
శిశుపాలుఁ దెగటార్పఁ జింత సేయుచును
బశుపాలుఁడున్నాఁడు భావంబునందు
మంచియోచనఁ జేసి మించకుండంగ
వంచింపవలె ముందువాని నెట్లైన
లేకున్న మననింక లేకుండఁ జేయు.
నాకుఁ దోఁచినదిది మీకేమి దోఁచు
వినుపింపఁగోరెద విశదంబుగాను
ఘనమంత్రివరులార కరమాప్తులార
కార్యసాధకులార కంసాంతకుండు
వీర్యవంతుండని వెగడొందరాదు
పూర్వమాతని శక్తిఁ బూటకంబంచు
సర్వంబు నెఱుఁగమే సమయంబులందు.

దంత—గీ॥ నరవరోత్తమ, నీవింత తఱిచియుడుగ
నూఱకుండుట మాకేమి యుచితమయ్యె?
నాకుఁదోఁచిన భంగిని బ్రకటముగఁ
బలికెదను మీరలందఱు భద్రమతులు
మంచిచెడ్డల యోచించి యుచితముగఁ
గార్యసాధన మూహింపఁ గలరుగాదె.
గొల్లకులమందు జన్మించి ఘోరమైన
పాతకంబులఁ గావించి నీతిమాలి
మామయనకను గంసుని మడియఁజేసి
వీరుఁడనుకొన లోకులఁబీడనొంచి
పేరు గలవారితోడను వైరమూని
క్రిందుమీఁదను బడుచుండి సుందరాంగి
రుక్మిణీసతి హరియించి రోషమొదవఁ
జేసి భూపాలమౌళికిఁ జెడుగునింకఁ
జేయునున్న వాఁడేమని సెప్పువాఁడ?
వృక్షశాఖను దెవులూన వేగిరంబ
దానిఖండింప కుండినఁ దరువునంతఁ
దినక యుండునె గ్రిమముగఁ దీవ్రగతిని?
వీని నదెరీతి ఖండింపమేని యిపుడ
మనలనే కాదు జగమెల్ల మాపఁడొక్కొ?
తన్నుగాననివీఁడె యావెన్నుఁడేని
మఱియు శ్రీయుంబె యొకట నిద్దఱినిమ్రింప.
శక్యమో కాదొ యనలేదు సంశయంబు.
పూనియేకాగ్రచిత్తత వానియందె
దృష్టినిలిపిన నొక్కడికేగఁ గలఁడు?
తడవు సేయక యత్నింపఁదలఁతురేని
పడకయుండునె మనబాహుబంధమందు?
మనదు ధాటికిఁ గాదె మున్మధుగవిశిచి

తరలిపోవుట జలరాశి మఱుఁగుఁ జొరుట?
లెక్క వెట్టిన నిట్టివి పెక్కు గలవు
వలదు వలదింకఁ దడయుటంగ వలను గాదు
లెండు నడుములు గట్టుఁడు రండు పోర॥

సుసీ—గీ॥ రాజపరమేశ వినుత వీరవ్రతావ,
రాజమస్తక ముకుట విరాజమాన
పాదపంకజ, భవదీయ వాక్యసరణి,
దంతవక్త్రుని శౌర్యప్రదాయసూక్తి
ధోరణి, జనప్రవాద ప్రచారములును,
వినినఁ గ్లైను నామది వెక్కసంబు
ఱాల్పులను జంపి మాయల సల్పఁగొన్ని
శ్రీధరాచ్యుత గోవింద మాధవాది
నామధేయంబు లిడి మూఢ నరులు వొగడ
విఱ్ఱీఁగుచుఁ దలయెత్తి కఱ్ఱివంద
తలఁకుఁదగనట్టి పనులను దఁచుచున్న
మిన్నకుఁడుట యొప్పునే మన్నతేఁడ?
మొగ్గలోపల శాత్రవు నుగ్గుసేయఁ
జూడకుండినఁ బిమ్మటఁ గేడు మూఁడు॥

మంత్రి- సీ॥ చైద్యసర్వంసహాధీశ, శత్రునాశ,
విపుల సద్గుణసంశీల, వీరపాల,
పారమతులార, సత్సహాకారులార,
విన్నవించెద నేనొక్క విన్నపంబు
కరుణతోడుత నాలించి కార్యకరణ
సాధనాస్పదయోచన సలువరయ్యా.
మనదుశత్రువు కృష్ణుండు మహితబలుఁడు.
సులభసాధ్యుఁడటంచును దలఁపరాదు.
బద్ధవైరుండు మనయెడఁ బ్రబలముగను.

మాధవుఁడో లేక సామాన్యమానవుఁడో
యనెడు సందేహాకలితమా యంశములను
బ్రస్తుతంబున నిడి పరిప్రశ్నమునను.
బల్లిదుండైన రిపునిపై బవరమునకు
నరిగి వెళ్లుట మనకిప్పు డుత్తమంబ
యనెడు విషయంబు యోచింపు డాత్మలందు.
అపచయంబున నరియుండు నపుడుగాని
యుపచయంబున దానుండు నప్పుడైన
యాన మొనరింప యుక్తమా నండ్రు బుధులు.
వైరియుద్ధతినుండిన సారమతులు
గమనకాలంబు కాదండ్రు కలహమునకు.
మున్ను రుక్మిణిఁ గృష్ణుండు గొన్ననాటి
కన్న నిప్పుడు వానికి నున్నయట్టి
న్యూనతయు మనకుఁగల మహోన్నతియును
దలఁప నేమియుఁ గనరాదు తథ్యముగను.
మఱియు రుక్మిణిఁ బెండ్లాడి మహితసుఖము
నొందుచు నుదాత్తుఁడై శౌరి యున్నవాఁడు॥

ఇంతియుగాక మేనత్త మేనమామబిడ్డలైన శిశుపాల కృష్ణులు సహజమిత్రులు. అట్టియెడ శత్రుత్వం బసహజంబు. సహజమిత్రత్వంబున మిత్రత్వంబును సహజశత్రుత్వంబున శత్రుత్వంబును బలవత్తరంబులగు. తద్వ్యతిరిక్తంబులు బలహీనంబులు. అపకారకార్యవశంబునం గలిగిన కృత్రిమశత్రుత్వంబు స్థిరోపాధి లేనిదై చిరకాలంబుండక సామోపాయంబున నశించు. భూపాలుండు దేశకాలభేదంబుల నరసి సంధివిగ్రహాది గుణషట్కవిజ్ఞానంబున బ్రజాక్షేమోపయోగంబుగ బాలింపన నిహతశత్రుకుండగు. తద్విరుద్ధప్రవర్తనంబున దేశక్షోభంబునకుఁ గారణుండై యాపదకారుండై యుగయుగంబున నపఖ్యాతికిం బాలగు. అపాత్రశీలుండగు రాజు ప్రజాక్షయంబునకును ధనవినాశంబునకును మూలాధారుండై యరాతులకుం జిక్కునఁ జిక్కుటయు నొక్కసమయంబునఁ బ్రాణంబు గోలుపోవుటయుం దటస్థించును. అందువలన దేశంబరాచకంబగు.

ఆ॥ "ప్రియము నలికెడు వారిన పెద్దమెత్తు
రప్రియంబును బథ్యంబు నైన పలుకు
తగిలి విననొల్ల రటుగానఁ దానిఁ బ్రీతి
బలుక రెవ్వరు నుత్తమప్రతిభులయ్య॥"

గీ॥ "మొదల నప్రియ మయ్యును దుదిఁగరంబుఁ"
బ్రియముఁ బథ్యంబు నగుదానిఁ బ్రీతిఁ బలుక
వలయు బలిమినైన హితులు వసుమతీశ.
కానయానంబు యుక్తంబు కాదుమనకు॥

శిశు—గీ॥ దంతవక్త్రనుసీథ సందర్భవాక్య
విసర సంజాత నిర్వ్యాజ విమలశౌర్య
ధైర్యసాహసముఖ వీరధర్మమేఘ
చయము సచివోశనా నీతిసారవాత
ధూతమైనట్లు పైకి వేదోఁచుమదికిఁ
గాని తర్కింప సత్యంబుఁ గానగును॥

అదియెట్లంటేని నందనందను నసహాయ శూరత్వంబు మన మాగధు నష్టాదశ దండయాత్రా కారణమందును, గాలయవన చోదితుండై ముచకుందు గుహాంతర్గతుండగుట యందును దెల్లంబయ్యె. వైవాహిక ప్రయత్నంబుల నప్రమత్తులపై యేమఱియుండఁ బౌరుష క్రియాపారంగతం జూపిన వాని ప్రతాపంబింతంతననేలా? మ్రుచ్చిలించిన పదార్థ రక్షణార్థమై దండపాణ్యమాన మానుండగు వానిని సుఖోన్నతిం దలంచిన యాదవు సుఖోదాత్తత స్పష్టంబగు. మఱియు సహజ శత్రుమిత్రులు సమయానుసరులై యేదోయొక పక్షంబున నుందురు. ఉపకార స్వభావుండైన సహజ శత్రువుతోనైన సంధి సేయందగు. అపకార స్వభావుండగు సహజమిత్రునితోనైన సంధి యకర్తవ్యంబు. కృష్ణుండునునయెడ నపకార స్వభావుండయి మహాపకారంబునెలిపె. ఇంకను సలుపనున్నవాఁడు. కావున వానితో సుహృద్భావంబున మనికి యురంబున నురగంబుతో మనికియె. మఱియుఁ గృష్ణకృత పరాభవంబు సహింప నశక్యమైనది.

గీ॥ పరిభవమ్మునసొమ్ము భూపాలురకును
శౌర్యమగుటను వైరిజువార్యలీలఁ
జేసిన యవజ్ఞ తాల్మినైఁ జిత్తగించి
వసుధ జీవించువాఁడు జీవచ్ఛవంబు॥

గీ॥ పరిభవముఁ బొంది యల్పుఁడు బ్రతిహతిఁ జేయఁ
గలపకుండునె యెంతయుఁ దాల్మిఁబూని
"పాదహతమైన రజమును బైకినెగసి
మస్తకారోహణము సేయు మానునెక్కు॥"

కావున మంత్రివరా, యేతత్కారణంబున నా యానోద్యమంబు నంగీకరించి యాత్రాయత్నంబుల సత్వరంబుగఁ జేయింపుము. మనపక్షంబు వారలగు జరాసంధ రుక్మి పౌండ్రకవాసుదేవాది వసుంధరాధీశుల సాహాయ్యంబు సేయ నంపుము.

మంత్రి—దేవరయాజ్ఞ నవహితమ్ముగ మన్నించువాఁడ. (అని నిష్క్రమించును.)

శిశు—సేనాధ్యక్షా, మదీయ బలంబుల సమరసన్నాహంబున నుంచుము.

సేనా—మహాప్రసాదము. (అని నిష్క్రమించును.)

దంత—అన్నయ్యా, భ్రాతృసూనుండగు నానీచునియందలి ప్రేమచేఁ దల్లియగు సాత్వతీదేవి సేయు బోధనలకు మాత్రము నీవు పరాఙ్ముఖుండవు కావలయును.

శిశు—అందులకు నీవు సందేహింపకుము.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

తృతీయరంగము—ప్రమదావనమున దుర్గాలయము.

[గౌరీపూజ సేయఁ జారుమతీదేవియుఁ బూజాద్రవ్యంబులంగొని మాలతియుఁ బ్రవేశింతురు.]

చారు—మాలతీ, గౌరీపూజార్థము పూజాద్రవ్యంబుల నిటఁ దెమ్ము.

మాల—ఇవె పూజాద్రవ్యంబులు. (అని యిచ్చును.)

చారు—(అందుకొని గౌరిం బూజించుట నభినయించుచు.)

శ్లో॥ వందేపర్వతవల్లభ ప్రియసుతాం వందేసువర్ణ ప్రభామ్
వందే పన్నగ భూషణార్ధవపుషీం వందే జగద్రూపిణీమ్

వందే నీరజసంభవాదివినుతాం వందే పురారిప్రియామ్
వందే భక్తజనావనీం శుభకరీం వందే సదా శాంకరీమ్॥

శా॥ దేవీ శాంభవి నీదుపాదయుగళీ దివ్యాంబుజాతంబులన్
భావంబందునఁగొల్తు భక్తివినయవ్యాపారపారీణతన్
భావోద్భూతవికారసంజనితతాపం బెంతయుం బాపి వే
బ్రోవని వేఁడెద నాదునాథుఁ గరుణన్ బూర్ణేందుబింబాననా॥

[శిశుపాల వాచాలురు దేవాలయస్థలంబునఁ బ్రవేశింతురు.]

శిశు—వయస్యా, చూచితివా యీయారామ మెంత మనోభిరామంబుగా నున్న దో! దక్షిణపుష్పారామంబుపైనుండి వచ్చు నీప్రభాతవాతపోతంబు లీప్రమదావనంబు నంతయుఁ బరిమళసంభరితంబుగ నటులఁ జేయుచున్నవి. ప్రాగ్గిరి నుదయించు బాలభానుని యరుణకాంతిప్రసారంబున నీయనతరుగుల్మలతాదులు బంగారునీరుపూసినవిధంబున విరాజిల్లుచున్నవి. ఆహా! ప్రభాతమార్తాండబింబము ప్రత్యూషతేజంబున నెట్లు దీపించుచున్నది!

సీ॥ తనరాజ్యమును దాయఁగొననున్న కైవడి
నెలకళాహీనుఁడై వెలరువాఱ,
జ్ఞానోదయమున నజ్ఞానసంఘాతంబు
సమయులీలను దమచ్ఛటలుజాఱ,
కాంతోదకమ్మునఁ గడిగినవడువున
దిఙ్ముఖంబుల వింత తెలివిసేర,
కిరణహస్తమ్ములఁ గిలిగించ నాథుండు
సరినవ్వననఁగఁ దామరలు దేఱ,
గీ॥ కోకమిథునంబులకు నెంతొ కోర్కెలూర
తరులపక్షుల కలకలధ్వనులుమీఱ
గైరికాంశువు లెల్లెడఁ గలియఁబాఱ
భానుఁడుదయించె లోకైకబాంధవుండు॥

వాచా—మిత్రమా, యిపుడు నీవు దేవీసహితుండవై యున్నచోఁ బద్మినీసహితుండవై న రెండవభానునింబోలి ప్రకాశింతువుకదా!

శిశు—వాచాలా, నేటి రాత్రి తురీయయామంబునఁ బ్రణయకోపావేశంబున నయనాగారంబువీడి బాష్పబిందువులొలుకు నరుణనేత్రంబులతో వెడలిపోయెను. అంతటనుండి నామనం బింతింతనరాని వంతకుం దావలమైయున్నది. నాబహిఃప్రాణంబగు దేవిం బ్రసన్నురాలం జేసికొను భాగ్యంబు నాకెప్పుడబ్బునో?

మాల—(శిశుపాలునిం జూచి దేవితో) మహారాజ్ఞీ, మహారాజుగారిటకే విచ్చేసియున్నారు చూడుము.

చారు—(చూచి ముఖము ముడుచుకొని) ఎవరువచ్చిన నాకేమి? నా త్రోవ నేబోయెద. (అని వేఱొకత్రోవం బోవుచుండును.)

వాచా—మిత్రమా, నవవధూరత్నంబు దూరంబున నాథుం దిలకించి పెడమోము పెట్టి తరుఁగిడుచందంబున గౌర్యాలయంబు వెలువడి నీవంకఁ బెడమొగంబు సేసి చారుమతీదేవి యాదెసఁబోవుచున్నది చూచితివా?

శిశు—(చూచి ససంభ్రమముగ నరిగి గడ్డముపట్టుకొని)

ఉ॥ నేరములేని నాయెడల నేరమునూఁదిక మోపి నిర్దయా
కారత నేచ నెంచెదవు కానొకొ నే భవదీయభృత్యుఁడన్
దీరనిరాచకార్యములఁ దీఱక నేతడయంగ దోసమే
సారసనేత్రి నాయెడఁ బ్రసన్నవు గాఁగదె నిండుప్రేముడిన్॥

(అని ముద్దిడును.)

చారు—(ముఖముం ద్రిప్పికొని చేతిని విదిలించి) అఖండభూమండలాధీశులైన నేతఁబోతుల శిక్షించు సార్వభౌముల కెడలనా నేరము మోపుట! తీరని రాచకార్యములచేతనో వలరాచకార్యముల చేతనో తడయకుండఁగఁ బ్రభువుల నెవ రాజ్ఞాపింపఁగలరు? కాకపోయిన నాకేలయాగోడవు? పూజ్యారాలను సత్తుగారికిఁ బాదాభివందన మాచరింపఁ బోవలయు. (అని తప్పించుకొని మాలతితో నిష్క్రమించును.)

శిశు—ఆఁ! ఏమది! వెళిపోవుటయే! ఈనీలెంకను నీవాజ్ఞాపింపరాదా? దైలికాఁడా, నోఁటివు కాలుసిపోయినట్లు దేవియదృశ్యయై నామనంబు మఱింత యంధకారబంధురముగఁ జేసినది! ఇఁక! నేనెంత మూఢుండనో వివేచించితిని! (అంతట వ్యాపించిన మహాతేజమును నిరూపించి యాశ్చర్యముతో) ఏమి యీవింత! నామనంబున విరహతిమిరంబు ప్రవేశింప నందలి తేజస్సు బయలువెడలిన

విశ్వంబున నేమి యీయద్భుత శుద్ధతేజము! జగత్తునెల్ల నుక్కుమ్మడి సహస్రసహస్రకిరణప్రభాభాసురంబుగఁ జేయుచున్నది.

శా॥ ఉన్నంతంగడు నద్భుతంబుగ జగం బుత్కృష్ట తేజంబునన్
జెన్నారెన్ వెసఁ బ్రాణికోటి ధరణి న్నిశ్చేష్టతం జెందగన్
మున్నెన్నండిది కన్నవిన్నదియుఁగా బోధింప లేదక్కటా
కన్నుల్ దిగ్గన మూతలంబడసె నీగాఢ ప్రభాతీక్ష్ణతన్॥

ఈవిశుద్ధ తేజఃపుంజంబున నీ ధాత్రీమండలంబెల్ల ధవళితంబయ్యెనే!

సీ॥ శైలరాజంబులు కైలాసగిరులయ్యె
నండజంబులు రాజహంసలయ్యె,
నుత్తమాశ్వములుర్వి నుచ్చైశ్శ్రవములయ్యె
ధాత్రీజములు దేవతరువులయ్యె,
హస్తిసమూహంబు లైరావతములయ్యె
వార్ధులెల్లను క్షీరవార్ధులయ్యె,
నెందుపద్మంబులు పుండరీకములయ్యె
నంగనల్ శారదా భంగిదనరి

గీ॥ రిట్టివింతలు చూడంగ నింతలోనఁ
బుట్టియుంటకుఁ గారణంబెట్టులయ్యె
నహహా! యోచింపఁ గల్గునే యజుఁడునైన
వేయి మొగములుగల పాపరాయుఁడైన॥

హాచా — మజ్జారే! (తన దేహంబుఁ బరికించి) ఈ రొమ్ముల్లనాదే? నేను నేనే? ఏమి యాగడము! "చల్లవద్వల్ల కుక్కారోః" అని యంతా తెట్టతెలుపై కల్గుమిది సురుఁగువలె నుల్లసిల్లుచున్నది!

మగంధి॥ తెల్లకోడి రెక్కఁబోలి తేజమెల్ల దిక్కులన్
బల్లుకుంచుఁ గ్రొమ్మకుక్క పళ్ళ కాంతు లీనెడున్
బొల్లి యెల్లుపిల్లి కళ్ళు పువ్వునంటి జుత్తుటన్
గొల్లగాముచున్న దెల్ల కుంభినీదనం బ్రాగిన్॥

(ఆకాశము వంకఁజూచి) ఆఁహాఁ! తెలిసినది.

శిశు — వాచాలా, యేమి తెలిసినది?

వాచా — నేను నేనేయని.

శిశు — నీవు నీవేయని తెలిసిన నందుఁగల వింతయేమి?

వాచా — అందుఁగల వింతకుఁ గొంత కారణం బూర్ధ్వంబునఁ దిలకింపుము.

శిశు — (పైకిఁజూచి) ఓహో! మహానుభావుఁడగు నారదమహర్షి గగన మార్గంబున నిటకు వచ్చుచున్నాఁడు? పగలింటి దొరవలె నెంత తేజోవంతుఁడై యున్నవాఁడు!

(మహతిం జేతఁబూని గగనంబున నారదుండు ప్రవేశించును).

నార — నారాయణా, నారాయణా ♦ నా-రా-యణా। శ్రీమన్
నారాయణా, నారాయణా ♦ నా-రా-యణా। భగవన్ నారాయణ॥

1. సారా హీనమైన సం ♦ సార సాగర మీఁది।
పార మెందుఁ బొందరాని ♦ పామరులు వేడఁ బ్రోచు॥ నారా॥

2. అండ పిండ భాండ బ్ర ♦ హ్మాండము లంతటను।
నిండి యేరికంటఁ బడక ♦ యుండునట్టి కన్నతండ్రి॥ నారా॥

3. కరము లమర నొకటిగాను ♦ శిరము నందు ముకుళించి।
మొరలిడు వారిఁ గాంచి ♦ కరుణ తోడ నేలు సామి॥ నారా॥

4. ధరణి వరాహ నారసింహ ♦ దాస హృదయమందు నెప్డు।
స్థిరముగాను వెలసియున్న ♦ ముర హర నర సింహా॥ నారా॥

(స్వ.) చ॥ కలహమె కూడు నాకగుటఁ గ్రన్నన దానిని గూర్పధారుణీ
తలమున నాకమందు బలిధామమునం జరియించుచున్ సదా
కలహవినూత్న మార్గములఁ గాంచి రగుల్చుచుఁ గుంచెవీచుచున్
మెలఁగుచునుందు నెప్పుడిట మేకొని పెంచెదఁ బూర్వవైరమున్॥

గీ॥ కాంత రుక్మిణి పరిణయ కాల మపుడు
మాధవుని రేపి రేపించి మలయఁజేయ

వైరపావక కీలలు మీరగగ్గి
యల్లనల్లనఁ జల్లారినట్టులయ్యె॥

(భూతలంబునకు దిగి ప్రవేశించును.)

శిశు—(సమీపించి కరములుమోడ్చి) సురమునిసార్వభౌమా, యిదే నాప్రణామం బుఁ గైకొనుము.

నార—కల్యాణసిద్ధిరస్తు.

శిశు—తమయమోఘాశీర్వచనంబున ధన్యుండనైతి. ఈ చంద్రకాంతశిలావేదిక నధిష్ఠింపుఁడు. (అని వేదికంజూప నందు నారదుండును నాప్రక్కను శిశుపాలుం డును కూర్చుందురు.)

వాచా—(స్వ.) ఈయాశీర్వచనము దెప్పిపోదుపో నూతనకలహాంకురమోకదా! (ప్ర.) కలహాశనులవారికిదె నాదండంబు (అని నమస్కరించును.)

నార—మనోవాంఛాఫలసిద్ధిరస్తు.

శిశు—మహాత్మా, భవదీయ నిర్హేతుక జాయమాన కరుణాకటాక్ష వీక్షణంబులఁ గృతార్థుఁడనైతి.

ఉ॥ ఎచ్చటనుండి యెచ్చటికి నిచ్చమెయింజనుచుండి యిప్పుడీ
వచ్చుట మీయహేతుక కృపారసవృష్టికిఁ బాత్రుఁ జేసినన్
గ్రిచ్చటఁ బ్రోవనెంచుటకుఁ గారణమెంతయు నాదరంబుతో
నచ్చుపడంగఁ దెల్పిముదితాత్మునిఁ జేయ మహాత్మ వేఁడెదన్॥

ఉ॥ వానిదె భాసురాన్వయము వానిదె భాగ్యవిశేషమెంతయున్
వానిదె పుణ్యజీవనము వానిదె సార్థకమైన జన్మమె
వ్వానికిఁ గల్గనేర్చు ననపాయముగా భవదీయ దర్శనం
బో నళినీభవాత్మజ మహోన్నతుఁడన్నిటవాఁడె ధాత్రిలోన్॥

నార—క॥ ముల్లోకంబులఁ దిరుగుచు
నెల్లెడలంగలుగు వింత లీక్షించుటచే
నుల్లంబు సంతసించెను
సల్లలిత బ్రహ్మసభకుఁ జనియెదనింకన్॥

శిశు—ఋషివర్యా, మదీయ విజ్ఞాపనంబొండు కలదు. సాహసంబు మన్నించెదరేని విన్నవించెద.

నార—రాజేంద్రా, భవద్విజ్ఞాపనాంశం బెద్దియొ వక్కాణింపుము.

శిశు—గీ॥ పరమపావన మీదృష్టి పథమునందుఁ
బడిన వింతల యందొక్క బహువిచిత్ర
మైనదానిని సదయత నానతిందు
కాదనకనాదు హృదయంబు కందళింప॥

నార—(స్వ.) నాయుద్యమ బీజంబు నాటవేయుట కిదె యుచితసమయంబు.

(ప్ర.) క॥ జననాథ నీమనమ్మున
ఘనముగ నెలకొన్న దానిఁ గౌతూహలినై
వినిపింతు నవహితమ్ముగ
వినుమెంతయు వీనులొగ్గి వేడుక కదురన్॥

శిశు—సంయమీంద్రా, యిదె సావధాన మనస్కుండనైతి. సెలవిమ్ము.

నార—రాజేంద్రా, యింద్రలోకంబునుండి ద్వారకానగర మార్గమున వచ్చుచుఁ గృష్ణసందర్శన లాలసుండనై యటకేగి యాతఁడు ప్రాగ్జ్యోతిషంబునకు భగదత్తునిపై దండెత్తిపోవు ప్రయత్నంబున నుండఁజూచి మరలునపుడు తత్పురపరిసరస్థిత రైవతక కేళినగర ప్రాంతపంథంబున వచ్చుచుండ,

చ॥ నిలకడఁగన్నఁ క్రొమ్మెఱుంగు నీరదముగా వెలువడ్డ శీతరు
క్కల సురధామమున్విడిచి క్ష్మాస్థలిని న్విహరించు నప్సరో
లలన చలత్వముంగని చెలంగెడు బంగరుబొమ్మయో యనన్
జలరుహనేత్రయొర్తు పవనమ్మునఁ గాన్పడె మోహనాకృతిన్॥

చ॥ చిలుకల కొల్కికన్నుగవ చేరలఁగొల్వగ మించు మబ్బులన్
వెలఁగొనుఁ బెన్నెరుల్ బొమలు విండ్లకు నేర్పెడు విభ్రమంబులన్
గలువలతేని యందమును గాదను నెంతయు ముద్దుమోము తా
నలరుల కందుకమ్ములను హాస్యమొనర్చు నురోజయుగ్మమున్॥

గీ॥ క్రాలు నూఁగారు సౌరు మీఁగాలు తీగ
నాగకరార్కంబులను జూచి నవ్వఁజాలు
నాభి నదమును లేఁగౌను నభము గెల్చు
మోవి లోఁగొను నమృతంపు బావిఠీవి॥

శిశు — మునికుల తిలకా, యీదృశ నారీలలామ నామధారణంబునఁ బావనంబైన యక్షరశ్రేణియు నామెకులగోత్రాదులను దెలుపఁ బ్రార్థించుచున్నాఁడ.

నార — (స్వ.) నాటవేసిన బీజము మొలక యెత్తుచున్నట్లున్నది. (ప్ర.) ఆయోషారత్నము భోజవంశ సంజాతయు బభ్రునామక యదుకులోత్తమునకు వాగ్దత్తయునై సుకేశిని యను సార్థక నామంబున విరాజిల్లుచున్నది.

వాచా — (స్వ.) ఈ జిత్తులమారి పోరుదిండి కృష్ణ శిశుపాలురకుఁ దిరిగి జుత్తులు ముడిపెట్టు ప్రయత్నంబున నున్నటుల రూపించుచున్నది.

శిశు — ఋషివర్యా, ద్వారకానగర కాంతలలో నిట్టి సుందరాంగి యున్నటుల నే విని యుండలేదే!

నార — వినుటమాత్రనఁ బ్రయోజనమేమి? కండ్లుగల భాగ్యము చూచి తీరవలయును. పురుషులలో బభ్రువు ధన్యతముఁడు.

వాచా — (స్వ.) శిశుపాలుఁడీ నారదుని వలలోఁ జిక్కక తీరదు. బాగుగఁ బురియెక్కించుచున్నాఁడు.

నార — ఏలయన,

సీ॥ నీలనీరదవేణి నిరుపమారుణపాణి
పులినోన్నతశ్రోణి పువ్వుబోణి,
కువలయదళనేత్రి కుంభినీధవపాత్రి
సురుచిరచారిత్రి శుద్ధగోత్రి,
బాలేందునిభఫాల పావన శుభశీల
సుగుణాలవాల భాసురకపోల,
కాంచనమణిభూష కమనీయతరవేష
మానినీపరివేష మంజుభాష,
గీ॥ చంద్రికాహాస చంపక చారునాస
కుందసుందర రదన పూర్ణేందువదన

తరుణ పల్లవపాద గీత ప్రమోద
ఘనతర సుకేశినీ నామకాంతిసీమ॥

ఇంతియగాక,

ఉ॥ చూచితి దేవభామినులఁ జూచితి కిన్నరసిద్ధకాంతలన్
జూచితి నప్సరోగణముఁ జూచితి మానవ సాధ్యకన్యలన్
జూచితి యక్షరాక్షసుల సుందరులన్ మదినెంచి చూడనా
జూచిన వారిలో నొకతెఁ జూపఁగఁజాల సుకేశిని సమన్॥

వెయ్యేల?

గీ॥ చక్కదనముల నెల్లను సంగ్రహించి
స్వర్ణచూర్ణంబు సుధ సౌరభమును జేర్చి
మన్మథానల కీలల మఱఁగఁ బెట్టి
యచ్చుపోసిన విగ్రహ మనగ నొప్పు॥

అట్టి మనోహరిణిం గాంచిన, నిష్కాములై జటావల్కలంబుల ధరించి కందమూలాదులందిని దినంబులు గడుపు మాదృశయోగిజనంబులే మనోవికలత్వంబు నొందుచుండఁ దదితరుల మాటఁ జెప్పనేల? ఇంతకు జగదేకవీరుండును నమ్మహావిష్ణుండును నగు శ్రీకృష్ణునిచే సురక్షితంబైన ద్వారకానగరంబునందలి యునికిం జేసి యట్టి త్రిలోకసుందరి బభ్రువు మాతులునకు లభింపఁ గలదు లేనిచో నిరుపమాన తేజోరాసులగు మీబోంట్లూరక యుందురా?

వాచా—(స్వ.) ఈజగడగొండి లడాయికి డీకొల్పుచున్నాఁడే!

శిశు—(స్వ.) జగదేకవీరుండును మహావిష్ణుండునునఁట. ఈనారదుం డిచ్చగొండియై శూరమ్మన్యుఁడైన యాయాదవాధము నొకవీరుం జేసి బట్టువానివలెఁ బొగడుచున్నాఁడు. వానిశూరత్వము నే నెఱుంగనిదా? ద్వారకాపురము కాకఘూకంబులకుఁ గాపురంబుఁ జేసి యాసుకేశినిం దెచ్చిన నే చవానని యెదుగాని.

నార—(స్వ.) నామంత్రము పారినదికదా! కానిమ్ము. ఇఁకఁ దృప్తికరంబగు విందుం జూఱగొందును గాక! కలహానలమా! కాఱుచిచ్చువలెఁ దరికొని ప్రజ్వరిల్లుము. (ప్ర.) శిశుపాల భూమిపాలా, పేమిటవచ్చి తడవయ్యె. ఇఁకఁ బోయి వచ్చెదము.

శిశు— దేవరచిత్తము.

(నారదుఁడు పూర్వోక్తంబుగ గానం బొనర్చుచు గగనమార్గంబున నిష్క్రమించును.)

వాచాలా, వింటివా నారదోక్తంబంతయు?

వాచా—ఆహా, వినుటయే కాదు దానిఫలంబుఁ గనుటకుఁగూడ సిద్ధంబుగ నున్నాను. వయస్యా, యాకలహస్వభావుని నీవెఱుంగవా?

శిశు—ఎఱుఁగ కేమి? వాని కలహ శీలత్వమటుండనిమ్ము. కృష్ణకృత తిరస్కారంబునకుం దగిన ప్రతీకారముఁ దలంపునకుఁదెచ్చి మహోపకారంబు చేసెఁగదా! ఇప్పటికి నీదయవల్ల నాకున్నిశిత రుక్మిణీవిరహ సాగరమీద యొకవిధంబున దరిఁజేరఁగంటి. ఇప్పుడకస్మాత్తుగా తటస్థంబైన సుకేశినీ సౌందర్య వర్ణనా కర్ణనంబునం గలుగు మదనానల జ్వాలలంబడి సమయకుండఁ గాపాడు దైవంబు మరల నీవుదక్క వేఱొండులేదు. (అని రెండు చేతులం బట్టుకొనును).

వాచా—మహారాజా, నారదుండు చెప్పినది నీకు సుకరంబనియే తలంచితివా?

శిశు—క॥ ఇమ్ముగ సుకరంబైనను
వమ్మై దుష్కరమె యైన వనితామణినీ
వెమ్మెయినైనం దేవలె
నమ్మము లేకున్న జీవనమ్ము తొలంగున్॥

వాచా—గీ॥ నీదలంచిన కార్యంబు మీఁదమీఁద
నున్నదియటంచు నెంచితో యుర్వలేశ?
ద్వారకాపుర మందలి తన్వియేడ!
ధీవిహీనుఁడ నేనేడఁ దెచ్చుటేడ॥

ఈవిషయంబు వినిన లోకులు నవ్వరా? ఆనారదుమాటలు నమ్మి యిట్లందరాని పండ్లకు నాశింపఁదగునా?

శిశు—వాచాలా, నీవిట్లు పలికెదవేలా? నీసామర్థ్యంబు నేనెఱుఁగనా? ఈలోకంబున నీకసాధ్యంబైన కార్యంబెద్ది? ఎంతప్రయత్నముననైన నీకార్య నిర్వాహకంబు సేయవలయుసుమా.

వాచా—ఇదె చతురికయు సమయంబునకు వచ్చుచున్నది. దాని కుశాగ్రబుద్ధికి నసాధ్యంబెద్దియు లేదు. దాని సహాయంబునఁగాని నేనీకార్య నిర్వాహకత్వంబుఁ బూననోప.

శిశు—వలయుచో దాని సహాయంబుఁ గూడ నిచ్చెద.

చతు—(ప్రవేశించి) ఏమి? ఎవరి సహాయము?

వాచా—మఱియెవరిది? నీదియె.

చతు—నా సహాయ మెందులకు?

వాచా—నీసహాయమును నాసహాయమును మఱియెందులకు? రాజావారికి మఱియొక యమ్మవారి కొఱకు.

చతు—నీవు మాటకారివని కాంబోలు నోటికి వచ్చినట్లు ప్రేలుచుంటివి. దేవిగారితోఁ జెప్పి దయ్యమువదలునట్లు వీఁపుమీఁదఁ జీఁపురుఁగట్టలు విరిపించెదను చూడు.

వాచా—నా వీఁపుమీఁదనా మిత్రుని వీఁపు మీఁదనా?

శిశు—నీయడ్డునుడి మాటలచే నదియు నిజమైనం గావచ్చును. చతురికా, యీ వాచాలుఁడు వాచాలుఁడు కదా! వానిమాటలకేమి? నీవలన నొక్క కార్యము కావలసియున్నది. వీనింగూడి యాపని నెఱవేర్చితివేని నీకొక్క యమూల్యపారితోషికం బిచ్చెద. ఈ సంగతిమాత్రము, నీపుణ్యముండును, దేవికిం దెలియనీయకుమా.

వాచా—ఆఁహాఁ! సరే! అభయమున్నదీ? అయితే యీతొత్తుకూతురున కిచ్చే లంచములో నేనొకవంతు నిచ్చుకో నక్కఱలేదు.

చతు—ఏలిక యాజ్ఞయైనచో నీమీసేవకురాలు చేయని కార్యముండునా? కాని యీ సంగతి దేవిగారికిం దెలిసిన నాపుట్టిమునుఁగును.

శిశు—అందులకు నీవు సందేహింపకుము. దేవి కీవిషయమై తెలియనేరదు.

చతు—అయినచో నేలిక యాజ్ఞ శిరసావహించెద.

వాచా—అట్లైతే నీకిచ్చే యుపాయనమేదో చెప్పివేతునా? మహారాజుగారి మనంబు సంతోషించినచో నీమనస్సంతోషార్థము నన్నే నీకిచ్చి పెండ్లిచేసెదరు. (అని పెద్దనవ్వు నవ్వును.)

చతు—నీబ్రహ్మచారి గుణాలు పోనిచ్చినావు కావు?

వాచా—బ్రహ్మచారిని గనక నే నన్నిచ్చి పెండ్లిచేయుట.

చతు—ఈ వదరుపోతుమాటలకేమి? నావల్ల నయ్యేడిదేమో మహారాజావారు సెలవిచ్చెదరుగాక!

శిశు— ద్వారకయందు భోజకుల సంభూతయు బభ్రునామక యాదవునకు వాగ్దత్తయునగు సుకేశిని యను సుందరాంగి కలదఁట. ఏయుపాయంబుననో దానిఁదెచ్చి నాకర్పింపవలయు.

చతు— సుకేశినియా? ఆమెను నేనెఱుఁగుదునే. చక్రవనంబున నామెంబోలిన యువతీలలామ లీ భూలోకంబున లేరని నేచెప్పఁగలను. కాని యీపని సులభ సాధ్యమా?

వాచా— కాదు గనుకనే నీనెత్తిని బడినది.

శిశు— ఆమెను నీవెఱుంగుదు నంటివే యదియెట్లు?

చతు— ఆమెయొక్క పరిచారిక నాపినతల్లి కూతురు. నేనొకసారి యచ్చటికివెళ్లి యుంటిని. ఎటులనో కష్టపడి యామోహనాంగి మనంబు మీయెడలందగులునటుల నేఁజేసెదఁగాని యామె నిటకుఁ దెచ్చునుపాయంబు మీరే చేయవలయును. శ్రీకృష్ణుఁడు రుక్మిణిం జేసినట్లు మీరుం జేయరాదా?

శిశు— చక్కగ జ్ఞాపకము జేసితివి, ఆపని మేము చేసెదము. నీవు నీప్రయత్నంబున జాగరూకతతోనుండి వాచాలునిఁగూడి కార్యసాధనంబు నూహింపుము.

చతు— చిత్తము. అస్వస్థ చిత్తయగుటచేఁ జేయునది తోచక తమసన్నిధానంబును విడిచి దేవిగారంతఃపురంబునకేగి పశ్చాత్తాపము నొందుచుఁ దమ దర్శనంబున కెదురు చూచుచున్నారు.

శిశు— సరే, మేము వచ్చెదమని చెప్పుము.

చతు— చిత్తము. (అని నిష్క్రమించును.)

వాచా— మిత్రమా, నీరొట్టె నేతిలోఁ బడినది. ఇఁక నంతఃపురంబునకు లొట్టలువేయుచు నడువుము.

శిశు— వాచాలా, నీవువెళ్లి సత్వరంబునఁ గరణీయంబును నాచరింపుము.

వాచా— అట్లనే కావించెద. (అని నిష్క్రమించును.)

శిశు— బలే! నారదా, బలే! నాశరీరంబుఁ గోసియిచ్చిన నీఋణంబు తీరునా? శత్రుపక్షపాతివయ్యు నెంతనిష్పక్షపాతంబుగఁ జక్రిని ప్రతీకారంబు సూచించితివి? శతానందనందనుం డేదోయొక దురుద్దేశముతో చెప్పియుండును. అయిన సుకేశినిందెచ్చుట కృష్ణుని కెయిదికిం దగిన ప్రతీకారంబగుచుండ వాని దురుద్దేశముతో నాకేల? ఆమెను దెచ్చుట రహస్యముగానా బహిరంగంబుగానా య

ని రూపించవలసియున్నది. రహస్యంబుగా నైనచో వాచాలచతురికల చాతురీమహిమంబున నలుపవలయును. రెండవవిధంబైనఁ జతుర్విధసేనాసమేతంబుగ నేగుచునే యుంటిమి. వాచాలచతురికల సహాయంబుకూడ నవసరంబైనకావచ్చును. బహిరంగకార్యంబె శిశుపాలుని కులపౌరుషంబులకుం దగినది అది సుకరమా దుష్కరమా యనుయోచన యనవసరము. ఏలయన—

గీ॥ కలవె యెందేని మనుజుండు సలుపరాని।
పనులు భువిలోన! హీనుండు తనదుశక్తి।
నెఱుఁగనేరక మొదలిడ నెంచఁ డెపుడు।
మిథ్యముఁడువీడు మధ్యను, మానధనుఁడు।
వీడఁడెన్నఁడు దుదముట్ట వెలయునటుల॥

కావున,

గీ॥ మదవతినిఁదెచ్చి మదనుని మదమడంతు।
కృష్ణునైనను నలయాది విష్ణునైన।
కదిసివచ్చిన నంపెదఁ గాలుపురికి।
చెప్పితిని సూవెమీసంబుఁ చేతఁబట్టి॥ (అనిమీసంబుపై చేయి వేయును.)

(నిష్క్రమించును.)

తెరజాఱును.

——[ ]——

ఇది ప్రథమాంకము.

శ్రీ

శిశుపాలీయము.



ద్వితీయాంకము.



విష్కంభము:—బభ్రుమందిర బహిఃప్రదేశము.

—:(చతురిక ప్రవేశించును.):—

చతు—స్వామి కార్యార్థినై వచ్చి యెట్లనో యతికష్టమునకై మధురిక యనుపేరను సుకేశినీదేవియొద్ద పరిచారికనై యామెకు నమ్మకము గలుగునట్లు సంచరించుచున్నదాన. బభ్రుభార్యకు వాగ్దత్తయని ప్రభువు సెలవిచ్చుటచే నామె మనంబు దనయెడలఁ దగులునటులఁ జేసెద నంటిని. ఇచ్చటికి వచ్చునరికిఁ బెండ్లియై కాపురంబు సేయుచు నత్యంత పతిభక్తియు గాఢానురక్తియుఁ గలిగి సుకేశినిదేవి పరపురుషుని పేరైన వినవొల్లదు. ఏదో సాధనాంతరమునఁగాని కార్యానుకూలత గానేరదు. ఈదినంబుననో రేపో మహారాజు రాఁగలఁడని వాచాలుఁడు చెప్పియున్నాఁడు. బలరామకృష్ణులు ప్రాగ్జ్యోతిషంబునుండి తిరిగి వచ్చులోపలఁ బ్రభువువచ్చిన బాగుగనుండును. ఇదె వాచాలుఁడును మాటలోనే వచ్చుచున్నాఁడు. —:(వాచాలుఁడు ప్రవేశించును.):—

వాచా—చతురికా, మొన్ననూహించిన మార్గంబెట్లున్నది?

చతు—అదిలాభించునట్లు లేదు.

వాచా—మఱియేమి సాధనము?

చతు—ఇదె చెప్పెదవినుము. (అని చెవిలోఁ జెప్పును.)

వాచా—ఇది యతిప్రశస్తముగానున్నది. ఈరాత్రియంతయు నేనీ సమీపంబుననే కాచి యుండెద. (ఇద్దఱు నిష్క్రమింతురు.)

(తెర జాఱును.)

ఇది విష్కంభము.

ప్రథమరంగము — ద్వారకాపురమున బభ్రుమందిరము.

—:(బభ్రువు ప్రవేశించును.):—

బభ్రు — ఏలకో మనం బది యొకవిధంబుగనుండి కూర్కు రాకయున్నది. వేవిత న సంగీతకళానిపుణత్వముం జూపి యిపుడిపుడె హాయిగ నిద్రింప నారంభించెను.

—:(తెరలో):—

నాథా! రక్షింపుఁడు, రక్షింపుఁడు ముక్కిడి రక్కసుఁ డీడ్చుకొని పోవుచున్నాఁడు.

బభ్రు — (తుల్లిపడి) ఆఁ! ఏమది? (అని సమీపమందలి ఖడ్గముఁ జేతఁబూని) ఎవఁడవురా దురాత్మా! నాయనుంగు చెలి నపహరించు రాక్షసాధముఁడవు? ఇదె చచ్చితివి.

శా॥ ఓరా! పాపి! మదాంధ! రాక్షస! మదీయార్ధాంగిఁ బ్రాణంబులో
నారాధ్యమణి సుందరాంగి మమబాహారక్షితన్ బల్మిమైఁ
జోరత్వంబునఁ గైకొనంగలవొకో సూక్ష్మంబుగానిట్లు? నా
ధారాళంబగు ఖడ్గఘాతమున నీదౌర్జన్యమున్ మాన్పెదన్॥

(అని యటునిటుఁ బరుగెత్తును. తెరలేచును. సుకేశినిపాన్పు సమీపించి) ఇదె నాబహిఃప్రాణము కూర్చుండియున్నదే! ప్రాణనాయికా! కలవరించుచుంటివా యేమి? భయపడకుము నేనిక్కడనే యున్నాఁడ.

ఉ॥ అండజయాన నేనిటుల హస్తమునం గరవాలమూని నీ
యండను నిల్వ నీవిటు భయమ్మును నొందగ నేల? నీయెడన్
దుండగమాచరింపఁగల దుర్మదుఁ డెవ్వఁడొ వాని నిష్ఠ యా
ఖండలునైనఁ జెండనొకో కండలు కండలుగాఁగ నేఁ ద్రుంతున్?॥

సుకే — (కన్నులువిప్పిచూచి) అమ్మయ్య. ఎంతదుర్మార్గము! నాథా మీరేనా యిక్కడ? మఱియెవ్వరును లేరా?

బభ్రు — (సుకేశినీసమీపమునఁ గూర్చుండి) ప్రియా, నేనే మఱియెవ్వరును లేరు. స్వప్నమువచ్చినదా? ఆదుర్మార్గమేమి?

సుకే—ఓను. ఒకరాత్రించరుఁడు చతురంగ సేనాసమేతుఁడై వచ్చి, ద్వారవతి ముట్టడించి, యాదవానీకంబుల నోడించి, బలత్కారంబుగ నన్నుం గొని పోవుచుండె. ఇంకను నాగుండె లెట్లుకొట్టుకొనుచున్నవో చూడుఁడీ (అని భర్తృకరంబుదీసి తనహృదయంబుపై నిడుకొనును.) ఇంతదుస్స్వప్నమైనది యేమి కానున్నదో కదా!

బభ్రు—ప్రియా, కలనిజమగునా? అందులకేల భయము?

సుకే—ప్రాణనాథా, యిప్పుడెంతరాత్రియైనది?

బభ్రు—(పైకివెళ్ళివచ్చి) ఆఱుగడియల రాత్రమున్నది.

సుకే—తెల్లవారుజామున వచ్చినకల శీఘ్రముగా ఫలించునని పెద్దలు చెప్పుదురు. దీనికేదైన శాంతి నూహింపుఁడు.

బభ్రు—సరి, యట్లనే చేయుదము. మధురికా! (అని పిలుచును.)

మధు—(ప్రవేశించి) ప్రభువరా యేమి సెలవు?

బభ్రు—ఇప్పుడంతయు వినుచుంటివికదా! వెళ్లి యొకబ్రాహ్మణపుంగవుని గొనిరమ్ము.

మధు—ఇదె తోడితెచ్చెద. (అని నిష్క్రమించి యొకబ్రాహ్మణునితోఁ బ్రవేశించును.) ఈతండె బ్రాహ్మణుండు. ప్రాతస్స్నానంబునకేగుచుండఁ దోడితెచ్చితిని.

(బభ్రుసుకేశినులు బ్రాహ్మణునకు నమస్కరింతురు.)

బ్రాహ్మ—ఇష్టకామ్యార్థసిద్ధిరస్తు. రాజోత్తమా, నన్నేల పిలువనంపితివి?

బభ్రు—విప్రోత్తమా, ద్వారకాపుర నిర్బంధంబుఁగావించి యాదవులనోడించి తన్నొక్క మాంసాశనుండు బలత్కారంబుగఁ గొనిపోయినట్లీ వనితామణికి స్వప్నంబయ్యె. అందులకుందగిన యుపశాంతిఁ దెల్పఁగోరెద.

బ్రాహ్మ—(ఆలోచన నభినయించి) ఇందువలన నేమియు భయములేదు. ఈమె యీ దినంబున నుపవసించి, బ్రాహ్మణపూజయు, గ్రహశాంతియు, గావించి, యపరాహ్ణానంతరంబున కాత్యాయనీదర్శనంబొనరించి, తత్సమీపంబుననున్న సిద్ధాశ్రమంబున కరిగి యందుఁ దీర్థప్రసాదంబులం గొని గృహంబున కేతెంచి, బ్రాహ్మణ సహితంబుగ భోజనమాచరించి, యాబ్రాహ్మణులకు సువర్ణదక్షిణా తాంబూలంబు లిడవలయు. అందువలన సమస్తారిష్ట పరిహారంబగుటయే కాక యఖిల రాజ్యసంపదల నొందఁగలుగును. ఉషఃకాల మతిక్రమింపకుండ స్నానంబునకు నేఁ

బభ్రు—మంచిది యట్లనే చేయించెద. తమరుకూడ దయచేసి సర్వంబు నిర్వర్తింప వలయు.

బ్రాహ్మ—అభ్యంతరమేమి? అట్లనే వచ్చెదను. (అని నిష్క్రమించును.)

బభ్రు—దేవీ, నీవిఁక సుఖంబుగనుండి యీబ్రాహ్మణోక్త ప్రకారంబున సర్వంబు నిర్వర్తింపుము.

సుకే—ఆర్యపుత్రా, యవశ్యమట్లనే గావించెద. (ఇద్దఱు నిష్క్రమింతురు.)

(తెర జాఱును.)

ద్వితీయరంగము—ద్వారకాపురప్రాంతారణ్యము.

(పైలశిష్యుండగు సాధ్వలుఁడు ప్రవేశించును.)

సాధ్వ—(ఆకాశమువంకఁజూచి) ఆహా! ఎంతపొరపాటయ్యెను! ఆకసంబించుక మేఘచ్ఛన్నంబగుటచే వేళపాడకట్టినదికాదు. అదె పునర్వసునక్షత్రంబు రెండు యామములు కావచ్చినది. ఇంకను నాల్గుగడియల రాత్రముండును. అరుణోదయంబైనఁగాని పుష్పాదులఁగోయ ననువుకాదు. అంతవఱకు నీప్రదేశంబున నొకవృక్షంబుక్రింద విశ్రమించెద. (అని యొకచెట్టుక్రిందికరిగి) ఈసృష్టివైచిత్ర్యి మెంత మనోహరముగానున్నది!

గీ॥ అంబరంబను మేల్వితానంబునందుఁ
గాచదీపంబులను నిడ్డకరణి నధిక
దీప్తిఁగ్రాల్చుచు నాలుగు దిక్కులందుఁ
జుక్కలొప్పారు నుడువీధి పిక్కటిల్ల॥

మఱియు నీయామిని యొక యువతింబోలి యొప్పుచున్నదే!

ఉ॥ చీకటి దట్టపుంగురులు చిక్కెడలించి హిమాంబు తైలమున్
జేకొని దువ్వి తారలను చెన్నగు మల్లెలఁగూర్చి కొప్పునన్
వేకువచుక్క బొట్టునిడి విశ్వశరీర దిగంబరంబులన్
బాౕకట మొప్పదాల్చి నిశి భామిని రూపముతోడఁ బొల్చెడున్॥

(తూర్పుదిశం జూచి) అదె యరుణోదయం బగుచుండుటచేఁ జెట్టది పుట్టియది యని యించుకించుక కాన్పించుచుఁ గ్రమక్రమంబున ధవళకాంతు లుప్పతిలుచుండ సమస్తంబును స్పష్టమగుచున్నది.

గీ॥ తెలుపు నలుపునఁ గ్రమముగఁ గలుపఁ గలుగు
రంగువలెఁ గాంతి తిమిరమున్ రమణఁ గలయఁ
దెల్లవాఱుచునున్నవి యెల్లదిశలు
ఉల్లసిలు జంతుసంతతి కుల్లసిల్ల॥

(నలుదిక్కులు కలయఁజూచి) బాపురే! ఏమి యీవనశోభ!

సీ॥ సప్తాశ్వ కిరణ ప్రసరణావరోధమా
బద్ధ సంకీర్ణోరు పాదపములు
పాదపాగ్రాంచిత పక్వనానావిధ
ఫలఖాదనాసక్త పక్షికులము
పక్షిసంకులకల ధ్వనిసమాహితసర
స్సలిలావగాహేభ సంచయంబు
ఇభసంచయాన్వేష ణేచ్ఛాటవీసీమఁ
గ్రిల్లుబ్బి క్రుమ్మరు కేసరులును
గీ॥ కేసరులు పండు ఫలవంత కేదరములు
కేదరంబులఁ గోరాడు కిరిగణంబు
గిరుల మృగములు శయనించు క్రిఁగలుఁగులు
గలిగి యెంతయుఁ బొల్చునీ కాననంబు.

కుసుమాదులంగోయఁ గాలమయ్యె. (అనియొక యున్నత ప్రదేశంబునకరిగి చూచి) ఏమియాశ్చర్యము! నిర్జనమైన యీ వనమంతయు నొక్కపెట్టున నీనిన విధమ్మునఁ జతుర్విధ సేనాసంకులంబైయున్నది!

క॥ కక్షము సేనాముఖమున్
వృక్షము గుల్మంబు నొక్కవృతనన్ గుల్మం
బీక్షణ మొక్కగణంబును
నీక్షణమునఁ గనిన యట్టు లిలసేన దగున్॥

(అని యొక ప్రక్కఁజూచి) ఇదె యెవరో యుద్ధట భటులు వచ్చుచున్నారు. వీరి వైఖరిఁజూడ నాకొఱకే వచ్చుచున్నట్లున్నది. (భయసంభ్రమంబుల నభినయించుచు) అయ్యో! ఇంకేమి సాధనము? ఇదే వచ్చుచున్నారు. నేనేమిసేతు

నుని పలాయనంబే ప్రయోజనకారి. చరణ యుగ్మమా నీబలంబుఁ జూపింపుము.
(అని పరుగెత్తును.)

భటులు—(ప్రవేశించి) ఎవఁడా పారిపోవువాఁడు? నిలువుము, నిలువుము. లేనిచో మాబాణంబులు విడిచిన నీప్రాణంబులు విడువఁగలవు. (అని పట్టుటకు వెంటఁ బెట్టుదురు.)

సాధ్వ—(భయముచే వణుకుచు నిలువఁబడి) అయ్యా, మీరెవరో నేనెఱుంగను. సుమాదులంగొన నీవనంబునకు వచ్చితి. నేనేమియుఁ దప్పు సేయలేదు. నన్నుఁ బోనిచ్చినఁ బోయెద.

ప్రథ—నీవెక్కడకుఁ బోయెదవు?

సాధ్వ—ద్వారకను న్న మాగురువుల యొద్దకు.

ద్వితీ—నీవు ద్వారకాపురికిఁ బోవుచున్నచో నిన్ను విడువరాదని మాదళవాయి గారి యాజ్ఞ. నిన్నాయనవద్దకుఁ గొని పోవలయును. రమ్ము. (అని చేతులు వట్టుకొని లాగును.)

సాధ్వ—(ఊడిగిలఁ బడుచు) అయ్యో నేనేమి చేసితిని? అయ్యలారా, నేను బ్రాహ్మణుఁడను. తల్లికొక్కరుఁడను. కరుణింపుఁడు.

ప్రథ—నీవెవఁడవైన మాకేమి? సేనాధిపతియొద్దకు రావలయు.

ద్వితీ—(సాధ్వనుని మొలఁద డుమును.)

సాధ్వ—భటాగ్రేసరులారా, నిన్నటి పాత్రస్నవన సమయంబున దొరకిన దక్షిణ పది నిష్కంబులు మాత్రము నాయొద్దనున్నవి. కావలసిన వానింగొని నన్నువిడిచి పెట్టుఁడు. (అని గెడ్డము వట్టుకొని బ్రతిమాలును.)

ద్వితీ—(ప్రథమునితో జనాం.) నేస్తకాఁడా, యేమనియెదవు? పదినిష్కంబులనం పాదించుట యెంతకష్టమో యోచింపుము.

ప్రథ—(జనాం.) నీమాటనిజమే కాని మనరాక పురంబునఁ దెలియకుండుటకే యీ పర్వతపు మాటున వనమున విడియుట. ఈబాపనయ్యను విడిచిపెట్టినచో సమాచార మెఱుక పడఁగలదు. సునీథుండు మనల నేనుఁగు కాళ్లం ద్రొక్కించి నం ద్రొక్కించును. నిష్కంబులంగొని దుష్కరంబుగఁ జావనేల? ఇంతియ గాక లంచనుం గొనుట యొకగొప్ప స్వామిద్రోహము. ఇట్టి పాతకంబుల నతి సులభముగఁ జేయఁ కలికాలము వచ్చుచునే యున్నదనియు, నప్పుడు మనవం

టి భటులే కాదు సేనాధిపతులు, మంత్రులు న్యాయాధిపతులు, తుదకు గురువులు, రాజులును గూడ స్వేచ్ఛగా నుత్కోచంబుల స్వీకరించుచు శవంబులఁబీఁకెడు సృగాలంబులరీతిఁ బ్రజల ప్రాణంబులఁ దినుచుఁ దుదకుఁ బురుగుల గుంటకుఁ బ్రాప్తి యగుచుండెదరనియు, పెద్దలు చెప్పుచుందురు. అట్టికాల మాసన్న మగుచుండుటచేఁ గాఁబోలు నీకిట్టి దుర్బుద్ధి పుట్టినది.

ద్వితీ—(జనాం.) లంచము కోరియిచ్చినను దోషమేనా?

ప్రథ—(జనాం) ఆహా! కోరియిచ్చినను, బహుమతి మొదలుగాఁగలమాఱుపేరులు పెట్టియిచ్చినను పుచ్చుకొన్నను లంచము లంచమే. తుదకు గొంపముంచకమానదు.

ద్వితీ—బాలుఁడా, మాకు నీసొమ్మునువద్దు, శోకమునువద్దు రమ్ము సేనాపతిగారి యొద్దకు. (అని గెంటుకొని నిష్క్రమించును)

(తెర జాఱును.)

తృతీయరంగము— రైవతక పరిసరారణ్యమున నొకగుడారము.

(శిశుపాలుఁడు, జరాసంధుఁడు, దంతవక్త్రుఁడు, రుక్మి, సునీథుఁడు ప్రవేశింతురు.)

శిశు—మిత్రమా, జరాసంధ ధరాతలాధినాథా, మనమిత్ర మండలాగ్రవాహినీపతి సునీథుని నిరాఘాట జాగరూకతచే ద్వారకాపుర బ్రాహ్మణుఁ డొకఁడు బంధీభూతుఁడై సమగ్రంబుగఁ దెలియఁజేసిన తన్నగరవార్తలు వింటివికదా! ఇఁకపై గర్తవ్యంబేమి?

జరా—అ! రామకృష్ణులేగఁ బ్రాగ్జ్యోతిషంబుపై।
ద్వారకాపురంపు భారమిపుడు।
సాత్యకి మొదలైన సమర వీరులయంద!
నెలవుకొనెనుగాదె నెట్టనముగ॥

అందుచే ద్వారకను స్వాధీనము చేసికొనుట సులభంబును శత్రునిర్మూలనం బసాధ్యంబును నయ్యె. మనరాక విని రామకృష్ణులు తమబలంబుల మఱలించి పృష్ఠభాగంబునం దాకిన మన యుద్యమంబు కష్టసాధ్యంబగుఁ గానఁ గృష్ణమార్గ నిరోధం బవశ్యకర్తవ్యంబు.

రుక్మి—రామకృష్ణుల నవ్యవహితంబుగ నెదిరింపఁగలవీరులమాత్రము తత్కార్యంబున నియమింప వలయు.

దంత — పదిమందికృష్ణులు, గిష్ణులు, రాములు, గీములు, కలిసి కదిసివచ్చినను మనలో నొక్కొక్కరుండె మదమేపారఁదాకి సగ్గుసూచఁగావింపఁ గలవాఁడు.

శిశు — ఉ॥ మామకదోర్బలంబు మనమాగధువీరము రుక్మితేజమున్।
భీమపరాక్రమోన్నత సునీథకరూశప ముఖ్యశౌర్యమున్।
వామెదనెంచి మార్కొనగ ధైర్యము నెవ్వరు బూననేర్తు రీ।
భూమితలంబునందుఁ జెడుబుద్ధిగలారలు గాకరూపజన్॥

సునీ — ధాత్రీవరోత్తంసములారా, నావిజ్ఞాపన మించుక చిత్తగింపుఁడు. శత్రునిర్మూలనంబెతమయుద్యమంబేని ప్రాగ్జ్యోతిషాధీశువైంబోయిన యాదవు వెన్నంటి పోయి భగదత్తుం గూడియు వృథగూర్పవంబునసూ యావృథగ్జునుఁ బరిమార్చవలయు. లేనిచోఁ దతక్కృత పరాభవంబున కీడగు ప్రతీకారం బిటఁగావించి యేగవలయు. అందులఁ దమయభీష్టంబు నిశ్చయించెదరుగాక!

జరా — ప్రాగ్జ్యోతిషగమనంబునకుం దగిన సన్నాహసామగ్రులు మనకిపుడు చాలమినటకుంబోయి శాత్రవు నెదిర్చి సమరంబుసేయుట కష్టతమంబు. ఈపర్వతారణ్యనదీనదంబుల దాటిపోవుటలో మనసేనలు డీలుపడి పోరాటంబు సలుపుటకు పయోగింపవు. కావున రిపునాశనంబిపు డచింత్యంబు. కాగా ద్వితీయంబె శరణ్యంబు.

శిశు — మిత్రులారా, కృష్ణననుగమించు నాలోచన వీడి ద్వారవతీ పట్టణంబునకు ముట్టడంబుసేసి విడిసి యప్రతిహతంబైన ప్రత్యపకారంబుఁ జేయుటయే యుత్తమంబని నాకుఁ దోచెడిని.

జరా — ప్రత్యర్థిమార్గ నిరోధంబు కరూశాధిపునిచేఁ గావలయు.

దంత — బార్హద్రథుని నియమితము నాకు సమ్మతమే. "ఆలస్య మమృతంవిషం" బనుటచే వేగిరంబ నేఁబోయి యక్కార్య మాచరించెద. (అని నిష్క్రమింప నొకపావురమువచ్చి డేరాముందఱ వ్రాలును.)

శిశు — వాచాలుఁడంపిన నావార్తాపారావతంబిదె. దీనింబట్టి యచ్చటి సమాచారంబుల నెఱింగెద. (అని లేచి దానింబట్టి దాని ఱెక్కల యందున్న లేఖందీసి చదువుకొని) వహ్వా! మిత్రులారా, రైవతగిరి దుర్గంబులవారు గ్రామదేవతోత్సవ సందర్భంబున సురాపానమత్తులైతమతమ కార్యంబులఁ బరాఙ్ముఖు

లై యున్నవారఁట! సునీథా, యీదినంబు నాలవ యామంబున ద్వారకా పురావరోధారంభంబు జేయవలయు. సర్వంబు సన్నాహంబున నుంచి సాముదలలై యెదురు చూచుచుండుము. రుక్మిముఖ్యులు రైవతకోత్తర శృంగ ప్రాంతంబునందుండియు, జరాసంధావనీశుండు దక్షిణశృంగ ప్రాంతంబు నందుండియు, సునీథుండు పురపశ్చిమదిశ నుండియు, పట్టణంబు ముట్టడింపవలయు. పురబాహ్యాంతర జన గమనాగమన నిరోధం బాచరించుచుఁ దజ్జనంబుల నిర్బంధంబులనుంచుఁడు. రైవతకాద్రి పూర్వసానువులందిరిగి మిమ్ముల నేఁగలసికొనియెద.

జరా—మనమరిగి నియమితకార్య సంధానంబుల నుందము రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

(తెర జాఱును.)

చతుర్థరంగము—ద్వారకాపురవీధి.

(ఒక పౌరవుఁడు ప్రవేశించును.)

తెరలో

(కాక ఘూక జంబుకాది ధ్వానంబులు.)

పౌర—(వినుట నభినయించి) ఆహా! ఏమి యీవింత! నక్కలు పురంబుసొచ్చివాపోవుచున్నవి! శ్వానంబులు మూతులెత్తి మొఱఁగుచున్నవే! కాకంబులేల యిట్లూఱక కూయుచున్నవి! పట్టపగలు నగరంబున ఘూకంబులు గుండ్రిలు గొలుపుచున్నవే! (పైకిఁజూచి) పట్టణంబుపై నీగ్రద్ద లెగురుటయేమి! సర్వంబుగాక యేభానుని స్వర్భాను వీపట్టుట యేమి! (పిడుగులు పడుటవిని) ఆఁ! ఏమి యీ యద్భుతము! మేఘంబులేకయే వజ్రపాతంబులా! అగ్నిహోత్రంబుల ప్రదక్షిణజ్వాలాయుతంబులగుచున్నవి యని, యది నష్టసూచకంబని, కణ్వాది మహర్షులు వక్కాణించుచునే యున్నారు. దానికిఁదోడిపుడీవియుంగూడె. హాకృష్ణభగవానుఁడా! పురంబున నీవులేమిఁ జేసికదా యిట్టియపశకునంబులు కలుగుచున్నవి! దైవకటాక్షంబున సమస్తామంగళ పరిహారంబగుఁగాక!

ఉ॥ హా! యదువంశపావన, మహాత్మ, పరాత్పర, దోషభంజనా,
యీయనిమిత్తముల్ గలుగు హేతువు నారసి బ్రోవవే పురిన్,
పాయనిభక్తి నీచరణపంకజముల్ మదినమ్మియుండ మే?
తోయజనాభ, యార్తజనపోషణ, వారణదుఃఖవారణా॥

(అని నిష్క్రమించును.)

తెర జారును.

పంచమరంగము—ఉగ్రసేనుని సభామందిరము.

(ఉగ్రసేనుఁడును కణ్వమహర్షియుఁ బ్రవేశింతురు.)

కణ్వ—ఉగ్రసేన మహారాజాగ్రగణ్యా, భవదీయ ముఖంబించుక దైన్య చిహ్నవల గ్నంబై యుండుటకుఁ గారణంబుఁ దెలుపఁదగునా?

ఉగ్ర—

చ॥ మునికులచంద్ర యత్యశుభమూలము లద్భుత దుర్నిమిత్తముల్
గనులను నామనంబుగడుఁ గందుచు నున్నది యుక్తశాంతులన్
దనియఁగఁజేసి వేగ్రహవితానము నెంతయు దారచిత్తతన్
ఘనమగు మీప్రభావమునఁ గావఁ దలంపరె ద్వారకాపురిన్॥

కణ్వ—ఉ॥ జ్యోతిషశాస్త్రపారగుఁడు శోధిత సర్వకళా విశేషుఁడున్
బూతచరిత్రుఁడంచిత తపోనిధి గర్గమహామునీంద్రుఁ డు
త్పాతజమైన నీహృదయతాపము సర్వము వాపనోపెడున్
భీతితొలంగి సౌఖ్యమునఁ బెంపువహింపుము భోజవంశజా॥

(శాశ్యపుండగు గర్గమౌని ప్రవేశించును)

ఉగ్ర—మహాత్మా, గర్గమౌనీంద్రా, భవదాగమనంబునకై నిరీక్షించుచుంటిమి. ఈనగర రాజంబునకుంగల వర్తమాన గ్రహస్థితిం జూచి శుభాశుభంబుల దెలి చించి విధ్యుక్తంబుగ గ్రహోపశమనంబుఁ గావింపుఁడు.

గర్గ—నృపవర తిలకా, సుకేశినీదేవికిం గలిగిన దుస్వప్న దోషనివారణార్థము కా త్యాయనీ దర్శనంబునకాయమ సంపివచ్చుటలో నించుక తడవయ్యె. (అని హా

స్తంబుననున్న తాటియాకుల పంచాంగపు నంచిక యందలి గంటంబుఁదీసి నంచికపై నొకచక్రంబు వేయుట నభినయించి) "హో, హా, హీ, హూతు రోహిణి" యనుటచే ద్వారకయొక్క నామనక్షత్రము రోహిణి యగుచున్నది. "కృత్తికాన్త్రియః రోహిణీ మృగశిరార్థం వృషభమ్" తనుక వృషభరాశియైనది. (అని పంచాంగంబు విప్పిచూచి గ్రహముల వ్రాయుట నభినయించి) లగ్నమందు శని చంద్రులు, ద్వితీయమునందు కేతువు, తృతీయంబున బుధ శుక్రులు, చతుర్థమందు రవికుజులు, అష్టమమందున గురురాహువులు నున్నారు. (అని యోచించుట నభినయించి) లగ్నమందు శుభుండును స్వక్షేత్రాధిపతియున్నైన చంద్రుఁడున్నప్పటికిని క్రూరుఁడగు శనియుండుటచేతను, యావద్గ్రహ స్థితియొక్క శుభాశుభములు మొత్తమునఁ బరికించిచూడ ఘోరమైన శాంతులను శాస్త్రచోదితంబుగఁ జేయించిననేతప్ప మనపట్టణంబు శాత్రవులచే నరికట్టఁబడి కొంతయాపద నొందునట్లు రూపించుచున్నది.

ఉగ్ర—గీ॥ గురువును పురోధయును నీవ కూర్మి మాకు
శాంతి విధులాచరింపుము స్వాంతమలర
మేలు సంభవమయ్యెడు నేల వేల్ప
శిష్టజనములు సంకల్ప సిద్ధులగుట॥

గర్గ—గీ॥ మనుజ యత్నంబునకు లోప మొనయకుండ
నలుపవలసిన కార్యముల్ సర్వమిపుడ
నిర్వహించెద నిశ్చయంబుర్వరేశ
యైన దైవంబలంఘనీయంబు కాదె॥

కణ్వ—(వినుట నభినయించి) ఆభయంకర ధ్వానంబేమిరో కదా!

ఉగ్ర—(వినుట నభినయించి) రణభేరీ నాదంబువలెనున్నది. యదిగో స్పష్టంబుగ నే వినవచ్చుచున్నది. పడిహారీ (అనిపిలుచును.)

పడి—(ప్రవేశించి) మహాప్రభూ, యేమి సెలవు?

ఉగ్ర—ఆ భేరీధ్వనులేమిటో యరయనంపుము.

పడి—చిత్తము. (అని నిష్క్రమించుచుండ ససంభ్రమంబుగ బభ్రువు ప్రవేశించును.)

బభ్రు—మహారాజేంద్రా, సమయంబుతప్పివచ్చె. శిశుపాల జరాసంధాది దుష్టక్షత్రవరాజలోకంబు సేనా సమేతంబుగావచ్చి పురంబరికట్టె. అంతకుమున్న సుకేశినీదేవి కాత్యాయనీ దర్శనార్థమై రైవతకాద్రింగడచివెళ్లె. దుర్మార్గులగు నరాతులేమి సేయుదురోయని నామనంబెంతయుఁ గొందల మందుచున్నది.

ఉగ్ర—ఆఁ! ఎంతప్రమాదము! తలవని తలంపెంతవనివట్టె! రామకృష్ణులునుయాదవానీకంబులును బురంబునలేనితఱి యొంచివచ్చిరే!

(ఉద్ధవకృతవర్మ సాత్యకులాత్రంబునఁ బ్రవేశింతురు.)

సాత్య—ఉ॥ భోజకులప్రదీపక నభోమణి తేజ విరోధివాహినీ।
రాజి దురాత్మ చేదిపజరాసుత ముఖ్యపురస్సరంబుగన్।
రాజిలు ద్వారకాపురవరంబు హుటాహుటి ముట్టడించె నీ।
ప్డాజికొసంగు మాజ్ఞ రిపు నాహుతిజేసెద మస్త్రవహ్నికిన్॥

ఉగ్ర—నిస్తంద్రప్రతిభా ప్రభావులైన యాదవమహావీరుల కలవికాసిదెయ్యది? రైవతకదుర్గాధికారుల కగోచరంబుగ నరాతిబలంబులు పురబాహ్యప్రదేశంబునకెట్లు రానను వయ్యెనో చిత్రంబుగనున్నది.

కృత—కాత్యాయనీమహోత్సవ కారణంబున దుర్గాధిపతులీదినంబున మధుపానమత్తులై యుండుటంజేసి యిట్టియవస్థ తటస్థంబయ్యె, ప్రస్తుత కార్యాలోచనం బేమి?

ఉగ్ర—ఆలోచనంబున కేమున్నది? కార్యకరణంబునకుద్ధవుబుద్ధిబలంబె శరణ్యము.

ఉద్ధ—ఇపుడు శీఘ్రాలోచనంబునకేగాని దీర్ఘాలోచనంబునకు సమయంబుకాదు. సుకేశినీదేవీప్రచారంబును నట్టిదియె? స్త్రీవృద్ధ బాలపురజన రక్షణార్థమై సైన్యంబులతో యోధవీరుల వేర్వేఱ నేర్పఱచి బభ్రుదేవీరక్షణార్థ మధిక సాహసికోత్తములరిపునుత్తరించుకొనియె సముద్రయానంబునను సత్వరంబునఁ బోవనంపుఁడు. స్వరక్షణయత్నంబున నుండుఁడుగాని కయ్యంబునకు మాత్రము కాలుద్రవ్వకుఁడు. ఈరాత్రంబునఁ గడు జాగ్రతతో మెలంగుఁడు. ఏతత్కాలానుసగణంబుగ నింతకంటె నధికంబుసేయునది లేదు. నాకుఁదోచిన మార్గంబింతియ. మీరునుబుద్ధిమంతులరు యోచించి కరణీయంబు నిశ్చయింపుఁడు.

బభ్రు—ఉద్ధవనిశ్చితమార్గంబతి సుగమంబైయున్నయది. సుకేశినీ దేవ్యన్వేషణార

క్షణమై శత్రుమధ్యమార్గంబుత్తమంబో జలమార్గంబుత్తమంబో యని యాలోచించు
టయే కాక కర్ణాదారులతో సమావేశించుట యావశ్యకము.

కృత — ఈ కాలోచితాలోచన ననుసరించి వర్తింతము. సత్వరంబుగఁ బోవలయు
రండు. (అని కృతవర్మ సాత్యకి బభ్రుపులు నిష్క్రమింతురు.)

ఉద్ధ — కాత్యాయనీయాత్రం గనఁబోయిన వారలవార్త దెలియరామి బహువిచార
కరంబుగనున్నది.

ఉగ్ర — అదియె నామనంబును గుందించుచున్నది.

ఉద్ధ — దురాత్ముండైన శిశుపాల హతకుఁడు యాదవసింహుఁడులేని సమయం బార
సివచ్చెనే! హా! వాసుదేవా! నీవిలాసం బెంత చిత్రంబుగనున్నది.

(అందఱు నిష్క్రమింతురు.)

తెరజాఱును.

షష్ఠ రంగము — రైవతక ప్రాంతారణ్యంబున నొక సిద్ధాశ్రమము.

(కన్నులమూసికొని ధ్యానించుచు నొకసిద్ధుండును తత్సమీపమున సుకేశినీ మ
ధురికలును బ్రవేశింతురు)

సుకే — మధురికా, యీధ్యాన నిష్ఠాగరిష్ఠతనున్నవారే నాసిద్ధులు?

మధు — ఔను. వారు కనులఁ దెఱచిచూచువఱకు నిట మనము కూర్చుండుదము.

సుకే — అటులనే కానిమ్ము. (అని యిద్దఱు కూర్చుండుదురు.) చెలీ, యీయన మహా
నుభావుండు కాఁబోలు?

మధు — కాకేమి? లేనిచో ననుక్షణంబును దీర్ఘపురాణులవలె గొప్పవారును గొద్దివా
రును నీయనదర్శనార్థమై వచ్చుచుందురా? ఈదినంబున కాత్యాయనీయాత్రయగు
టచే మనకించుక విరామంబు దొరకినది.

సుకే — మనకిచట నెంతయాలస్య మగునో కదా! నా ప్రాణనాథుండు నాకొఱకె
దురు చూచుచుండును.

గీ॥ నన్ను విడనాడి యర్ధక్షణంబునైన।
నొంటరిగనుండ వల్లభుఁ డోపునొకొ—।

రోహిణిం బాసి యుండు చంద్రునివిధాన।
నలమటను జెందు నెంతయు నార్యసుతుఁడు॥

మధు—అమ్మా యిట్లుతొందరపడిన నెట్లగును? వచ్చినకార్యము కావలదా?

(శిశుపాలుఁడు రథముదిగి పాదచారియై ప్రవేశించును.)

సుకే—(చూచి) చేటీ, యదియెవరో యొక యపూర్వమనుజుం డిటకు నరదంబుదిగివచ్చుచున్నాఁడు. (అనిలేచి వెనుకకరుగును.)

మధు—(సుకేశినీ సమీపమునకుం బోయి) ఎవరో వసుదేవులవారి యాగదర్శనార్థము వచ్చియున్నవారు కాఁబోలు. మనవలెనే యీసిద్ధునింజూడ వచ్చినట్లుతోచెడిని. మన మీప్రక్కనుండి చూతము.

సుకే—అపరిచిత పరపురుషుని యెదుట నిట్లుండుట యుచితముకాదు. మనత్రోవను మనముపోవుదము రమ్ము. (అనిపోవనుంకించును.)

మధు—(చేయిపట్టుకొనియాపి) తల్లీ యీమహాత్ముని సన్నిధానంబున మనకేమిభయము? అంతియగాక యీయన యెవరో రాజన్యశిఖామణివలెఁ గాన్పించుచున్నాఁడు.

సుకే—ఏరాజన్యశిఖామణియో నాకుఁ దెలియదుగాని యితని వైఖరిఁజూచిననామనంబేమియో సంకోచించుచున్నది. నీవునుఁజూడుము వానిచూడ్కులు నావైపునకెట్లు వఱవుచున్నవాఁడో. వీనివర్తనము నాకు సందేహాస్పదముగ నున్నది. నేనిటనుండనొల్ల. (అని మఱికొంచె మరుగుతఱి)

మధు—(సమీపించి భుజముపైఁజేయివేసి నిలుపఁబెట్టి) భయములేదు నామాటవినుము. మహాపురుషుల యాశ్రమంబులు భీరూజన రక్షావహంబులు నీమనంబునం గల సంశయంబు వీడుము. నీకుశుభంబగు. మఱియు సత్క్షత్రియులు నారీజన గౌరవరక్షకులుకదా!

శిశు—(స్వ) మనమిథ్యాసిద్ధాశ్రమంబునకు వచ్చితిని. అదె మనవాచాలుండు నిక్కంపు వాచంయమివలె మౌనముద్రం దాల్చియున్నాఁడు. అల్లదె మనచతురిక. దాని ప్రక్కనున్న వనితారత్నము రూపరేఖ విలాసంబులఁబట్టి చూడ సుకేశినియై యుండనోపు. ఈమెంజూడ నామనంబు దృఢముష్టిసంధాన చాపనిర్ముక్త నారాచంబుంబోలి సత్వరంబున యోషామణిం గలయుచున్నది. నార

దా, నీవఙ్ఞనాచాతుర్య మించుకంతయు యథార్థరూపముం దెలుప నేరదయ్యెగా! శృంగార రస భాస్వర ప్రభలకు దివాంధములు గదా రోగులు! ఆహా! ఈ మెంజూచి నా నేత్రంబులు సఫలంబులయ్యె. ఈమెంబొందని నాజన్మము కేవలము నిరర్థకము కదా!

గీ॥ వనితసీరూప లావణ్య వైభవములఁ।
దవిలినామది విడువంగఁ దాళదయ్యె।
నేమిసేయుదు నేమందు నెట్లుగొందు।
మదనసామ్రాజ్య పట్టపు మహిషినిన్ను॥

(తెరలో)

హా! రాజేంద్రా! వృష్ణియాదవ భోజాంధక రాజన్యప్రముఖులు కాత్యాయనీ మహోత్సవంబున మధుపాన ప్రమత్తులై క్రీడారతినుండ నరాతిబలంబులు వచ్చిపడి యతిదారుణంబుగ వధంబుఁ గావించుచున్నవి. తన్నారీ రత్నంబుల మానంబు రక్షింపుము, రక్షింపుము.

శిశు—(ప్రకాశముగా) హా! యేమియీ యాక్రందన! ఇప్పుడెకదా సర్వంబు సుఖంబుండె! అరాతిబలంబులేమి! వధించుటేమి! ఏమిఘోరము! నారీరత్నంబుల మానంబు నేను రక్షింపవలయునా? ఔగాక! అవశ్యమదియె కర్తవ్యము. (బిగ్గరగా) ఇదిగో వచ్చుచున్నాఁడను. సారథీ, తేరా యత్నము సేయుము.

సుకే—మధురికా, మనకేమిదిక్కు? ఎందుల కేగుదము? మానంబునెట్లు కాపాడుకొందము? హా! దైవమా! (అని కూర్చుండును.)

—: తెరలో:—

(రాజేంద్రా, త్వరపడుము, త్వరపడుము.)

మధు—(శిశుపాలుని పాదంబులపైఁబడి) రాజోత్తమా, మాచెలి సుకేశినీదేవింగాపాడినిలయంబుఁజేర్చి పుణ్యంబుఁ గట్టుకొమ్ము.

శిశు—అట్లనే చేసెదనులెమ్ము. (మధురిక లేచును.)

సుకే—మధురికా, నన్నెవరును గాపాడ నక్కఱలేదు. నేనే గాపాడుకొనియెదను. (అని లేచి వృక్షలతల మొడకుందగల్పుకొనును)

సిద్ధ — } భయంబులేదు. ఆఁగుము, ఆఁగుము. మనల రక్షించు రాజిక్కడనే
మధు — } యున్నాఁడు. (అనుచు వెళ్లి మధురికవట్టుకొన సిద్ధుఁడు లతల విడిపించును.)

శిశు—(ఆత్రింబునఁ జూచుచు) సారథీ, రథంబున నీమగువ నెక్కించుకొని యతి వేగంబున నివాసముం జేర్పుము. నేనుంబోయి యితర భామామణుల రక్షించెద.

సారథి—(వెలుపలనుండి) చిత్తము.

మధు—చెలియా, రమ్ము రథంబెక్కి గృహంబుఁ జేరుదము.

సిద్ధ—అమ్మా, త్వరగా నరదంబున నధిష్ఠింపుము. (అని మధురికతోఁగూడి సుకేశినిని రథారోహణంబుఁ జేయించుటకు వెళ్లి నిష్క్రమించును.)

శిశు—హృదయమా, యింకఁ దొందరమాని స్వస్థతనొందుము. ఆకాశంబునం బారు కీరంబు హస్తగతంబై పంజరంబుం జొచ్చెఁగదా! నేను బోయి రిపుపురధ్వంసంబుఁ గావించి వచ్చెద.

(అని నిష్క్రమించును.)

తెర జాఱును.

౿సప్తమరంగము—అక్రూరుని గృహాంగణవేదిక.౿

(అక్రూరుఁడు కూర్చుండి ప్రవేశించును.)

అక్రూ—ప్రభో, వాసుదేవ! శ్రీకృష్ణపరమాత్మ!

ఉ॥ శ్రీరమణీకళత్ర సరసీరుహ చారువిశాలనేత్ర యం
భోరుహవైరిగోత్ర పరిపోషితమిత్ర పవిత్రగాత్ర సం
సారలతాలవిత్ర సురశాత్రవకాననవీతిహోత్ర యీ
ఘోర భవాంబుధిం గడపి కూలముఁ జేర్పవె గోపబాలకా॥

చ॥ తమమునఁ జిక్కి సంతతముఁ దల్లడమందుచుఁ దద్వియోగ స
త్సమయ నిమిత్తమేను సతతంబును భక్తిని నీకుమ్రొక్కెదన్
విమతులఁ జేరనెల్ల నిను వీడఁదలంప మహానుభావ బం
ధము లెడలించి బ్రోవుమయ దాసజనావన గోపబాలకా॥

(తెర లో క ల క ల ము.)

సమాహిత ధ్యానసుండనై మదీయ దైవంబగు శ్రీకృష్ణభగవానుని పదాంబుజ మకరంద బిందు సందోహంబమందానందంబునం గ్రోలుచుండ నీకలకలంబేమియో. నామనంబుం గకవిక సేయందొడంగె. అదియేమో వినవచ్చుచున్నది వినియెదంగాక! (వినుట నభినయించి) ఆఁ! ఏమీ! సాత్యకి కృతవర్మ సృంజయాది యాదవవరుల బలంబు లపారశత్రుసేనాపరివృతంబులై ఘోరయుద్ధంబుఁ గావించి తుదకుఁ బరాజయంబు నొందుటంజేసి శిశుపాలుండు నిరాటంకంబుగ వీటం బ్రవేశించె ననియా యనుచున్నావు? ఏమియాశ్చర్యము! ద్వారవతికాయిట్టియవస్థ! కాలగతి నెవరెరుంగఁ గలరు? విషణ్ణా, యేమనుచున్నావు? (తిరిగి వినుట నభినయించి) సిద్ధాశ్రమంబునకు వెళ్లియున్న సుకేశినీదేవిని మోసపుచ్చి శిశుపాలుఁడు తీసికొని పోయెననియా? హరి! హరి! ఎంతదుస్సహవార్త! వసుదేవాధ్వరాశ్వమును దొంగిలించి యజ్ఞశాలా దహన మొనరించెనా? దురాత్మా, యజ్ఞభంగంబుఁ గావించితివిరా, మహాపాతకా?

॥ తెర లో ॥

(అయ్యలారా, బాలవృద్ధులు గృహంబుల నగ్నిహోత్రంబున మ్రగ్గుచున్నారు. రక్షింపుఁడు, రక్షింపుఁడు.)

అక్రూ—(లేచిచూచి) ఆహా! ఏమిదౌర్జన్యము! పట్టణంబు నిశ్శంకముగఁ బరశురామప్రీతి యగుచున్నది! ఎంతకష్టమెంతకష్టము! అనిలసహాయంబునఁ గృశానుండెంత విజృంభించుచున్నాఁడు. హా! హతవిధీ! ఎట్టిదురవస్థకుఁ బాలుసేసితివి! హా!కృష్ణా!

సీ॥ రాతినాతిగఁ జేసి గౌతము నిలుప్రోచి
బభ్రుభార్యాభంగ పాటుఁగనవో,
తాటకఁ జెండాడి తపసి యాగముఁగాచి
తండ్రియజ్ఞమునీవు దలపలేవో,
యంజనీ సుతునకు ననలబాధఁ దొలంచి
నీపుర దహనంబు నాపలేవో,
ధూర్తజనావనుండని ధాత్రినుతిగాంచి
స్వజన రక్షణ నీవు సలుపలేవో,

గీ॥ దేవభవదీయ దివ్యపరిభావలీల
బ్రహ్మరుద్రేంద్ర దేవతా ప్రభృతికైన
నెఱుఁగ శక్యంబుగాదు నేనెంతివాఁడ
మూర్ఖజనుఁడను నల్పుఁడ మురవిదారి॥

కానిమ్ము నేపోయి చేతనైన సహాయంబు నొనర్చెదంగాక!

(అని నిష్క్రమించును.)

౹౹తెరజాఱును.౹౹

అష్టమరంగము—శిశుపాలసేనా నివేశంబున నొకపట గృహము.

౹౹(సుకేశినీ మధురికలు పటగృహంబునను రక్షకభటులుగైనిఁ బ్రవేశింతురు.)౹౹

సుకే—(రోదనము చేయుచు) హా! దైవమా! నాకీగతి పట్టెనా! యదుకుంజరుండగు ప్రాణేశ్వరునిచే సురక్షితనై స్వేచ్ఛావిహారంబుల సలుపుచుండి యిప్పుడు దిక్కుమాలిన పక్షివలెఁ బరరాజాధముని పాలఁబడి కారాగృహ సమానంబైన యీగుడారంబున నిరాధారనై క్రూరభటానీక నిరోధంబునఁ బ్రాణమానంబులఁ బిడికిటంబట్టి యేసమయంబుననెట్టియుపద్రవము సంఘటిల్లునో యనుభయంబున దురంత చింతాసాగరంబున మునింగి యుండవలసిన యవస్థకుంబాలైతిఁగదా! హా! ప్రాణనాథా, యీమంద భాగ్యురాలను మఱచితిరా? వీతదయులరై నన్నిట్లు విడనాడుటకు నేనేమి యపరాధం బొనరించితిని?

శా॥ హానాథా జగదేకవీర యనఘా హారాజ చూడామణీ
నేనీదుష్ట నిశాట రూపపరిపంథివ్రాత బంధంబులన్
దీనత్వంబున నున్నదానమనువన్ దిక్కెవ్వరున్ లేరుమీ
ఏ నీచాత్ముల సంహరించి నను రక్షింపంగ నూహింపవో॥

సామజ హస్తగతంబైన యరవిందంబు చందంబునఁ జిందఱవందఱయైన డెందముతోనున్ననన్ను పురుషసింహులైన మీరుపేక్షించిన నాకు గత్యంతరంబెద్ది? హా! ప్రాణేశ్వరా! స్వప్నంబు సత్యంబగునాయంటిరే! ఇంతకంటె సత్యంబగుట యెట్లు?

ఉ॥ ఏనతిపాపభావమున నేపతికెగ్గుఁ దలంచి నాథునిం
బూనికఁబాయఁజేసితినొ పూర్వభవంబున నిప్డుదానికిన్

గానక యుందునేఫల మధుంబుల నల్పెడు వేళలందునన్
మానవులెంచ నేర్తురె మనంబునఁ దత్ఫలభావి దుఃఖముల్॥

గీ॥ కారణోపేతమై కార్యఘటనదనరు
పూర్వకృతకర్మ చయములు పుణ్యపాప
తత్వకలనను సుఖదుఃఖదంబులగును
ననుభవింపక తీరునా యఘఫలంబు॥

మధు—(స్వ.) ఈమెయిప్పుడుపశాంతిఁ బొందుచున్నట్లున్నయది. ఇఁక నా పాచిక పారకతీఱదు. వాచాలసహితనై నేపన్నిన పన్నుగడ తిన్నగఁ గొన్నన లెత్తినదని మన్నుటోఁడు మిన్నందె. కోర్కెగూడఁ గొనసాగినఁ దనయభీష్టం బొనర్చితినని సంతసించి నాకు సిరులొనంగెడిని. (ప్రకా) అమ్మా, విధికృతమిట్లున్నది కాఁబోలు. ఎంతచింతించిన నేమిఫలము?

సుకే—చేటీ, మధురికా, నీయభిప్రాయము నాకేమియుఁ బొడగట్టక యున్నది. ఈనీచుల పాలంబడి యుండమనియా నీయుద్దేశము?

మధు—(స్వ.) అబ్బా! ఈమెవ్యవహారమింకను బెట్టుగనే యున్నదే! ఇప్పుడు నే తామసించినఁ గార్యంబు సెడును. కాలంబె సర్వంబు నిర్వహింపవలయు. (ప్ర.) తల్లీ, యెప్పుడైన నాకట్టి తలంపుండునా? ప్రభువరుండగు బభ్రుభూపాలుండిటవచ్చి మనల రక్షించువఱకు మనకన్యశరణ్యంబు లేదని యట్లంటిని.

సుకే—నాకంతటి యదృష్టమా? నామనంబున కది యాకాశపుష్పమువలెఁ దోచుచున్నది.

మధు—తల్లీ, మీరిట్లధైర్యముతో నుండిన నేనేమి చేయగలను? ఈవృత్తాంతము వినిన బభ్రుప్రభుపూరకుండునా? కొంచెము విశ్రమించిన సర్వంబును సుకరంబగును.

సుకే—అట్లయిన లోనికిం బోవుదము రమ్ము.

(ఇద్దరు నిష్క్రమింతురు.)

॥ తెర జాఱును ॥

ఇది ద్వితీయాంకము.

శ్రీ

శిశుపాలీయము.

తృతీయాంకము.

॥ ప్రథమరంగము—చేదిపురము. శిశుపాలసభామందిరము. ॥

(శిశుపాల దంతవక్త్ర మంత్రిపాల సునీథులు ప్రవేశింతురు.)

శిశు—దంతవక్త్ర, మంత్రిపాల, సునీథులారా, మనయత్నంబు కొంతవఱకు ఫలించినది. యాదవపురంబుఁ గనితీరఁగాల్చి, వసుదేవాధ్వర ధ్వంసంబుఁ గావించి, యదుకుల కళంకుండగు రుక్మిణీతనూజునకుం దగుప్రాయశ్చిత్తంబుగా సుకేశినీ హరణం బొనర్చుటం జేసి యిపుడించుక శాంతించినను, వాని హతం బొనరించువఱకు నాకోపానలం బుపశమింప నేరదు.

ద్వి॥ అరివర్గ మిపుడు వే హరియింపమేని
పురుషార్థలాభంబుఁ బొందంగ లేము॥

దంత—చేది భూపాలచంద్రమా, కులస్థాన సాహసబలంబులుగల క్షత్రియునకుం దగువాక్యము వలికితివి.

సునీ—కులస్థాన పౌరుషంబులకుందగిన వాక్యంబనిన యుక్తంబగు. ఏలయన.

క॥ కులసాహస బలములకుఁ
దిలకంబగు పౌరుషంబు దీపించనిచోఁ
గులమేమి సేయు సాహస
బలములు మఱియేమి సేయు పార్థివముఖ్యా॥

ఇంతియకాక శిశుపాల భూరమణు పౌరుషంబకుంఠితంబుకదా!

దంత—సునీథుండు సత్యంబువలెక్కు.

కం॥ ఈప్రతిన యెవ్విధంబున
నప్రతిహతమై దనర్చు నావిధమునఁ జే

దిప్రభునాయక సేయుమ
తిప్రకట పరాక్రమ ప్రదీప్తుఁడ వగుచున్॥

శిసు—కరూశదేశాధీశా, యిప్పటికింకను గృతార్థులమైతిమని నిశ్చయింపరాదు. కృష్ణ హంతకుఁడు బభ్రుప్రేరేపణంబున సుకేశినీ విమోచనార్థంబు మనపైకిందప్పకరాగలఁడని తోచెడిని.

దంత—అట్లయిన శత్రువు రాకకెదురు సూచుచు సమరసన్నాహంబున సిద్ధంబుగ నుండుటయె యుక్తంబు.

మంత్రి—మహారాజా, శత్రూద్దేశంబు నెఱుంగఁగల గూఢవర్తనులైన చారుల ద్వారకకును బంపుటయు నాగమనవార్తం దెలుప మార్గంబున నచ్చటచ్చటఁ గాలరుల నుంచుటయుఁ గర్తవ్యంబు. మఱియు మిత్రవర్గంబును సమస్త సేనాసమేతంబుగఁ గొంతదనుక నిటవిడియించుట యత్యావశ్యకంబు.

శిశు—మిత్రమండలి నాఁపుటవిషయంబై నేఁబోయి చెప్పెద. వేగులవారల ద్వారవతికంపి శీఘ్రగులగు కాలరుల మార్గంబున నుండునట్లాజ్ఞాపించి పురపరిఖాజాలంబు జలంబులఁ బూరించి దుర్గంబులు ధనధాన్య వస్త్రాయుధ బాణతూణీరశరాసనయంత్రఘాసరసేంధనాదులచే సమృద్ధంబులుగఁజేసి యందుల జాగరూకులగు యోధవీరుల సునిచి, నానావిధరణ విజయ మహానిపుణుల నవార్యవీర్యుల సేనాధిపతులుగ నియమించి, సమస్తసేనల సమరసాధకంబుల సంపూర్ణులఁ గావించి యుంచుఁడు. మిత్రవర్గంబునకుం గావలసిన నానావిధ సామగ్రుల నమర్పింపుఁడు. రణరంగంబు పురంబునకుం గడింది దూరంబున నుండవలయు.

ఉ॥ శత్రువు బారికింబురమసాధ్యముగా నొనరించి నేర్పుమై
మిత్రవరూధినీపతి సమీహిత మేర్పడ వ్యూహవంక్తులన్
జిత్రగతిన్ రచించి యవశిష్టము లేక విరోధివాహినిన్
ధాత్రినిఁ గూల్చుఁడేను మదదర్పితుఁ గృష్ణునిదుంతు నాజిలోన్॥

(అని శిశుపాలుండును వానివెంట దంతవక్త్రసునీథులును నిష్క్రమింతురు.)

మంత్రి—వాసుదేవునెడఁ బ్రాత్యర్థిక ప్రవర్తనంబు వినాశకరంబని యెఱుంగమికే వల మాఢ్యము. అదియేమి గ్రహచారమొ! శ్రీకృష్ణశిశుపాలురకు జన్మప్రభృ

తి బలవద్విరోధమే. రోగికి వైద్య నిర్ణీత పదార్థంబులు రుచింపని చందంబున నీయనకు హితోపదేశంబు పథ్యంబుగా నేరదు.

ఉ॥ లోకహితార్థ సంఘటనలోనఁ దలంచి మనుష్యరూపమున్
జేకొని దుష్టశిక్షణ విశిష్టజనప్రతిపాలనమ్ముల
స్తోకముగా నొనర్చు మధుసూదనుఁడేయని కృష్ణు నెంచగా
లేక విరోధ మొందు మదలిప్తులు దుర్దశ నొందకుందురే॥

(అని నిష్క్రమించును.)

తెర జాఱును.

॥ద్వితీయరంగము—శిశుపాలోద్యానము.॥

—:(వాచాలుఁడు ప్రవేశించును.):—

వాచా—ఓ హెహా! నామిత్రుఁడింకను రానేలేదే! ఆయనకేమి మహారాజు. నేనుకదా సేవకుఁడను. వృత్తినీమంబుచే మిత్రుఁడందును కాని నిక్కముగఁ జతుస్సముద్ర ముద్రిత ధరామండలాధిపతియగు శిశుపాలుండెక్కడ కుక్షింభరత్వమునకై యీనీచ సేవకావృత్తిం బ్రవేశించిన నేనెక్కడ? మాయిరువురకును మిత్రత్వంబెక్కడ? ఈసేవకా వృత్తికంటె నెక్కువ హైన్యంబును గష్టతరంబును నగునది వేఱొండులేదు. ఆహా! సేవకత్వమా! ఏమి నీప్రభావము! మనోభీష్టంబులైన మాన్పించి కష్టంపుంబనులైనఁ జేయించెదవు! సత్య స్వాతంత్ర్యంబులు నీపేరుఁ జెప్పినఁ బటాపంచలయి పోవునుగదా! ఎదిరిచిత్తము ననుభావంబులం గని పెట్టి నడిపించెదవుగా! ఏమి సేయను? లేమి నీమముం జెడుపునని దారిద్ర్యాంశంబున నీసేవకావృత్తి స్వీకరింపవలసి వచ్చినది. దారిద్ర్యము నే నిందింపనేల? ధనవంతులును నసంతుష్టి పిశాచపీడితులై యీతోవయే త్రొక్కుచున్నారు. సేవకత్వమధికారయుతంబైనను సేవకత్వమే. ఉత్కృష్ట సేవకత్వంబుకంటె నికృష్టసేవకత్వమే మేలు. ఏలయన నికృష్ట సేవకుండొక్కరునే గొలువవలయు. ఉత్కృష్టుండో? రాజునకు రాజ్యంబునకుఁ బ్రజకు సర్వంబునకు దాసానదాసుండై అధికారమున్నది యని యంతఃకరణానుసారంబుగ వ్యవహరింపనగునా? వలనుకాదు. వైయధికారియొక్కయో యజమానియొక్కయో యిష్టాను

సారంబుగనై యాచరింపవలయు. స్వాతంత్ర్యింబధికార దేవతకు ధారవోసి వాకొ్రయ కాల కర్మంబుల యందును బరాధీనత్వంబున నుండవలయు. వె య్యేల న్యాయాన్యాయంబుల నరయక యన్యహస్తగత సూత్రింబు ననుసరించి తెరమీది బొమ్మవలె నాడుచుండవలయు. కనుకనే "అధమా సేవ యావృత్తిః" అని నీతిశాస్త్రవేత్తలు నుడువుచున్నారు.

క॥ అన్యజనపాల నాశ్రిత
మాన్యతనే గోరి యితర మర్యాదలచే
శూన్యులయి జగతిఁ దామే
ధన్యుల మనుకొనుటకంటె దబ్బఱగలదే॥

మఱియు నిజవిధాయకి కార్యవశంబున యజమానుని సమీపంబునకుఁ బలుమా ఱరుగ వలసి వచ్చినచో నితరులకు మత్సరంబు హెచ్చు. అందున ద్రోహ చింతన గలుగు. మనపని మనము చేసి కొందమేమిభయమనుటకును వీలులేదు. చా డీలు చెప్పువారికి జోహారొనర్పవలయు. సమీప వర్తులకు స్వాగతము చెప్పవల యు. ఆశ్రితుల కంజలి సేయవలయు. ఇన్నియేల సేవకుండొకని నైనచో నాక్షణంబ పెకొ్రండ్రకు సేవకుండగు.

ఉ॥ నేమముతోడ నేలికకు నిచ్చలు నూడిగ మాచరించినన్
ధీమతులైన భృత్యులకు ధిక్కరణంబు తదాశ్రితాళికిన్
క్షేమముకాదు సేయు నిల సేవకు జీవనముండెడున్ సదా
తామరపాకుమీదఁ గడు తల్లడ మందెడు నీటిబొట్టునాన్॥

ఇన్నికష్టంబులకుఁబాలై యొకవిధంబున నొత్తిగిలి యుందమన్నను "నీయబ్బో లేక నీతాతో దోషము చేసినాఁడ"ని చెప్పి శిక్షింతురు. ఎన్నిటి కొప్పుకొన్నను ద్రోగంబునకు స్థిరతయేది? అందులో మనరాజులయొద్దఁ జెప్పనేల? ఇట్లుండ యజన యాజనాది సత్కర్మ నిరతులై సర్వజన పూజ్యులై శోభిల్లవలసిన విప్రిన త్తములు ధనకాంక్షచే మానాభిమాన విహీనులై హైన్యంబైన యీసేవకా వృ త్తిం బ్రవేశించుటకన్న నైచ్యంబు కలదా? ఇదె మహారాజు వచ్చుచున్నాఁడు.

(శిశుపాలుఁడు ప్రవేశించును.)

శిశు—వయస్యా, యిచ్చట నేయుంటివా? సుకేశినీ సమాచారంబు విననిచ్చ వొడ ముచున్నది. నాయెడల నించుకేనియు ననుకూల మార్గానుగతమైన దేమి వింటివా?

వాచా—మిత్రమా, ముఖముండ నద్దముండ వేఱుగ నన్నడుగ నేల? అల్లదె యూదో లమూనిగున్న సమీపంబునఁ గ్రొన్ననలెత్తి చెన్నువహించి యున్న సురపొన్న ప్రూఁకు చెంతఁ జతురికా సహితయై సుకేశినీదేవి యున్నది. ఇది వఱకుఁ బోయినది పొగవున వేసి భర్తృవియోగంబునకై పొరలి పొరలి యేడ్చుచునే యున్నదఁట. నీవును నచ్చటికింజని యించుక హెచ్చరిక సేయుట సుకరంబని నాకుఁ దోచుచున్నది.

శిశు—అయినచో నచ్చటికేగుదము రమ్ము. (అని కొంచె మరుగుదురు)

సుకే—మధురికా, యెంతటికులంబునఁ బుట్టిననేమి? ఎంతటి మహానుభావుని చెట్టవట్టిననేమి? ఎంత వివేక ముండిననేమి? విధికృతంబు నెవ్వరు దాటఁగలరు?

మధు—తల్లీ నిజంబువలికితివి. దైవకృతమునకు మనమేమి సేయఁగలము? దాని నెఱింగి సమయంబు ననుసరించి సుఖంబు వడయని జన్మంబు వృథకదా! కాన నా కఱపుబుద్ధివిని గతంబునకుఁ జింతింపక భావిసుఖంబు నాలోచింపుము. అందువలన సర్వవిధంబుల సుఖించుటయేగాక యర్ధరాజ్యాధిపునకు మాతవు కాఁగలవు.

శిశు—(వినుట నభినయించి) వీరిరువురు నేమేమియో సంభాషించుచున్నారు. ఈ మాధవీ లతాగృహంబునుండి వినియెదము. (ఉభయులు నట్లు చేయుదురు.)

సుకే—శిశుపాల ధరామండలుండు కుసుమ కోమలుండు, నవమోహనాంగుఁడు, పురుషసింహుండు, సింహాసనాధిష్ఠాత, యనుకూలుండు-

శిశు—(వాచాలునితో) చెలికాఁడా, వింటివా?

మ॥ మదిఁ దాఁ గోరిన మోహనాంగి కడుసన్మానమ్మునం జేటికిన్
హృదయస్థంబగు మోహవిస్ఫురణ మెంతే దెల్పుచందంబునన్
ముదమొప్పారఁగ వర్ణనాధికముచే భూషింపఁ బ్రత్యక్ష మా
సుదతింగాంచెడు భాగ్యమబ్బిన మనుష్యుండే మహిన్ ధన్యుఁడౌ॥

వాచా—సఖుఁడా, మండువేసవిని వడగాలి దెబ్బతిని దాహశాంతికై చల్లని మజ్జిగ తేటఁ ద్రావఁగోరఁ దలంపునకు వచ్చిన యెండూరగాయ కారణమ్మున నోరూరఁగాఁ బెదవులఁ జప్పరించు పాంథునివలె నీవు నాకుఁగాన్పించుచున్నావు.

శిశు—ప్రత్యక్ష ప్రమాణంబుగ వినియు నట్టి పాంథునితోఁ బోల్చుచున్న నీమందబుద్ధి నేమందును? వినుమింకను నేమో చెప్పుచున్నది. (తిరిగి వినుట నభినయించును)

సుకే—రూపరేఖావిలాస యౌవనంబుల సమానుండై యొప్పువాఁడు.

శిశు—మూర్ఖుఁడా, యిప్పుడేమనియెదవు?

వాచా—లొట్టలుకూడ వేయమనెదను. (మరల వినుట నభినయింతురు.)

సుకే—అనియేకదా మధురికా, నీవునుడివితివి?

మధు—మ॥ చెలువా సందియమేల నమ్మ విరహాబాత్స్యైకమ్మునం జేదిభూ
వలయాధీశుఁడుగోరి యుండమహిషీభద్రాసనార్థమ్మునం
బలుసౌఖ్యమ్ముల నొందుమమ్మ నిజలావణ్యమ్ము తారుణ్యమున్
విలసద్రూపము సార్థకమ్ములుగఁ బృథ్వీపాలునిం గూడుచున్॥

శిశు—అహో! ఇవి చతురిక పలుకులా? సంభాషణా సందర్భము నరయనేరక మోసపోతిని. అయిన నింకేమనునో విందము.

వాచా—మఱివిననేల? ఒకొక్కఁడానిని గ్రమంబుగఁ బూర్వపక్షంబు సేయును. ప్రతికూల కథనంబు వినుటకుముందె నీవు ప్రత్యక్షంబుగ సంభాషించిన నించుక మోమాటంబు నిలుచు.

శిశు—నీవు చక్కఁగ నాలోచించితివి. అట్లనే చేయుదము. (అని లతాగృహంబు వెలువడుదురు.)

సుకే—(శిశుపాలుని చూచి లేచి తలవంచుకొని స్వగతముగ) ఈదురాత్ముండేలకో వచ్చుచున్నాఁడు. ఇఁక నేమిసేయుదును? తప్పించుకొని పోదునా? వాని స్వాధీనములో నుండి యిపుడెచ్చటికిఁ బోగలను? నేఁబోయినఁ దారాలేఁడా? వ్యర్థప్రయత్నంబున నేమి ప్రయోజనము? ఱోటం దలనిడి రోకటి పోటునకుం జడిసినఁ దప్పునా? వీనికి సద్వర్తనంబు సున్న. దుర్వ్యవసాయలాలసుండయే నన్నిటకుం దెచ్చె. ఇప్పుడా యుద్యమంబుననే వచ్చియుండును. వాని యుద్దేశంబుఁ బూర్తిగఁ దెలసినంగాని భావికార్యాలోచనంబున కనువుకాదు. తాన నేమగునో యిచట నుండియే చూతము.

వాచా—(శిశుపాలునితో జనాంతికముగా) గుండుగొమ్ము లనుమానమేల? మనస్సులో కుళ్లువెళ్లఁగ్రక్కుము.

శిశు—మధురికా, శిశుపాలుండు తనపాలనుండ నింకను మీదేవి చింతాక్రాంతవదనారవిందయై యున్నదేల?

మధు—మహారాజా, తనరాజ్యమ్మును భోజ్యమ్మును నెడబాసి వచ్చిన మాదేవి చింతాక్రాంతగాక సంతోషాక్రాంత యెట్లగును?

సుకే—(స్వ.) మధురిక సత్యము వలికినది.

వాచా—(స్వ.) దీనిముండమోయ, చతురిక నిజమైన పరిజనము ననుకరించినది.

శిశు—దేవీ, నీరాజ్యమ్మును భోజ్యమ్మును బాసివచ్చితినని చింతిలకుము. క్షత్రియ సామాన్యుండగు బభ్రువుకడ నేమున్నది? నిక్కంపు రాజ్యమ్మును భోజ్యమును దదనుకూల పూజితంబును నిచ్చటఁగలవు. దిగంత విశ్రాంత ధరణీకాంతుండు నీపాదాక్రాంతుండై నీయండనుండ నీముఖమండలంబు వాడియుండనేల? నీకటాక్ష వీక్షణ రూపంబున నించుక యానతిచ్చిన నీక్షణంబ యసంఖ్యాకంబుగ ధనకనక వస్తువాహన దాసదాసీజనాదికమ్ము నీసమక్షమ్మున నుండదా? ఈనీసేవకునియందు కరుణించి కొంచెము కన్నెత్తి చూడుము. (అని సమీపించి చేయిపట్టుకొనఁ బోవును.)

సుకే—రాజా, నీవు నన్ను ముట్టుకొనకుము, నేఁజెప్పఁబోవునది నీకు విననుద్దేశంబు కలదేని దూరంబున నుండుము చెప్పెద.

శిశు—దేవీ, యిదె నీయానఁ దలఁదాల్చి దూరంబుగనున్నవాఁడ. (అని కొంచెము దూరమరిగి) నీమధురాలాపంబు లాలకింప నాశ్రోత్రంబు లాత్రంబున నున్నవి.

సుకే—నేనిపుడు నీనిర్బంధంబున నున్నదాన. ఈనిర్బంధము కాయమునకా వాక్కునకుఁగూడ వర్తించునా?

శిశు—క॥ నిను నిర్బంధము నందిచు
జనపతి తాఁగోరనీదు సద్బంధంబున్
వనితా మణిరో నీకిం
కను నిర్బంధం బదేలగల్గును చెపుమా॥

శ్వేచ్ఛాను సారంబుగఁ జెప్పవచ్చును.

సుకే—చేదీశా, పరాయివాని పక్వాన్నంబుకంటెఁ దనవారి తరవాణియే మేలు కదా! తనకున్నదానితోఁ దనివి నొందక నత్యాశపడు దుశ్చరిత్రయెడల నీను డువు లుపచరించును. నాకుమాత్ర మవి రుచించునవి కావు. నీధన కనక వస్తువాహనాదికమ్మున కానఁ జేయుఁ నీభామామణిని దానిచే సంతసింపఁ జేయుము.

వాచా—(జనాం) రాజోత్తమా, నీకన్న నీమె యేడాఁకు లెగ చదివినట్లున్నది. చూచితివా యీఁడుదానికి వాక్స్వాతంత్ర్య మిచ్చిన ఫలము? దీనికి సదుత్తరం మూహింపుము.

శిశు — నారీమణీ, నీనాయెడల న్యపరశబ్ద ప్రయోగం బనవసరంబు. ధనధాన్యాదులవలెను రాజ్యాదుల వలెను గాంతా వితానంబును వీరపురుష భోజ్యంబే. బభ్రువు మొదలగు యాదవ వీరుల సమరంబున నోడించి నిన్ను స్వీకరించితిని. నీవు నాధనమవు.

సుకే — నరవరా, నీవుత్తమ క్షత్రియ వంశసంజాతుండవు. మూర్ధాభిషిక్తుండవు. న్యాయాన్యాయ విమర్శన పూర్వకంబుగఁ బ్రజాపాలనంబు సేయవలసిన వాఁడవైనయట్టి కుయుక్తికి శరణుండవగుట యుచితంబుకాదు. విధ్యుక్త వైవాహిక విధిచేఁ బరకీయనగునన్ను మోసపుచ్చి తెచ్చి నీధనమనుటకంటె ఘోరంబుకలదా? క్షణభఁగురంబగు నీతుచ్ఛ సుఖంబుఁగోరి శాశ్వత సుగతి నేల గోలుపోయెదవు? ఇంతియగాక వావిని నీకునేఁ జెలియల నగుదు.

శిశు — నామనోహారిణీ, నన్నేల యిట్లు నలుఁగుడుఁ బెట్టెదవు? నామనంబు నీయందు బద్ధానురాగంబై యున్నది.

చ॥ పలుకులు వేయునేలయిఁకఁ బద్మదళాయత నేత్రి నిన్నొగిన్।
బులకలు మేనఁగల్గ మది పూర్ణవికాసము నొందఁ గౌఁగిటన్
బెలుచనఁ జేర్చి నీయధరబింబ సుధారస ధారలానకే
తలకొను మన్మథానలజతాప విదాహము మాననేర్చునే॥

(అని సమీపించి సుకేశిని చేయిపట్టుకొనును. ఆమె విడిపించుకొనఁ బ్రయత్నించును.)

వాచా — (తెరవంకఁ జూచి) అన్నా! అదె కురంగశాబకమును నిష్కారణంబుగ శార్దూలంబొకటి చంపివేయు నేమోకదా!

మధు — దాని ప్రాణంబు రక్షింప సత్వరంబుగ రమ్ము. (అని యుభయులు నిష్క్రమింతురు.)

సుకే — ఈకురంగము శాబకంబును నీవ్యాఘ్రముఖంబునఁద్రోసి యీకురంగ శాబకమును రక్షింపఁ బోయెదవా, చేటీ? నీవును జైద్యుని దురుద్యమంబునకే తోడయ్యెదవా? హా! ఏమినాగతి! ఎన్నివిధంబుల మోసపోతిని? హానాథా! నన్నీ క్రూరకర్ముని దుర్వ్యవసాయంబునకుఁ బాలుచేసి యూరకుండుట ధర్మమా? ఆర్తజన రక్షణ పరాయణుండగు నాశ్రీకృష్ణునకైన నామీదఁ గరుణరాదుగా!

శా॥ హా నారాయణ వాసుదేవ పరమాత్మా యార్తరక్షామణీ
హా నీలాభ్రనిభా కరీంద్రవరదా హా కృష్ణ హా మాధవా

హా నీరేజదళాయతాక్ష యనఘా హా శౌరి చక్రి హరీ
వే నామానముఁ గావవే కరుణరావే రాజగోపాలకా॥

(మెఱుపు మెఱసి యుఱుము ఱిమి యింద్రధనస్సు కాన్పించును)

శిశు—(ఉల్లిపడి సుకేశినీ హస్తంబు జారవిడిచి యామెనిష్క్రమింప దశదిశలం జూచి) ఆ! దురాత్మా! యాదవాధమా! నేను దండెత్తి వచ్చుతఱి నెటకుఁ బోతివిరా పందా? నీవిటవచ్చినందులకు నీక్రొవ్వడగించెదఁ జూడుము. నీరథనేమిధ్వానంబునకును. నందక ప్రభలకును, శార్ఙ్గగుణ స్వనంబునకును. పాంచజన్యరవంబునకును భీతిల్లెదనను కొంటివిరా మాయావీ? ఎవఁడురా యక్కడ! (వాచాలుఁడు త్వరగాఁ బ్రవేశించును.) వాచాలా, రథబాణ తూణీర చాపాయుధ కవచాదుల సత్వరంబునఁ దెప్పింపుము. ఈదుష్ట వర్తను నష్టాయువుం జేసెద.

వాచా—ఈగడబడ యేమిటి! ఈభ్రాంతి యేమిటి! ఈ చేతగాని తనంబేమిటి! పనసపండువిప్పి పళ్లెరంబున నిడినఁ దినలేని వారుండు దిక్కులు సూచెనన్న నిధంబునఁ గుందినవు బొమ్మవంటి రంభవంటి పిగిలిపిట్టవంటి చిలుకల కొలికిని జేతికిచ్చి వెళ్లిన నది ... యూటకొని యిపుడు రథబాణ తూణీరాదు లెందుకయ్యా? రథమెక్కి సుకేశినీదేవితో యుద్ధంబుఁ జేసెదవా యేమి?

శిశు—మూర్ఖుఁడా,

సుగంధి— వాఁడే చూడు యాదవుండు పాదపంబు చాటునన్
బోఁడిజెమి యదియు హస్తభూత సుందరాంగిసిన్
పీడఁ జేసితానెయాచు విశ్వమెల్లఁ దాల్చెడున్
గోడమీన నారసింహ కూర్మవామనాకృతుల్.

ఇట్టి కట్టిఁడి మాయకానిఁబట్టి గిట్టింపనిచోఁ జెట్టమూఁడదు. తేరా యత్నంబు నేసి తక్షణంబ దెప్పింపుము. అదిగో దురాత్ముండు మీదికి వచ్చుచున్నాఁడు. వీనిఁ బట్టి మల్లయుద్ధంబుననైన సమయించెద. (అని బాహువులు తట్టుచు హుంకరించి యొకరి నెదిరించుట నభినయించుచు) అరేపాపి, యదుకుల కళంక, నాచేతం జిక్కితివి యెటుపోయెదవురా?

ఉ॥ పంకిలచిత్త ధూర్త పరిపంథిగణంబులు నీపురంబు ని
శ్శంకత ముట్టడించి పటునాహవవృత్తిఁ గృశాను కీలలన్

బొంకమడంచు వేళ నెటుఁబోతివిరోరి నిగూఢవర్తనన్
బింకపు బంటువోలె నిటఁ బిల్కుఁదనంబునఁ జావవచ్చితే॥
(అని బయలుంబట్టి గుద్దుట నభినయించును.)

వాచా—(స్వ.) ఈయన యున్మత్త వైద్యశాలకుంబోవ నర్హుఁడైయున్నాఁడు. శ్రీకృష్ణునివలన భయంబుననిట్టి భ్రాంతి సహజమే వహ్వా! కృష్ణా! నీయెడల నిట్లుండవలెను. (ప్ర) వయస్యా, నీకుఁ బిచ్చిపట్టినదాయేమి? పాదప మెక్కడ యాదవుఁ డెక్కడ? ఈబ్రమాదపు వాదన సాధనములేమిటి? (తిరిగి మెఱసి యుఱుమును.)

శిశు—ఓయీ వెఱ్ఱిబ్రాహ్మణుఁడా, నీకా నాకాపిచ్చి? అదె చూడవాయేమి యద్దురాత్మునందకఖడ్గరోచులు? ఆశార్ఙ్గగుణ రవంబును బాంచజన్య ధ్వానంబును నీకు వినఁబడవా? అదె శార్ఙ్గముందిలకింపుము. (అని యింద్రధనుస్సును జూపును.) వీఁడె కంసవింశన కరుఁడు. (అని యొక వృక్షం జూపును.) వాఁడె పూతనా ఘాతకుఁడు. (అని మఱియొక వృక్షంజూపి) ఖడ్గము, ఖడ్గము.

వాచా—నీవంటివాఁడే వెఱ్ఱికుదిరినది ఱోకలిఁ దలఁ జుట్టమన్నాఁడఁట. మేఘము వేసి మెఱసి యుఱిమినది. దీనికింత విభ్రమమేల? మిత్రమా, యాకసంబునఁ గనఁబడునది యింద్రధనుస్సు కాదఁటయ్యా? నీచిత్తంబిపుడు చెలించియున్నది. ఇంచుక విశ్రాంతిఁ బొందినంగాని స్వస్థత గలుగ నేరదు. అంతిపురంబునకుంబోవుదము రమ్ము. (అని చేయిపట్టుకొని దీసికొనిపోయి నిష్క్రమించును.)

తెరజాఱును.

చతుర్థరంగము—ఉద్యానవనమందలి చంద్రకాంతమణిభవనము
(సుకేశిని ప్రవేశించును.)

సుకే—హా మనోహరా! నీవియోగ విరహానల బాధకే కుందుదునా, యీపాపాత్ముని వలన ననుక్షణంబు గలుగనున్న మానహానికిఁ గొందల మందుదునా

ఉ॥ ఎన్నిదినమ్ము లీకరణి నిందుకులాంబుధి పూర్ణచంద్ర యీ
పన్నతఁ జెన్నువాసి కడువంతకుఁ దావలమౌచుఁ బ్రాణముల్
గ్రన్నన నిల్పనోపుదు నరాతి వశమ్మున నెప్పుడే క్రియన్
జెన్నటి బన్నమౌను యని చేతము తాపము నొందుచుండఁగాన్॥

ఇట్టి యవస్థం బొందియున్న నాకుఁ బ్రస్తుత కర్తవ్యం బేమియు తోఁచకున్నది. ప్రాణనాథుం డింకను రామికిఁ గారణం బరయనేర. కారణం బేదైననేమి యింతదనుక రాకుండుటచే నీచెఱనుండి విముక్తిఁ గాంతునను నాశ దిన దినంబునకు క్షీణించుచున్నది. మానభంగమైన పిమ్మట వచ్చిన లాభమేమి? హా ప్రాణనాథా! యీజన్మంబున నీపునర్దర్శన లాభంబు నాకబ్బునా? నాయట్టి నిర్భాగ్యురాలకట్టి యదృష్టమా? ఇపుడు నే నేమి చేయుదును? ఈపాతకుని పాలఁబడుట కియ్యకొందునా? ప్రాణంబు గోలుపోవుట కియ్యకొందునా? జాతస్య మరణం ధ్రువమ్మనుటచే నెయ్యేండ్లు బ్రతికినను బ్రాణంబు విడువక తప్పదు. అట్టి ప్రాణంబునందలి యాశచే శాశ్వత తరుణోపాయ కారణంబైన మానంబును విడుచుటకంటె బుద్ధిహీనతకలదా? కాకమై కలకాలముండుటకంటె హంసయై యర్ధక్షణముండుట యుత్తమంబు. కావున మానహానికంటె మరణంబె మేలు. అది కలుగుటయెట్లు. జలవిషాగ్ని రజ్జువులలో నొకదాని వలనఁ గావలయు. ఆత్మహత్య నరకహేతువని పెద్దలు చెప్పుదురు. మానంబుఁ గోలుపోవుటకంటె నరకంబు మేలని మానధనులందురు. జలవిషాగ్ని రజ్జువులలో నగ్నివలని మరణంబు శ్రేష్ఠంబును బరమ పావనంబును. మును సీతామహాదేవియు దురాత్ముండగు రావణునకు వెఱచి యగ్నిదేవుని శరణంబుసొచ్చె. పెద్దల మార్గంబవశ్యమనుసరణీయంబు హా కృష్ణా! ఆపద్బాంధవా! భక్తజన చింతామణీ! దీననైయున్న నామానంబు కాపాడి యెన్నిజన్మంబులెత్తిన నీపాదారవింద భక్తియు బభ్రినరపాల భర్తృత్వానురక్తియుఁ గలుగఁ జేసెదవుగాక! నాథా, నాతప్పుల మన్నించి యీనాతుది నమస్కారముం గొనుము. (అని నమస్కరించును.) అగ్ని భట్టారకా, నాయందుఁ గరుణించి నీలోనం జేర్చుకొనుము.

శా॥ దేవానీకము నీముఖమ్మునను దృప్తింజెందు హవ్యమ్మునన్
భావాతీతము జాతవేదము జగత్ప్రఖ్యాతమున్ బూతమున్
దావ ద్వ్రత్తమ్ము, మామకీన దురవస్థం జూప లోఁదాల్చి వే
బ్రోవన్వేడెద వీతిహోత్ర ననుఁగారుణ్య ప్రసాదంబునన్॥

మ॥ పతియే దైవమటంచు నెప్పుడు మనోవాక్కాయకర్మంబులన్
హితముంగూర్చితి నేని నాహృదయ మెంతే నిర్మలంబేని స

ద్విత సంధానముతోడ దేవగురుసేవల్ భక్తినిత్యంబు నేఁ
బ్రతితిం జేసితి నేని గావవె ననుం బ్రత్యక్షమై పావకా॥

(శిశుపాల వాచాలురు ప్రవేశింతురు. చూచి)

ఇఁక నాకేమిగతి? నృశంసుండు వచ్చుచున్నాఁడే!

ఉ॥ దైవము యేమిసేతునిఁక దబ్బున దేనిని జొత్తు దుర్మదుం
డీవల వచ్చువాఁడదిగో హేతి యొనర్పఁగ లేదు వేళయున్
జీవము నిల్పుమానమిఁకఁ జేకొను దుర్గతిఁ బాహిపాహిసన్
దావక కీలలం దిపుడ దగ్ధమొనర్పవె హవ్యవాహనా॥

(అనుసరికి నగ్నిజ్వాలలు ప్రజ్వరిల్లును. తెరజాఱును.)

శిశు—(చూచి) ఆహా! వాచాలా, యదిగో చంద్రకాంత మణిమందిరంబు హుతాశన జ్వాలలచే మండిపోవుచున్నది! ఏమి సేయుదము? సుకేశినిం గాపాడుట యెట్లు? వనపాలకుల జలంబులఁ దేఁ బంపుము.

వాచా—(బిగ్గరగా) ముండకొడుకులారా, కొంపంటుకొన్నది. వేగము నీళ్లు తెండు.

తెరలో

(కడవలతో నీళ్లు తెచ్చుచున్నాము)

దైవమా నాకేమిగతి? తల్లికొక్కరుండను. మిత్రమా, సుకేశిని మాటకేని నన్ను సత్వరంబుగ రక్షింపుము. దహనుండిటు వ్యాపించుచున్నాఁడు. పులుసులో ముక్కవలె మెత్తగనుడికి పోదును. (అని రాజుపయింబడును.)

శిశు—మూర్ఖా, మధ్య నీకేమిభయము? లోనికిం బోయి సుకేశినిం గాపాడ వలయు రమ్ము.

(అని యుద్దఱు నిష్క్రమింతురు.)

పంచమరంగము—శిశుపాలభవనము.

(చింతాక్రాంతుఁడై శిశుపాలుఁడును వాచాలుఁడును బ్రవేశింతురు.)

శిశు—ఎంత దుశ్శంతము! ఒక్కక్షణంబులో మాయమై యింతశ్రమ వృథపుచ్చెగా! పలుముఖంబులం బ్రాకు నాయాశాలతా వితానంబింతలో నిర్మూలంబయ్యెనే! ఎంత

యాశ్చర్యంబుగనున్నది! కాష్ఠాద్యాధార రాహిత్యమందును వహ్నిజ్వాలలు ద్భవించి సుకేశినిం దహనం బొనర్పఁగల్గెను. భస్మముకావలసిన ఘనపదార్థ తత్వంబైన మానవశరీరంబు భస్మమైన లేశమంత నెట్లయ్యెను? పాటలించుక వి నఁబడుచునే యుండెను. క్షణమాత్రము దృశ్యంబై సుకేశిని యదృశ్యంబ య్యె. ఇందుల నేదియో మోసంబు జరిగియుండును. మాయామయుండగు నా లోక కంటకు దుష్కృత్యంబై యుండనోవు. లేదా మలిన వర్త్మయగు నాశ్రి యాశుని చెయిది కావలయు. ఇంతయేల యుడియాదుర్మదాంధులగు నిద్దఱి ని కారంబె. ఆపాతకునకీపాతకుండు సహాయుండై యిట్టి ఘోరంబుఁ గావించె. దురాత్మా! పావక! నీకుఁ బాతకుండని పేరుండిన బాగుండును. ఆహా! ఆముద్దుల గుమ్మయొక్క తనూవిలాసమేమనవచ్చు!

గీ॥ భామ కాదది లావణ్య సీమగాని
యింతి కాదది వలపుల దొంతిగాని
కలికి కాదది మదనుని ములికిగాని
కొమ్మ కాదది బంగారు బొమ్మగాని॥

సీ॥ పరమ వంచనకారి సురముని యిటు కేల
వచ్చెను వచ్చెఁబో మచ్చికంటె,
వృత్తాంతమున నేల చిత్తరంజనఁ జేసెఁ
జేసెఁ బోనా కేల చెలువవయిని,
నిలువరాని విరాళిగలిగెను కలిగెఁ బో
కలికిని దోడ్తెచ్చి వలపుదీర,
స్వీకరింపక స్వేచ్ఛఁ జెలినేల యుంచితి
నుంచితిఁబోయిట్టులు విడనేల,
గీ॥ హవ్యవాహన దుర్మదుం డపహరించె
నేల యీ ఘోర దురితం బదేలయిట్టి
కండకావర మేల యీ దుండగంబు
పలకూళుని యీపాతకూల ఘటన॥

గీ॥ బ్రాహ్మణాధమ గృహములఁ బ్రతిదినంబు
హవ్యకవ్యంబులందిని హద్దుమీఱఁ
గ్రొవ్వి గావించె నీపనిఁ గ్రొవ్వడంతు
సారిది నాహుతి మఱిసెర సున్నఁ జేసి॥

(దంతవక్త్రుఁడు ప్రవేశించును.)

సోదరా, యగ్నిహోత్రుఁడొనర్చిన యపకృతికిం దగిన శిక్షగావింపవలయు.

దంత — నిస్సందేహముగ నట్లనే చేయుదము. నీయాజ్ఞయైనచో నాకృశానుం గృశితనుం జేసి నాప్రతాపంబుఁ జూపెద.

శిశు — కరూశాధిపా, యీఖలుం గాఱియ వెట్టిన నాయాదవాధమున కుందగులవలయు. తపోమద దర్పితులగు విప్రాధములు యాగాదులని పేర్లువెట్టి యీధూర్తుని, తద్వారా సోమరులగు సురలను నేదెపెయ్యలనువలె హవ్యఘాసంబున మేపుచున్నారు. కాన మూలకారణులగు బ్రాహ్మణాధముల పోతరంపుఁ గర్మంబుల భగ్నంబు గావించిన మహత్తరంబైన మనయుద్యమంబు నిరవద్యంబుగ నుడఁగూడదు. కావున,

గీ॥ విప్రజనముల మునులను వెదకి వెదకి
నిత్యనైమిత్తికాధ్వర నియతకర్మ
సంచయంబెవ్వరిచ్చట సలుపకుండఁ
గట్టుబాటును జేయుఁడు దిట్టముగను॥

దంత — తప్పకుండ నట్లు చేసెద. మఱియు,

సీ॥ అగ్రహారములేగి యుగ్రతఁ జెలరేఁగి
విప్రజనులఁ బట్టి వెతలఁ బెట్టి
వనభూములనుడాసి మునిజాతములరోసి
జపతపంబులఁ బాపి చలముఁ జూపి
యజ్ఞవాటులఁ జేరి యాజకావలిదూఱి
సంభారములఁ దాల్చి శాంతిఁ దూల్చి
విష్ణుభక్తుల నెంచి వేవిధంబుల నొంచి
తీర్థవాసులదోఁచి తెరువుఁ గాచి

ఆ॥ వేదశాస్త్రసభల విద్వజ్జనంబుల
నరసి కదిసి మిగుల నలయఁజేసి
యింక నధిక గతులఁ బొంకంబు వడగించి
దేవ విప్రతతుల తేజమడఁతు॥

శిశు—తమ్ముఁడా, నీయుద్యమంబతి ప్రశస్తముగ నున్నది. అందువలన నీవైశ్వాన రునకుందగిన శాస్తియగును.

వాచా—(స్వ) తుంటిఁగొట్టినఁ బండ్లు రాలునట్లే.

శిశు—దంతవక్త్రా పోయి శీఘ్రంబుగఁ గార్యావసానంబుఁ గావించిరమ్ము.

ధంత—ఇదె పోయివచ్చెద. (అందఱునిష్క్రమింతురు.)

తెర జాఱును.

ఇది తృతీయాంకము.

శ్రీ

శిశుపాలీయము.

చతుర్థాంకము.

ఆ. ప్రథమరంగము—ద్వారకాపురము. సుధర్మా సభామందిరము. ఆ.

(శ్రీకృష్ణుఁడు, అక్రూరుఁడు, వేత్రధరులు ప్రవేశింతురు.)

వేత్ర, ప్రథ.—శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, అఖండ మార్తాండ మండలోద్దండ తేజా, ప్రచండ విక్రమ బాహాదండదండితాసురమండలా, జే.

వే, ద్వితీ.—యాదవాన్వయపయఃపారావార రాకాసుధాకరా, సకల లోకాధీశ్వర కిరీట మణిగణ ఘృణి విరాజమాన పాదపంకేరుహా, ఆపదుద్ధారకా, భక్తజన పారిజాతా, జే.

అక్రూ—అంబుజాక్షా నాడెందంబును భేదించుచున్న సంశయబంధంబొండు విచ్ఛేదంబుఁ గావింపఁ గరుణింతువేని విన్నవించెద.

శ్రీకృ—అక్రూరా, నిర్వక్రంబుగ నీసందేహ విచ్ఛేదంబుఁ గావించెద నుడువుము.

అక్రూ—ఉ॥ రాతిని నాతిఁ జేసి ముని రాడ్గృహమున్నిలవెట్టి తాటకన్
ఘాతశరాహతిం దునిమి సంయమి యాగముఁ గాచి యంజనీ
సూతికి నగ్నిబాధ పొడసూపక యుండ నొనర్చి భక్త సం
ఘాతము లార్తి నొందవడిఁ గాచెదు నీమహిమంబు దక్కవే॥

ఆ॥ బభ్రుదేవిపడిన భంగంబుఁ గానవో
తండ్రియజ్ఞ మెదను దలఁపవొక్క
ద్వారకాపురవర దహనంబు నెఱుఁగవో
తెలుపవేడువాఁడ దేవదేవ॥

శ్రీకృ—యాదవోత్తమా, పురాకృతకర్మ ఫలంబనుభవింపక యుండనెవరి శక

ముని దానికొక తార్కాణంబుగ సుకేశిని వృత్తాంతం బెఱింగించెద నాలింపుము. మున్ను శూర్పణఖ యేకపత్నీవ్రత రతుండగు శ్రీరాముని గని మోహపరవశయై కామించి విఫల మనోరథయై యాక్రోధంబునఁ బూత చరిత్రయగు సీతం జెఱఁగొన దురాత్ముండగు రావణుం బ్రేరేపించె. తద్దానవు డాగ్జన్యతం దొలంగ నద్దేవి యగ్నిశరణంబునడనె. ఆశూర్పణఖయే యిప్పుడు సుకేశినియై జన్మించి పవిత్రచారిత్రయై శిశుపాల మోహితయై యపహరింపఁబడియు గ్నిదగ్ధయయ్యె. బభ్రుభూపాలుం డీవృత్తాంతంబు నాతలన వినియే దుఃఖోపశాంతినొందె. పూర్వకృత కర్మఫలంబు శేషించినచో దాని ననుభవింపఁ బునర్జన్మ మొందవలయు. మఱియు నట్టి యనుభవం బన్య జీవజాల కర్మఫలానుసరణంబై యుండునుగాన దుస్తరంబగు.

అక్రూ—పరమాన్య వృత్తాంతాకర్ణనమున ధన్యుండనైతి. నేఁబోయి వచ్చెద. (అని నిష్క్రమించును. పరిచారుఁడు ప్రవేశించును.)

పరి—దేవా, వసిష్ఠ భారద్వాజాది తాపస పుంగవులు విచ్చేసి ద్వారముకడ నున్నారు.

శ్రీకృ—(ససంభ్రమంబుగ) నీవుపోయి యర్ఘ్యపాద్యాదులఁ దేనంపి వారినిటకుం దీసికొని రమ్ము.

పరి—చిత్తము. (అని నిష్క్రమించును. వసిష్ఠాదులు ప్రవేశింతురు. అర్ఘ్యపాద్యంబుల నొకండు తెచ్చియిచ్చును.)

శ్రీకృ—(లేచి) ఋషివర్యులారా, యిదె నమస్కరించుచున్నాఁడ.

వశిష్ఠాదులు—విజయతాం, విజయతాం.

శ్రీకృ—మునిసత్తములారా, యిదె యర్ఘ్యపాద్యంబులు. స్వీకరింపుఁడు. (అని యర్ఘ్యపాద్యంబుల నొసంగును.)

వశిష్ఠాదులు—(పాదప్రక్షాళనంబుఁ గావించి యాచమించి శ్రీకృష్ణుండు చూపు నాసనంబుల నధివసింతురు.)

శ్రీకృ—తాపసోత్తములారా, మీరలు విచ్చేయుటచే నాగృహంబు పావనంబయ్యె. నేను ధన్యుండనైతి.

వసి—గీ॥ అరయ నీపాద పంకేరుహాంపురజము
పావనము సేయు జగములఁ బరమపురుష
యస్మదాదులఁగూర్చి నీవనుట యెల్ల
లోకమును విడంబించుట గాక యున్నె॥

ఖర—దేవా, పొల్లిసదుండును, నారాయణుండవగు నీవును, తపోనిష్ఠాగరిష్ఠతఁ గొంతకాలంబు మునికి వట్టు గావించిన పుణ్యవనంబగు బదరికాశ్రమమంద లి తరుషండ ఫలంబులివె. వీనిని బరిగ్రహింపుము. (అని బదరీ ఫలంబుల నిచ్చును.)

శ్రీకృ—(ఫలంబులఁ బరిగ్రహించి) ఈదినంబు సుదినంబు. ధర్మజ రాజసూయాధ్వరాహ్వానంబునకు వచ్చిన మన్మిత్రుండగు నర్జునుం డీఫలంబుల నారగిం ప నిపుడిటనుండిన బాగుగనుండు నే!

సీ॥ అందమై భువిజనానందమై కుంద సిం
దూర మందార సందోహమగుచు,
పూతమై మునిజనోపేతమై సౌఖ్య సం
జాతమై లోక విఖ్యాతమగుచు,
సారమై ఫలపుష్ప భారమై దేవసం
చారమై భూరి విస్తారమగుచు
శాంతమై తాప విశ్రాంతమై జంతు సం
తానమై చారుకాంతారమగుచు

గీ॥ ధ్యాన నిష్ఠోపయుక్త సంస్థాన మగుచు
సిద్ధజన్ములకు మోక్షసంసిద్ధి నిడుచు
పుణ్యవనములలో నగ్రగణ్యమగుచు
శ్రీకరంబై దనరు బదరీ వనంబు॥

అట్టి యాశ్రమ ఫలంబులకంటె నాకుఁ బ్రియతమమైన యుపహారంబింకొండు లేదు,

ఉ॥ ఇంపొనరించుఁ గన్గవకు నీప్సితము న్ఘటియించు చింతకున్
బెంపొనగున్ మనీషకును బేశల సాత్త్విక భుక్తియై తప

స్సంపదఁ గూర్చు మానిజన సంతతికిం గువలంబు లొప్పనై
లింపములంచు నెంచగవలెన్ బదరీ వనజాతముల్ మహిన్॥

సంయమీంద్రులారా, మీకుఁ గుశలమా? మీమీ క్రతు వ్రతాదు లప్రతిహతంబుగ సాగుచున్నవా? నన్ను సంభావ్యానవ్యమోదగ్రునిగా గణింపఁ దలంచుటకన్న మీయాగమంబునకుఁ గారణాంతరం బొండుకలదేని యానతిచ్చెదరుగాక!

ఋషి—ఆర్తావనపరాయణా, యేమికుశలము? ఏమిసాగుట? జగత్కంటకులైన శిశుపాల దంతవక్త్రులొనరించు మహాదారుణ కృత్యంబులు భరింపనేరక భవదీయ పాదారవిందంబుల నాశ్రయింపవచ్చితిమి. అల్పదినంబుల క్రిందట దంతవక్త్రాది దానవులు పెక్కండ్రువచ్చి మాయాశ్రమంబులఁ జొచ్చి,

సీ॥ యజ్ఞశాలలుపీకి యూడకావళినూకి
యరణిపాత్రాదుల నవనిఁగలిపి,
యూపంబులనుద్రోసి యుపదర్భకులఁదాఁచి
పశుగణంబులవిప్పి పాఱఁదోలి,
హోమకుండములార్పి హోత్రలబరిమార్చి
యుద్గాతలనుబట్టి యుసురుఁబెట్టి,
స్రుక్స్రువ దర్భలు చూర్ణంబుఁగావించి
చరుపరమాన్నముల్ చప్పరించి,
గీ॥ యాజ్యసోమరసంబుల నారగించి
తాపసుల నొంచి చెఱచి తత్సతిగణంబు
కన్యకాతతిఁ జెఱగొని కమలనాభ
పూనిభీభత్సుచేసిరి పుణ్యవనము॥

గీ॥ హవ్యవాహాన ముఖమున నమరవరులు
భోక్తలై తృప్తి నొందుట బుద్ధిఁ దెలిసి
యాహితాగ్నుల నెల్లెడ నరసి యరసి
శిష్టకర్మకలాపంబుఁ జెరచిరనఘ॥

ఋషి—భక్తజనపరాయణా, యాశిశుపాలుని ధాటికి నిఁక నాగుతారముకాము. ఏదైన నొక సాహసం బూహించి మాకీ యుపద్రవంబుఁ దప్పించి మాజపతపః ప్రి

భృత్యానుష్ఠానంబులవ్యాకులంబులగఁ గావుననె నిచట నీచరణారవిందం బుల ననుసరించుకొని యుండుచుఁగాని యాశ్రిత నివాసం బొల్లనేరము.

శ్రీకృ—తపోధనులారా, మున్ను మహాపురుషులు విప్రసత్త్వంబెఱుంగ నేరకతత్ప్రత్యక్షమైన భారోద్ధారణంబున వారల కనతాపంబుఁ గావించి యిప్పుడు మీపవిత్రాంగ శృంగారాగారంబున నెగ్గలి నున్నవాఁడో త్రికాల వేదులగు మీర లెఱుంగరే?

చ॥ చదివెను వేదశాస్త్రముల నద్విధిఁ జేసె శతాధ్వరంబులన్
మహిమమున నొందె నింద్రపదముం గడిమిన్విభవాతిరేక దు
ర్మదమున విప్రకోటి కవమానము నొనర్చి దురంతశాపమున్
దుదిఁగొని యుండె సర్పమయి దుష్కర కర్మఫలంబు దప్పునే॥

(భూదేవి స్త్రీరూపంబున సభామధ్యంబున నుద్భవించును.)

భూదే—జగద్రక్షామణీ, భవదీయ పాదపద్మోపజీవి భూదేవి యిదె నమస్కరించుచున్నది. (అని నమస్కరించును.)

శ్రీకృ—దేవీ, యీపీఠంబున నధిష్ఠింపుము. (అని యాసనముం జూపును.)

భూదే—భక్తవత్సలా, నీకరుణాకటాక్ష ప్రసారంబున ధన్యనైతి. (అని యాసీన యగును.)

ఋషి—(లేచి) జననీ, యీదినంబున నీపాదారవింద సందర్శనంబున నస్మదాదుల ముత్కృష్ట జన్ములమైతిమి. (అని కూర్చుండును.)

భూదే—మహనీయులారా, మీవాక్యంబు నాముఖంబునుండి వెలువడిన యుక్తంబుగ నుండును. మీసమక్షంబున నాథుని దర్శన లాభంబు గలుగుట మదీయ పుణ్యవశంబునఁ గాదే?

ఆ॥ ముని వరేణ్యులార ఘనమైన మీపాద
నీరజములసోఁకు కారణమున
కరము ధన్యనైతిఁ గాదేని యీరీతి
నైన నుండుటెట్టు లనువుపడును॥

శ్రీకృ—దేవీ, నీసాక్షాత్కారంబునకుం గారణముండిన వక్కాణింపుము.

భూదే—మహానుభావా, నీవెఱుంగని దీజగత్త్రయంబునం గలదే? అయిన నన్నుమన్నించి నీవడుగ విన్నవించుచున్నదాన.

(సభామధ్యంబున ధర్మదేవత విశ్వరూపంబున సాక్షాత్కరించును.)

ధర్మ—దేవాధిదేవ, భగవద్దాసుండు ధర్ముండిదె యభివాదన మాచరించుచున్నాఁడు. (అని నమస్కరించును.)

శ్రీకృ—ఈయాసనంబున నధిష్ఠింపుము. (అని యాసనమును జూపును.)

ధర్మ—పురాణ పురుషోత్తమా, ధన్యోస్మి. (అని కూర్చుండును.)

వశి—(లేచి)

చ॥ జయజయ ధర్మదేవ జయ సర్వ జగత్సృజనైక కారణా
జయజయ నిర్మలాత్మ జయ సామముఖాఖిల వేద సంస్తుతా
జయజయ నిర్వికార జయ శర్వజనార్దన సృష్టిరూపకా
జయజయ లోకపాల జయశక్రయమాది దిగీశవందితా॥

(అని కూర్చుండును.)

ధర్మ—మునికుల సార్వభౌములారా, సమస్తలోకంబులకు శ్రీకృష్ణ కరుణాకటాక్ష వీక్షణ ప్రసారంబు గలుగుఁగాత! లోకశరణ్యా, నీవు నెలవొసంగిన నీవసుంధరాదేవి యనుమతంబున నామె చెప్పనున్న యంశంబును నివేదించెద.

శ్రీకృ / భూదే —ఔఁగాక!

ధర్మ—దేవా, మున్ను కంసాది దుష్టదానవానుష్ఠిత మహాఘోరపాప భారాసహిష్ణువై యిద్దేవి చతుర్ముఖు పాలికరిగి మొఱ్ఱవెట్ట నద్దేవుఁడు కరుణాంతరంగుండై యీమె నెంటఁగొని క్షీరసాగర వేలావనికిం జని నినుం గూర్చి ప్రార్థింప,

సీ॥ ఇంద్రనీలపుఁగాంతు లెనయు దేహముతోడ
సొగసుమీఱెడు నవ్వు మొగముతోడ,
పుండరీకాకృతిఁ బోలు కన్నులతోడ
డంబైన పీతాంబరంబుతోడ,
శంఖగదాచక్ర శరచాపములతోడ
శ్రీవత్సకౌస్తుభ శ్రీలతోడ,
మకుట కంకణహార మకరతి కేయూర
రమణీయమణికుండలములతోడ,

గీ॥ వందిసనకాది మునిజన పంక్తి గొలువ
నిరుకెలంకుల శ్రీనీళ లెలమిదనర
గరుడ వాహనుఁడై వచ్చుహరిని నిన్నుఁ
బరమ సంతోషమునఁ గాంచె బద్మభవుఁడు॥

కాంచి తమయాగమనకారణంబు విన్నవించినఁ గరుణించి కశ్యపాంశంబునని ల నవతరించిన వసుదేవునకుం బుత్రుండనై దుష్టశిక్షణంబుఁ గావించి ధర్మ సంస్థాపనంబుఁ జేసెదనని యానతిచ్చి వారల ననునయించి పుచ్చి ధరనిట్లు వి చ్చేసి యుంటివి. ఇపుడు నీమేనయత్తల పుత్రులగు శిశుపాల దంతవక్త్రు లతి పాపచిత్తులై ఘోరకృత్యంబులం గావించుచు మదీయ మార్గంబు లధోగతిపాలు చేసి యజ్ఞాది సత్కర్మంబుల నివారించి దేవతాతతి మూతులఁ గట్టిపెట్టి లోకా నుగ్రహనిగ్రహంబులకుఁ దామె కర్తలమని భువనంబులఁ బీడనొందించుచున్న వారు. ఇంద్రాదిదిక్పాలురును నీభూదేవియుఁ బావనులైన యీజడదారులును నేనును భవదీయ చరణ పంకజంబుల నాశ్రయించి పాలముంచినను నీళ్లముం చినను నీవదిక్కని నమ్మియున్నవారము. నీయొక్క దుష్టశిక్షణంబును శరణా గత రక్షణంబును జగద్విదితంబులు.

ఆ॥ క్రూరకర్మ లేని కులబాంధవులనైనఁ
దునించి ధాత్రి ధర్మమంచితముగ
స్థాపనంబు సేయఁ దార్క్ష్యగ కాదొకో
కంసదైత్య నరక హింసనంబు॥

కావున నమ్ముం గరుణించి భవదీయ మాతృష్వసేయులైన దుష్టశిశుపాల దంతవ క్త్రులందునుమాడి దేవ హితంబొనర్చితవుగాక! ఇది యింద్రాగ్నుల సం దేశము.

శ్రీకృ.)— కాకానీయులారా, యచిరంబున మీయభీష్ట మొనఁగూడెడిని. మీరలరిగి సుఖంబుండుఁడు. దేవీ, నీకు శుభంబయ్యెడిని. ధర్మదేవా, యింద్రాగ్నుల కి ట్లు విన్నవింపుము.

సీ॥ నిత్యతపోధ్యాన నిష్ఠాగరిష్ఠులౌ
బరమయోగులకుఁబట్టి బ్రామసాఁడు,

నిరుపమానక్షమా నియతిఁబొల్పారెడు
నవనికి కడుభార మయ్యెనెపుడు,
అఖిలసృష్టిస్థితి కాధార భూతమౌ
ధర్మపథమున కడ్డుదవిలెనెపుడు,
లోకరక్షాదక్ష పాకశాసన ముఖ
దివిజ సందోహంబుఁ దెగడెనెపుడు,
గీ॥ నిరపరాధుల హింసింప నరసె నెపుడు
పరమ సాధ్వుల నవమాన పఱచెనెపుడు
జగమునకు నార్తిఁగావింప సాగెనెపుడు
అపుడె శిశుపాలుఁ డంతంబు నందెననుము॥

ధర్మ—భక్తశరణ్యా, మేమనుగ్రహింపఁబడితిమి. సెలవొసంగిన బోయి వచ్చెదము.

శ్రీకృ—మంచిది.

(ధర్మదేవతయు, భూదేవియు, వసిష్ఠాదులును నిష్క్రమింతురు.)

——[ ]——

తెరజారును.

—ద్వితీయరంగము—సుధర్మా మందిరము.—

(శ్రీకృష్ణబలరామోద్ధవులును వేత్రహస్తులును బ్రవేశింతురు.)

వే॥ప్ర—అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా, జే.

వే॥ద్వి—యాదవాన్వయ పయఃపారావార రాకాసుధాకరా, జే.

శ్రీకృ—మహాశయులారా,

గీ॥ రాజసూయంబుఁ జూడంగ రమ్మటంచు
బిలువనంపెను ధర్మజుఁ డెలమితోడ
చైద్య సంహార మొనరింప జంభవైరి
మున్నుగాఁగల వారలు మొఱ్ఱలిడిరి॥

అందు ముందుగ దేనిని గావించి దేనిని పిదప సలయుటను నాకు ధర్మసందేహము కలుగుచున్నది. మీరలు బాగుగ నాలోచించి నాకుం దెల్పెదరుగాక!

చ॥ ఖలుఁడయివాఁడు ద్వారవతిఁ గాల్చి మఖాశ్వము దాఁచిబభ్రుభూ
తలపతి భార్యమాయఁగొని ధాత్రికి భారముగాగ ఘోరముల్
సలుపుచు నేఁడులోకముల సర్వవిధంబులఁ బీడ నొంచుచున్
బలకొని యున్నవాఁడు శిశుపాలుఁడు దుర్భర దుర్మదాంధుఁడై॥

గీ॥ ధర్మజుఁడు నాదుభక్తుఁడు ధార్మికుండు
ఉత్తమోత్తమ కార్యంబు నుద్యమించె
నధ్వరాగారమున నన్ను నరయుకునికి
కమిత పరితాపమును బొందు నాత్మయందు
మఱియు నాదుసహాయంబు మానసమునఁ
గోరుచుండును దత్కార్య భారమందు॥

బల—శ్రీకృష్ణా, సృష్టిప్రమాణ చతుష్టయ జ్ఞానసంపన్నుండవగు నీవు మమ్ముల నీస్వల్పాంశంబు విషయమైఁ దెల్పఁగోరుట యాశ్చర్యకరంబు. అయిన నీవు గౌరవించి యడిగితివి గాన నాకు నుచితమని తోచిన విధంబున నేవక్కాణించెద.

గీ॥ శమనసూనుని సవనంబు సమధికముగఁ
బరిసమాప్తిని నొందింపఁ, బంకజాక్ష,
దిగ్విజయకార్య కలనైక దివ్యసత్వ
సంపదోత్కర యుతభీమ శక్రతనయ
నకుల సహదేవముఖ వీరనికరముండ
నీవు లేనట్టి లోపంబు నివ్వటిలదు.
ఇష్టిఁగనుగొన బాంధవ హితముదనరు,
అరినిబోరిగొన సమకూరు నమర హితము.
దేవహితమందు ముందుగఁ దీర్పవలయు.
అపచయావాప్తిఁ బరిపంథియులఁగునపుడ
యుచితమందురు యానంబు సచివవరులు.
మిత్రవర్గుఁడైన యాదవాపుత్రుప్రవృత్తికి

వ్యసన సంభవ చిత్త విహ్వలతనున్న
సాత్వతీ సూనుపై వెడల సమయ మిపుడు॥

మఱియు నిద్దురాత్ముం డీలోకంబున నెంతకాలము జీవించి యుండునో యంతదనుక దినమొకయుగంబై సర్పుచుండు. కావున చైద్య సంహారంబునకుం జనుటయే యుక్తంబని నాకుఁదోచుచున్నది.

ఉద్ధ—పురాణ పురుషోత్తమా, యీకాలాంతకుని మతంబునకు భిన్నంబుగ నాడుచున్న నాసాహసంబు మన్నించెదవుగాక! ధర్మజ రాజసూయంబు సమాప్తి నొందింపఁగల వాయుపుత్రులున్నను యజ్ఞపురుషుండవగు నీవు లేనిచో సవనంబు నిరర్థకంబుగాదే? ఇంతియెగాక,

గీ॥ చైద్యసంహార మొనరింపఁ జనెదవేని
సర్వసర్వంసహాధీశ చక్రమెల్ల
నుభయపక్షంబులనువచ్చి యుద్ధమునకు
సంగరంబున సర్వత్ర భంగమగును.
అందువలనను సురలకు నహితమగును.
యాగభుక్కులు గారొకో యమరవరులు?॥

మఱియు శిశుపాలు నపరాధశతంబు నిండక సాత్వతీదేవి కొసంగిన వరమునకు భంగంబు గలుగును. శత్రుపుండు దాత్తుఁడై యుండునపుడుగాక దీనతనున్న తఱిదాడివెడలుట నీకొక గౌరవంబును గానేరదు.

మ॥ పరగన్ యాగముఁజూడ నీవరుగ సంభావించు కౌంతేయుఁడా
దర మొప్పన్, శిశుపాలభూపతియుఁ బంతంబూని యెంతెంతలున్
విరసంబుల్ ఘటియించు నీయెడలఁ దావిద్వేషభావంబునన్,
వరముల్ భంగము నొందకుండ నచటన్ వానిన్ వెసన్ ద్రుంచివన్॥

శ్రీకృ—గీ॥ వాగ్మివరులార మీరమ్యవాక్యజాల
మమరఁ దులఁదూఁగు న్యాయాధికములు లేక.
రేవతీనాథ, నీబల్కు రీతినింక
శత్రుసంహార మొనరఁగ నల్పుటకును
గాల హరణంబు సేయుట మేలుగాదు.

ఉద్ధవామాత్య, భవదీయ యుక్తిసరణి
యోగదర్శనమొనరింప నరుగవలయు.
కాననొక్కట నీరెండు కార్యములను
నాచరింప నింద్రప్రస్థ మరిగియచట
నధ్వరానంతరంబున నరినిద్రుంచి
యుభయకార్యానుకూలత నొందుటొప్పు॥

బల॥ ఉద్ధ—తథాస్తు.
శ్రీకృ—ఇంద్రప్రస్థప్రయాణ సన్నాహంబుఁ గావింపఁ బోవలయురండు.
(అందఱు నిష్క్రమింతురు.)

తెర జాఱును.

ఇది చతుర్థాంకము.



శిశుపాలీయము.



పంచమాంకము.



విష్కంభము:— చేదిపురరాజవీధి.

(సంతోషంబుతో మైత్రేయుండును వానికెదురుగ సుశర్మయు ప్రవేశింతురు.)

సుశ:— మైత్రేయా, యెచ్చటినుండి మహాసంతోషమున వచ్చుచున్నాఁడవు?

మైత్రే:— నగరునుండియే. కోటగోపురంబుపై గ్రద్దవాలినదని సార్వభౌమదేవిగారు తద్దోషపరిహారార్థంబుగా నొక కాంచనగారుడవిగ్రహంబును దానంబుఁ జేసి సహస్రసువర్ణంబుల దక్షిణ నొసంగిరి.

సుశ:— దీనితో నీదారిద్ర్యము వదలినదోయి.

మైత్రే:— శిశుపాలమహారాజుపట్టణంబున దారిద్ర్యమెవరికిఁ గలదు? ఒక్క వాసుదేవవైరంబు దక్క తక్కినలోపంబు మనభూపాలునియందేమి కలదు?

సుశ— మహీసురద్వేషంబుకంటె మఱేమిగావలయు?

మైత్రే— ఆదెంతపనిలో చూడవలదా? మనబోంట్లకేమిహాని గావించెను? అగ్నిహోత్రుని నపకారిగాఁ దలంచుటచేఁ దత్సంబంధ శ్రోత్రియులనే బాధించుచున్నాఁడు. తదితరులకుం గావించు నపకారం బెన్నటకేనిఁ గలదా?

సుశ— శిశుపాలుని యన్నంబుఁ దినుచుండుటచేఁ గలిగిన యీనీయభిమానము శ్లాఘనీయమే. సరే దీనికేమి? మనరాజుగారినిఁ బట్టిన శ్రీకృష్ణవైరగ్రహంబు విడుచు మార్గంబు లేనట్లు తోఁచెడిని?

మైత్రే— విడుచుటయా? అనుక్షణ మభ్యావేశంబగుచున్న యాగ్రహంబు తొలఁగనుటయెట్లు సుశర్మ. జరాసంధుని మరణవార్త చెవిని సోఁకినదాది సమస్తచరాచరపదార్థంబులను వాసుదేవమయంబులుగఁ దిలకించుచున్నాఁడు. ఉద్రేకభావంబును నిరువదిగఁ బ్రదర్శించుచునే యున్నది. భీమసేనాద్యాయుధానుంగైర మనయాజని పాలించు పాండవరాజసూయాధ్వరదక్షున గమలాక్షునకు నగ్రపూజ సభయందు జరిగిన సమాచారము వింటివా?

సుశ — నాకుఁ దెలియదే.

సైరంధ్రి — ఇంద్రప్రస్థంబునకు శ్రీకృష్ణుండును దదర్థంబై యేతెంచుననియు నచ్చటఁ గృష్ణ శిశుపాలురకు యుద్ధంబు సిద్ధంబనియు. జయాపజయంబులు ముందుగని క్ష్ణలుండు నశక్యంబగుటచే ముందుగ గొన్ని యేర్పాట్లు సేయుట సుకరంబనియు. నెంచి యువరాజుగారు మంత్రిపాలుర సహాయంబున రాజ్యపాలనా భారంబు వహింపవలయుననియుఁ, దాను మరలి రాకుండుట తటస్థించినచోఁ గృష్ణునితో సఖ్యంబున నుండుట కర్తవ్యంబనియు నిర్దేశించి యున్నాఁడు.

సుశ — అట్టియెడ సదనంబున కరుగకుండుటయే శ్రేయస్కరంబై యుండునే.

సైరంధ్రి — సత్యమే కాని తనప్రాణసమానుండగు మాగధుని పంచత్వమునకుఁ గారణుండగు శత్రుని దా సంహరించుటయో వానిచేఁ దాఁ జచ్చుటయో జరుగవలయునఁట.

సుశ — ఈ నిశ్చయంబునఁ జేదీశునకేమి శుభసూచకమున్నది?

సైరంధ్రి — అదియుభయులకును వర్తించును. అయిన నేమి జరుగునో యీదినంబున నేకదా రాజసూయాంతము!

సుశ — స్వామి పక్షపాతంబు నిన్నట్లు పలికించుచున్నది. శ్రీకృష్ణునితోడి యుద్ధంబునకు దీకొను శిశుపాలునకు జయంబు గలుగుట కిలలోని వార్త. ఎందుల కీపిచ్చిప్రశ్నము? నాకు వేళయగుచున్నది. పొరుగువీధికి బ్రాహ్మణార్థమునకుఁ బోవలయు.

బ్రా. తే — నేనీబంగారమింటికి శీఘ్రంబునఁ దీసికొనివెళ్ళి నాభార్యను సంతోషింపఁ జేసెద.

(అని యిద్దఱు నిష్క్రమింతురు.)

తెరజారును.

ఇది విష్కంభము.

— పంచమాంకము —

— రంగము :— ఇంద్రప్రస్థపురము, శిశుపాల నివేశము. —

(శిశుపాల దంతవక్త్ర రుక్మి సచివులు ప్రవేశింతురు.)

శిశు — మనము ధర్మజ రాజసూయాధ్వర దర్శనార్థమై వచ్చి యిన్ని దినంబులయ్యె. కృష్ణుని మనోగతంబేఁ జూడకయు సూచింపదయ్యె. ఆకాంక్షలంబున నాకుఁ బ

యీ నామనంబును గణించుచు నది యన్యాయత్వంబుగానివిధంబున వర్తించుచున్నాఁడు.

మ॥ కనులన్ మూసిన విప్పినన్ నిదుర నంకా్రమించు కాలంబునన్
దినమందు న్నిశలందు సంతతము దేదీప్య ప్రభాపుంజ సం
జనితాటోపముఁ జూపుచున్ మనము తీక్ష్ణక్రోధమున్ బొందగా
నొనరింపం దలకొన్న వాఁడు ఖలుఁడై యుద్రిక్త వైరంబునన్॥

మఱియు మహావీరుండగు నామిత్రుని జరాసంధ ధరావల్లభుని శౌర్యహీనుఁడై మాయోపాయంబున పురప్రవేశంబుఁ గావించి భిక్షుకవృత్తి నవలంబించి ద్వంద్వయుద్ధంబుఁ గోరి తద్ధర్మబాహ్యమైన విధిని వధింపించె.

మ॥ ధరణీపాలవతంస మండలమునన్ దర్ప ప్రతాపోజ్వల
స్థిర శౌర్యోద్ధతి నన్యభూపతి ధృతిచ్ఛేదంబుఁ గావించు నా
డ్కరిసింహాంగ పటాత్ముఁ డౌచు విగత త్రాణంబుగన్ భీముచే
నురుమాడించి శిరంబుఁ దీసె మనకున్ న్యూనత్వమింతంతయే॥

ఆది మొదలుగా నామనంబెంతయుఁ జరితపించుచున్నది. అట్టి ఘోరాగ్రసరు వంచించి గావించిన యనుచిత నిధనంబునకు నుచిత ప్రతీకారంబుఁ గావింపమేని మన జీవనంబులు వృథ కావే? అద్దురంత పాతకుండు నాకుం గావించిన నికారంబు కంటె నదియ యధిక క్రోధకారణంబై యున్నది. రుక్మిణ్యపహరణంబున రుక్మియు నేనును మాత్రమవగణితుల మైతిమి. ఈయవమాన మామన కెల్లరకును సమానమైనది. వాని యఖర్వగర్వ మీసారి తుద ముట్టింపకున్నచో నది క్రమక్రమంబుగ విజృంభించుటయు మన బలంబు క్షీణించుటయు నిశ్చయము. కాన నీశత్రు నంతంబు నొందించు నుపాయ మూహింపుఁడు.

రుక్మి — మిత్రమా, నీవు నిక్కంబు వక్కాణించితివి. జరాసంధుండు సామాన్యుఁడా?

ఉ॥ రాజకులావతంసుఁడు పరాజిత శాత్రవరాజ శీర్ష వి
భ్రాజిత రత్న కాంచన విరాజిత పాదసరోరుహుండు నీ
రేజభవాస్యరోమత్త్ర మపరీత సమక్షుఁడు దేవనాథ సం
పూజిత వైభవుండును నభోమణి తేజుఁడు మాగధుండిలన్॥

గీ॥ గిరిశు మెప్పించి తపమున వరములంది
భూరి పరిపంథి గణములఁ బోరఁ గెల్చి
యశము నాసేతు సీతాద్రి నంటఁజేసి
జగతిఁ బెంపెక్కెనా జరాసంధ విభుఁడు॥

అట్టివానికింజరిగిన యవజ్ఞ నుపేక్షింపరాదు. కాని,

ఉ॥ విక్రమసింహులై నిఖల వీరవరేణ్యుల నాజిఁ గెల్చి ని
ర్వక్ర పరాక్రమోన్నతు లపారబలంబులతోడఁ గొల్వ భూ
చక్రము నాక్రమించి యుసత్వ సమృద్ధిని బాండవేయు లా
చక్రిని గూడియుండ మనశక్యమె వానిని దేఱిచూడఁగన్॥

దంత— శా॥ కాంతేయాగ్రజు రాజసూయమునుమున్ గల్పించి కృష్ణుండు భూ
కాంత వ్రాతములోన మేటిగరిమన్ గన్పట్టు శూరాళిఁ దా
నంతర్ధానముసేయఁడే మనకు రేపోమాపో వాటిల్లవే
చింతల్ వేయిఁక నేల యాదవు నుపేక్షింపంగ రాదెంతయున్॥

నిమిత్తమాత్రంబునకు మనము కయ్యంబునకుఁ గాలుద్రువ్విన సమస్తోర్వీశులు ను మనలను జేరఁగలరు.

రుక్మి— చైద్యాగ్రనీనాథా, యట్టియుత్రోథావల దండహ్య మాన శాసనులైన పాండవ విద్వేషులు మన పక్షంబువారు కాఁగలరని యెట్లు దృఢనిశ్చయులము కాఁగలము?

శిశు— మిత్రమా, శత్రుమిత్రజాలంబున నిజమిత్ర శత్రువర్గంబుల నారసి విజిగీషుండు మెలంగవలయు. అరియు నరిమిత్రులును మనకు సమాన శాత్రవులు. మిత్రులును నరి శాత్రవులును మనకు సమాన మిత్రులు. సహజ కృత్రిమ శత్రుమిత్రులలోఁ దనకు నుపకరించు వారల నాలోచించి తత్తత్సమయానుకూలంబుగ మిత్రత్వంబు సలుపవలయు. పాండవులచేఁ బరాజితులైనవారు కాలవశంబునఁ గృత్రిమ మిత్రులైయున్నారు. లోహంబు చెకుముకిరాతినొరయు మాత్రంబున నగ్నియుద్భవించు చందంబున సమయమాసన్నమైన కృత్రిమ మిత్రత్వంబు నశించి శాత్రవంబు పునర్భవంబగు. కావునపరాజితులై ప్రస్తుతము విశే

యులవలె నున్న రాజులందఱు యుద్ధారంభమయ్యెనేని పాండవభయంబుఁబాసి మా న మిత్రమండలలోఁ జేరఁగలరు. వారలలో ననేకులు దమయుద్దేశంబుల సాంతరంగిక దూతల ముఖంబుల నాకుఁ దెలియఁబర్చిరి. కాన సందియంబు వీడుము.

సునీ—క॥ క్ష్మానాథాగ్రణి యీయవ
నినాథ వరేణ్య సైన్యనివహావాప్తిన్
శ్రీనాథు నేనిఁ గూల్తుము
ప్రేనాయకుఁ ద్రుంచుటేమి వింతదలంపన్॥

రుక్మి—గీ॥ సందియంబేమి లేదింక సత్యమింత,
దంత— వైరి ప్రమగ్గను నేఁటితో వాస్తవముగ,
సునీ— దుర్నయంబవనిఁ దొలఁగును,
శిశు— దోర్బలాన
శత్రుసమయించి మనమున శాంతిఁ గొందు॥

దంత—సరే, మనమిపుడు సేయవలసినదేమి?

శిశు—యుద్ధంబునకు సిద్ధంబగుటయే.

రుక్మి—కయ్యంబునకు గారణంబేమి యరయుదము?

శిశు—కయ్యంబునకు నేనె కారణంబయ్యెద. మీరలు మాత్రము చతురంగ సేనా సమేతంబుగ సమయంబునకు వేచియుండుఁడు.

(అని యందఱు నిష్క్రమింతురు.)

(తెర జాఱును)

౼ద్వితీయరంగము—ధర్మజ రాజసూయాధ్వరాగారము.౼

ధర్మజభీమ సహదేవులును, నారదభీష్మశ్రీకృష్ణులును, శిశుపాలాది రాజచక్రంబును, సునీథుఁడును, వేత్రహస్తులును బ్రవేశింతురు.)

వే॥ ప్రథముఁడు—శ్రీమదఖండ మహీమండలోద్దండ చండప్రచండ దండనాథ మండి మండ వేదండకాండాది మండిత ఖండన భూమండల భాతృభుజాదండ తారాతి రాజ మార్తాండ మండలా! ధాత్రీమండలాఖండలా! పరాక్!

ద్వితీ—భరతకుల కలశోదధి పూర్ణచంద్రమా! నిత్యసత్యవ్రతపరాయణా! వేద వేదాంగాది వివిధ విద్యావిశారదా! సంతత సంతర్పిత సుహృద్బాంధవ ధరామరబృందా! రాజాధిరాజ ధర్మజమహారాజా! పరాక్!

నార—యుధిష్ఠిర భూపాల చంద్రమా, చతుస్సముద్ర ముద్రిత వసుంధరావలయాధి నాథులలో నీవు ధన్యతముండవు. మాదృశయోగి జనంబులకే జన్మశతంబులకైన నందరాని యాపరమాత్ముండగు శ్రీకృష్ణుండు నీకు బాంధవుండును మిత్రుండును సచివుండునునై యిరామరిక పలుపుచు ననన్యసామాన్యంబగు నీమహామఖంబు విధిదృష్టవిధానంబునం బరిసమాప్తినొందించె. ఇంతకంటె నెక్కుడు భాగ్యంబు కలదే! నీకులంబు పవిత్రంబయ్యె. ఈయధ్వరంబుం గనిన మాయదృష్టంబె యింతంతనరాక యుండ యాగదీక్షితుండవై భూలోక మహేంద్రునిం బోలి విరాజిల్లు నీయొక్క యదృష్టంబుం బొగడ నాకె గాదు నాయబ్బకుం దరమగునే?

మ॥ వసుధాభారము వాపుమంచు నమరవ్రాతంబు ప్రార్థింప, నీ
వసుధన్ మానవుఁడై జనించి జగముల్ పాలించు బ్రహ్మంబు శ్రీ
వసుధాకాంతుఁడు మాతులేయుఁడయి నీవాల్లభ్యసంధానమున్
బ్రాసంగం జేయుఁగ నున్నవాఁడనఘ నీపుణ్యంబు నామాత్రమే॥

ధర్మ—మహాత్మా, యిదియంతయు మీయాశీర్వాదఫలము.

భీష్మ—ధర్మజా, రాజసూయ మహామఖంబిప్పుడు సాంగోపాంగంబుగ సమాప్తంబయ్యె. వృద్ధాచారానుసరణంబుగ నిప్పుడీ సభాలంకారుండుగానున్న మాన్యునొక్కరు నర్ఘ్యపాద్యాది విధులఁ బూజించి యగ్రతాంబూల మొసంగి పిమ్మట నితర సభ్యులనుచితక్రమంబుగ గంధపుష్పాదులచే గౌరవించి కృతకృత్యుండవుకమ్ము.

ధర్మ—తాతా, మీచెప్పిన విధంబున నెట్టిమహాత్ము నారాధింపవలయునొ సెలవొసంగుడు.

భీష్మ—ఇట్టియెడ గురుసంయమీంద్ర స్నాతక ఋత్విజ ధాత్రీశ శ్రేష్ఠులలో సద్గుణంబులఁ బెద్దయగు నొకమహాత్మునిఁ బూజింపవలయును,

ధర్మ-పితామహా, యీమహాజన మధ్యంబున నట్టిపూజార్హుం బేర్కొనెదరుగాక!

భీష్మ— ఆ॥ "అబ్జనాభుఁడుండ నర్ఘ్యంబునకు నిందు
నర్హులొరులు గలరె యజ్ఞపురుషు
నఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు
మధిప యదియ చూవె యజ్ఞఫలము"॥

ధర్మ—సహదేవా, యర్ఘ్యపాద్యాది పూజాద్రవ్యంబులఁ గొనిరమ్ము. (సహదేవుఁడు నిష్క్రమించి పూజాద్రవ్యంబులతోఁ బ్రవేశించును.)

శిశు—యుధిష్ఠిర భూపాలాగ్రణీ, నీకు ధర్మరాజను నామంబు కలదు. అందుకు సార్థకంబుగ ధర్మాధర్మంబు లరసి పూజార్హానర్హుల నాలోచించి మఱియుం బూజింపుము. లేనిచో ననర్హగౌరవంబున నర్హ తిరస్కారంబై నీవు నిందాపాత్రుండవగుదువు.

ధర్మ—(ఆశ్చర్యమున) తమ్ముఁడా, చేదిక్ష్మావల్లభా, యేమి యిట్లనుచుంటివి? పితామహుండు శ్రీకృష్ణుఁ డమ్మహావిష్ణువని యాత్మ నెఱింగి పూజార్హుండని చెప్పెనందు దోసమేమి?

శిశు— గీ॥ ముదిమిచే మతిఁదప్పిన ముదుసలిని
తాతవాక్యమ్ములను నమ్మి నీతిమాలి
గొల్లనొక్కనిఁ బూజించి యెల్లరకును
నవనిపతులకు నవమాన మాచరింతె॥

ధర్మ—శిశుపాలా, నీవంటి యుత్తమ క్షత్రియునకిట్టి పరుషంబులాడుట పాడియే?

భీష్మ—వత్సా, యీపిల్లదుని ప్రలాపంబులు పెడచెవిం బెట్టి నామాటవిని తప్పక జనార్దనునకు నర్ఘ్యంబొసంగుము.

ధర్మ—సహదేవా, ముకుందున కగ్రాసనం బొసంగి పూజాద్రవ్యంబుల నాకిమ్ము (సహదేవుండట్లు సేయ ధర్మరాజు కృష్ణున కర్ఘ్యపాద్యాదులిచ్చి బంగరు పళ్లెరంబుతో తాంబూలం బొసంగును.)

శిశు—(లేచి) ధర్మరాజా, యీయనుచిత మార్గోపదేష్టుని వాక్కు లాలించియు నధర్మానురక్తుండవై కృష్ణునిఁ బూజించి నీనామంబు నిరర్థకంబుఁ గావించుకొని యీభూసుర రాజేంద్ర శిఖామణుల నవమానించి దుష్టకర్ముండవై నీయవివేకంబుఁ జూపించితివి. నీతిబాహ్యప్రవర్తన వర్తితంబగు నీసభనిఁక నుండను. పోయివచ్చెద. (సభాసదుల వంకఁ దిరిగి)

గీ॥ భూపవరులార లోకైక పూజ్యులార,
ధర్మతనయుండు బహుధర్మదయితుఁడంచు
యుక్త సత్కార సంధాన సక్తుఁడంచు
రాజసూయంబుఁ జూడంగ రమణమీర
వచ్చియిచ్చటఁ గంటిరే వానితీరు?
కులమునీతియు లేనట్టి గుణవిహీను
వాసుదేవునిఁ బూజించి వాసిదప్పి
పరిభవించెనుమిము నెల్లఁ బాలసుండు.
ఉండ జెల్లదు సచ్చట నుత్తములకు
నాగుదము రండు ఘనులార సభనువీడి॥

(అని శిశుపాలుఁడు సభవిడువనుంకింప నితరరాజు లొకరి ముఖంబు లొకరు చూచుకొనుచుందురు. ధర్మజుండు శిశుపాలుని సమీపించి నిలిపి)

ధర్మ—తమ్ముఁడా, సాత్వతేయ, యాత్మబంధుండవైన నీవే యీయుత్సవభంగంబుఁ గావించి సభను విడిచి పోవనుచితము?

శిశు—ఛీఛీ. నీముఖంబుఁ జూచినఁ బాతకంబు వాటిల్లు. రాజులలో పూజ్యుండవు గుణ సమృద్ధుండవునని యీ యవనీశ్వరులు నీముఖంబుఁ జూడవచ్చిన యవ నీచు సత్కరించి యింతమంది భూసుర భూవరులకు నవజ్ఞఁ గావించిన మహాపాపివి. నీసభనున్నవాఁడు నింద్యుండగు.

ధర్మ—శ్రీకృష్ణుండు పరమపురుషుండును లోకాతీతుండు నగుటచేఁ నీకంటె పెద్దలైనవారు తదర్చనకు సంతసించుచుండ నిట్లునిందించుచు సభాగారము వెలువడ యత్నించుట నీకు న్యాయమా? (అని గడ్డము పట్టుకొనును.)

భీష్మ—ధర్మజా, మదాంధుండైన వీనిఁ బ్రతిమాల నీకేల?

(శిశుపాలుని వంకఁదిరిగి) నీకుఁ గలపూర్వవైరంబున మహానుభావుండగు వాసుదేవుని నీయిచ్చవచ్చినటుల ననుచుంటివి. పరాత్పరుండగు నాతని మహత్వము కించజ్ఞుండవైన నీవెట్లెఱుంగఁగలవు?

శి—బాపాటా, మిథ్యాప్రగల్భవాగాడంబరదంభా, నీయచ్యుతుని గచ్యుతునినా ంటె నీవెఱుంగుదువా? పసితనంబు నుండియు నీపాఱుబోతు చీరంబులు నేవాడి

పడపోసినవే, నీనాలుక వేయివ్రక్కలైనంగాని యాపితికిలంక విక్రమంబును స్తుతింపఁజాలవు. శుకశాస్త్రాదులు నవ్వఁగలరిఁక నీయొక్కటియు లేనిచో నాకు వృథాశ్రమఁగలుగఁ జేసినవాఁడవు గాఁగలవు.

భీష్మ—త్రివిక్రమునిఁ బాలుబోలనుచుంటివిరా క్షుద్రతనువా?

గీ॥ వ్రజకవిష్టంబు లేకుండఁ బరులఁగూల్చి
శత్రురాజ్యంబులొసఁగి తత్పుత్రులకును
లోకరక్షణఁగావించు వీఁక నెవఁడొ
వాని దెలియంగఁగలఁడె నీవంటికలున?

శిశు—సుక్షత్రియ ధర్మమధోగతిపాలు చేసి యాదవాధము నిజట్టువోలిపొగడుచుంటివి. నీ కుబుసువుచ్చుటకైనచో సుప్రసిద్ధశూరులను క్షాత్రుల స్తుతింపక యీ పసులకాపరి నిసుమానీకు దొరకెను?

భీష్మ— ఉ॥ వంకిలచిత్త నీపలుకు పల్లదముల్ విని యూఱకుంటచేఁ
గొంకక కాలులన్ మిగులఁ గూయుచునుంటివి మూర్ఖ యుద్ధని
శ్శంకత నీదుగర్వము నశాంతియొనర్పఁగ లేక కాక మా
యంకను నాతిథేయమున కర్హుఁడవౌటను జూచె శాలిశా॥

శిశు—కౌరవకులకళంకా, నీయాతిథేయ సత్కారమేమని సహింతు. హేమకంకణగానంబానఁగఁబోలున వృద్ధవ్యాఘ్రి తులుక్యండవుకదా! నీవుచెప్పినయాగ్గరిలో నీయదుకుల పాంసనుఁడెవఁడని యగ్రపూజయొసంగితివో యిపుడు చెప్పవేని నీనాలుక నీఖడ్గముచేఁ గోసెదఁజూడు. (అని ఖడ్గముఁ జాపును.)

భీష్మ—మూఢాత్మా, యాగ్గరిలో నొక్కఁడే కా దాయాగ్గరుసు నయ్యెడు మహాభాగుండు.

సీ॥ వసుదేవసూనుఁడా వైకుంఠుఁడగుటచే
జగదేకగురుఁడెనిస్సంశయముగ,

శిశు— రుక్మిణీహర్త గుయ్యండైన జగతికి
జగమంతయునుదొంగ జగమెయాను,

భీష్మ— ఆదిమాసింధుల యందునారాయణుం
డౌటచేమాసింధుసోఁడయ్యెనొరి,

శిశు — అదిసత్యమో కాదొ యరయ మహానందవిష్ణు
పూనియుండుటచేత మానినిజము,

భీష్మ — ఋత్విజుండగు వ్యాస ఋషి యెదానొటను
ఋత్విజుండగుటకు ఋజువు కాదె,

శిశు — మగధావనీనాథ మారణాధ్వరమున
ఋత్విజుండయ్యెఁగా ఋజువి కేల,

భీష్మ — భూదేవి తనకొక్క పాలతియై యుండఁగ
స్త్రైనకుండనుటకు సందియంబె,

శిశు — యాదవాధములు యయాతి శాపమునమేల్
రాజ్యార్హులైరి పోరాటమేల,

భీష్మ — గీ॥ స్నాతకులలోన క్షత్త్రియస్నాతకుండు

శిశు — ఆలమందలఁగడిగి నీరాడునపుడ

భీష్మ — ఇష్టుఁడౌట మాకెల్ల నెఱుఁగదొకొ

శిశు — దుష్టుఁడౌటను దుష్టున కిష్టుఁడయ్యె॥

మూర్ఖా, నీ పాండిత్యమునకు నీయుధర్మరాజు యజ్ఞమునకు నీగొల్లని యగ్ర్యమునకు నగిపోయినది ఇఁక నూఱకుండుము.

భీష్మ — (ఉగ్రుఁడై)

శా॥ ఓరీపాపి! నిశాట! మూర్ఖ! కుకులంశోద్భూత వీరాగ్రణిన్
శ్రీరాజాంపతి కన్యకాధవుని నాక్షేపించెదా దుర్మతీ
తోరీనా పటివీరులంచుమది గర్వింపంగ నేలేనుకో
రారా నీమదమూర్ఛదన్ గదను నీరాజుల్ రహిన్మెచ్చఁగన్॥

నా గదాదండంబున నీశిరంబు పచ్చడి కావించెదఁ జూడు. (అని గదం జూపించును.)

శిశు— భీష్మా, పచ్చడిచేయుటకిది గంటోఁదిపట్టు కాదురా, వృథా దంభప్రలాపా, నీతాత కెదిక్కు లేదు నీవే పాతరా పోపొమ్ము.

శిశు — (తీవ్రకోపముతో గదనెత్తి) ఓరీ, సాత్వతీగర్భభార, నిన్నొకాదీసభాముం దిరస్థిత వసుంధరాధీశులల్లో నెవ్వఁడేని మాయిచ్చిన యర్ఘ్యంబున కొడంబడఁడే

ని వానిఁగూడ మదీయ గదా తాడనంబున దండధరు మందిరంబునకు నతిథిం గావించెద. ఇదె వచ్చితిని. (అని శిశుపాలునిపంకఁ బోవుచుండ)

ధర్మ — (భీముని నడ్డగించుకొని) తమ్ముఁడా, శిశుపాలుండు మన కతిథిగావున నిది ధర్మంబు కాదు. శాంతింపుము.

భీష్మ — వత్సా, పరాక్రమ భీమ భీమా, యీదురాత్ముండు మనచేఁ జచ్చువాఁడు కాఁడు. అయినచో నాచే నిదివఱకే చచ్చియుండును. వీఁడధోక్షజుని చేఁ జావ విధి విహితంబై యున్నది. నీవు శాంతించి తొలంగుము.

(భీముఁడు పోయి కూర్చుండును.)

సునీ — (లేచి సభాసదుల నుద్దేశించి)

చ॥ అవనిపులార మీ యెదుట నాలరిగొల్లని కర్ఘ్యమిచ్చి తా
నవమతియై యమాత్మజుఁ డనాదర మేడ్తెగఁ జేసె నిప్పుడీ
పవనసుతుండు గర్వపరిభార తిరస్కృతి ధిక్కరించె మీ
భవములు పేరుపెంపులును బౌరుషకీర్తులుం గోలుపోతిరే॥

వీరాగ్రేసరులారా, యీధర్మజరాజసూయంబున నీయమర్యాదలం బడయుట కావచ్చితిరి? మీరలిట్లాచరించిన నధికపరాభవంబుల కాస్పదులు కారే? ఇట్టి దుర్నయంబులు మొగ్గలోన ద్రుంచనిచో వృద్ధిఁ జెంది తుదకు మహాపద్భవములుగ ఫలించును. మహాశూరులైయుండియు మీరలిట్టి పరిభావంబు సహించితిరి గాని మీకువలె క్షత్రియరక్తంబు శరీరంబున బ్రవహించు మహీమేధరాధీశులైన మీవలె ఖడ్గంబులు హస్తాలంకారంబులుగ నాలోచించి యుందురా! చేదిధాత్రీశుని సేనలనిదె నేఁ బోయి యుద్ధంబునకు సిద్ధంబుఁ జేసెద. ఆత్మగౌరవరక్షణేచ్ఛయున్నచో మీరలు నన్ననుసరింతురుగాక. (అని నిష్క్రమించును. వానితో శిశుపాలుని పక్షమువారు నిష్క్రమింతురు. ఇతర రాజులు కోలాహలంబున లేచి నిలుతురు.)

ధర్మ — పితామహా, యీరాజచక్రంబెల్ల మందరాచల మంథానమథిత క్షుభితక్షీరవారాశివలెఁ గోలాహలంబుగనున్నది. శాంతవచనంబుల వీరినుపలాలించి ప్రజాక్షోభంబు గలుగకుండఁ జేయుఁడు.

భీష్మ — కౌంతేయా, వారిజాక్షుఁడుండ నీకేల యీభయము?

శిశు — ఓరీ యధోక్షజ, యిపుడు దుదక్షుండవై యిటుచూడుము. ఈ మహోత్సవంబంతయు నీపరితాపంబె.

చ॥ యమజుఁడు బుద్ధిహీనుఁడయి యర్ఘ్యమునిచ్చిన నిచ్చెఁగాక నీ
వమరితివెట్లు గైకొనఁగ నర్హులు పూజ్యులు పెద్దలౌ మహీ
రమణులనేకులుండఁగ ధరామరులెందరో శిష్టులుండ శ్వా
నమున కనందలంబ వ్రజనాయక యర్ఘ్యము నీకొనంగుటల్॥

క॥ స్త్రీవధము గోవధమ్మును
క్ష్మావరుమాతులుని వధము మదమున వరుసన్
గావించిన పాపాత్ముఁడ
వేవిధినర్హుండవైతో యేర్పడఁజెపుమా॥

క॥ తలిదండ్రి కాలదైవము
కులమును గోత్రంబు గురువు గుణరూపములున్
ఇలువావి వర్తనంబులు
కలవుర కలనైననీకుఁ గల్లరిగొల్లా॥

నీవు చోరుండవై మదర్ధాగ్దత్తయైన రుక్మిణి నపహరించిన మహాపాతకుండవు. మాయావివై క్షాత్ర ధర్మంబు విడిచి రాజకంఠీరవుండగు జరాసంధుని వంచించి చంపించిన ఖలుండవు. నీవునవనార్ఘ్యగ్రహణంబునకు నర్హుండ వెట్లయితివి రా దురాత్మా?

సీ. పాలిచ్చుపూతనా ప్రాణాపహరణంబు
బాలార్జునయుగళభంజనంబు,
ల్మీకతుల్యగోవర్ధనోద్ధరణంబు
సాధువృషభోత్తమ సంహారణము,
పక్షిమాత్రవిమృష్టబకనిధనంబును
హీనవృద్ధోరగహింసనంబు,
వత్సమారణంబు వారణసంహృతి
దారుశకట పాదతాడనంబు॥

గీ॥ మొదలుగాఁగల నీవగుకొదువపనుల
గోరులంతలఁబనిఁబూని కొండలంత

లనుచు వందారుముఖ్యాగ్ర్యులు వినుతులరసి
పిట్టవీఁగెదు చెన్నఁటి వీరుఁడీవ॥

శ్రీకృ—(లేచి) రాజోత్తములారా, మీకీకృపా కలకలంబేల? ధర్మజానుచిత గౌరవ సత్కారంబులంబొంది మీమీపురంబులకరిగెదరుగాక! ఈవాచాటునిదురాలాపంబులతో మీకేల? ఇద్దురాత్ముండు నామేనయత్తయగు సాత్వతికిఁ బుత్రుండు. వీనిదుండగంబుల నెఱింగియును వీని యపరాధశతంబు సైపుమన్న నేనియ్యకొంటి. వీఁడు నాయెడల నిష్కారణంబుగ వైరంబుఁబూని పెక్కులు నపకృతులు గావించుచుండె. నేనువానినెల్ల సహింపుచుంటిని కానిపావనులైన మహామునులకును బూజ్యులైన వేదశాస్త్రములకును గావించు ఘోరహింసలు నాకు సహింప నశక్యంబుగ నున్నవి. మఱియు

చ॥ తరుణముఁగాంచి, మేము భగదత్తునిపై నెడలంగ, ద్వారకన్
దిరముగముట్టడించి, తనుదేవమఖాశ్వము దొంగిలించి, యు
ధ్వరమునకెగ్గుసల్పి, పురిదగ్ధముచేసి, మధుప్రమత్తులై
తరుణులఁ గ్రీడలందవిలి తారెడు వీరులఁ ద్రుంచెఁ గ్రూరుఁడై॥

గీ॥ బభ్రునరవరు పత్నిని బరమసాధ్వి
నానుకేశినిఁ బాపియై యపహరించె
సాత్వతీదేవి కోనఁగిన సద్వరంబుఁ
దలచి మదినింత దనుకను దాళియుంటి॥

ఇప్పుడు వీని యపరాధశతంబును బూర్తియయ్యె.

శిశు—ఓరిమూర్ఖ, బభ్రుపత్ని నపహరించిన నేను మహాపాపినిన్ని, నాకువాగ్దత్తయైన రుక్మిణి నపహరించిన నీవుపూజ్యుఁడవునా? ఇట్లు వచించుటకు నీకుసిగ్గుసుంతైన లేకపోయినదా? నాయపరాధములు శతశంగమగునని నీవుసహించువాఁడవున్న లేనిచో నేనా మహాపకృతి సేయువాఁడవునా? నీవననెంత? నీసహింపనెంత? నీకోపమనెంతరా. గర్వాంధకారముగ్నా? నీవు నన్నేమి సేయఁగలవురా తులువా? మదీయ కోపానలజ్వాలలకు నిన్నిప్పుడ శలభ ప్రాయునిగా జేసెద.

పంచచామరము॥ దురాత్మ క్రూర నిన్నుఁబట్టి దోర్బలంబుతోడ నా
కరాళఖడ్గధారఘాతఁ గంఠమొక్కపెట్టునన్

బిరానఁదూఁగింది శోణితింబుఁ బిల్చినాదు క్రోధమున్
బరాబరిన్ బ్రశాంతిఁజేసి పాయుదున్ మనోవ్యధన్॥

దుష్టా, యిదె దప్పితివి కానికొమ్ము. (అని కత్తిదూసి మీఁదికి వెళ్లుచుండ)

శ్రీకృ — మూర్ఖా. లోకంబుల జడిపోవ మృత్యుపాతంబడుము. (అని తాంబూలంబుతో నొసఁగిన బంగరు పళ్లెరమును శిశుపాలునిపై వేయ శిశుపాలుఁడు తిరోహితుఁడయి జయుని రూపముతోఁ బ్రవేశించును. పుష్పవర్షము గురియును. దేవదుందుభులు మ్రోగును.)

జయు — (చేతులు జోడించి)

సుకేసరము॥ జయజయ వాసుదేవ జయ శైలధారణా
జయజయ పద్మనాభ జయ సారసేక్షణా
జయజయ సృష్టిపాల జయ సర్వకారణా
జయజయ చైద్యహంత జయ నాథరక్షణా॥

చ॥ సనకసనందనాది మునిశాపవశమ్మున మూఁడుజన్మముల్
దనరిన నీకృతీయ భవతారణకారణ మౌటఁ జిమ్మునన్
ఘనమగు పూర్వరూపమును గైకొని మాధవ తావకాంఘ్రులన్
గనుఁగొనఁగల్గి ధన్యతను గాంచితి నీకరుణారసంబునన్॥

ఉ॥ వానికసర్వసృష్టిపరిపాలన కర్తను నేనియుంచు దు
ర్వారమదాంధతన్ సురలరాయుచు భాగవతోత్తమున్ సుతున్
గాటియపెట్ట నాకనకకశ్యపురూపము వాప భీకరా
కారత నారసింహమయి కావనె యాదిమ జన్మమందునన్॥

ఉ॥ పాయక రావణుండనయి బాహుబలోద్ధతి నెల్లలోకముల్
రాయుచునుండ నాయమరరాట్ప్రముఖుల్ జనిమొఱ్ఱపెట్ట నా
రాయణపాహియంచు రఘురాముఁడవై జనియించి యప్డు నీ
సాయకవృష్టిఁద్రుంచి కడుసౌఖ్యమొసంగవె నాకు కేశవా॥

ఉ॥ క్రూరనిశాటసంఘటిత ఘోరతరాఘవికీర్ణ మౌ ధరా
భారనివారణార్థమిలపై వసుదేవసుతుండవౌచు దు
ర్వారమదాంధదుష్ట శిశుపాలుని రూపము సంహరించి యు
ద్వారిగఁబ్రోవవే యిపు డపారకృపామతి యిందిరాపతీ॥

దండకము.

శ్రీమన్మహాదేవదేవాధిదేవా, మహేంద్రాది బృందారకాధీశసందోహసంవంద్య పాదారవిందా, ముకుందా, శతానంద గోవింద వరదా, ప్రతంసత్రిరూపంబులన్ లీలమై మాయ నీతత్వ చాతుర్తి కాంశాను సంధాన చాతుర్య మూలంబునన్ లోకముల్ సృష్టిఁగావించి పోషించి నాశంబు నొందింపుచున్, కేశవానంత నారాయణాద్యాఖ్యలన్ బెంపు సొంపారఁ దత్సృష్ట్యతీతుండవై, చిన్మయానంద సాంద్రుండవై, శుద్ధ బుద్ధ స్వరూపంబునన్ నిర్గుణబ్రహ్మతత్వంబవై, లోన పైనంతటన్ వ్యోమమున్ బోలి వ్యాపించి తత్సర్వమున్ జూచుచున్ జూడరాకుండ నంతర్హితంబౌం దియానంద వారాసి మగ్నుండవై యుండు వెల్లప్పుడున్. మాయ నీసన్నిధిం గూడి సర్వంబుఁ దాఁ జేయుచుండంగ నజ్ఞాని యా కార్యముల్ నీవు గావించుచున్నాఁడ వంచున్ భ్రమించున్ గణించున్ విచిత్రంబుగా. ఆత్మకంఠంబునందున్న సౌవర్ణభూషన్ జనుల్ గాన లేనట్లుగా మానసంబందు వెల్గొందు నిన్ జూడ లేకుందురజ్ఞానతన్. జీవజాతంబు కర్మానుబంధానుసారంబుగా సౌఖ్యదుఃఖంబులం బొందఁ నిర్ణేతవై ధాతవై ధర్మనిర్మాతవై, ధాత్రిఁ దద్ధర్మనాశంబు నధర్మప్రచారంబు వాటిల్లు నెప్పట్టు కారుణ్యభావంబునం గాంచి మత్స్యాది రూపంబులం దాల్చి, దుష్టాత్ములం బట్టి గిట్టించి, శిష్ట ప్రవర్తానుసంధానులన్ బెట్టు చేపట్టి రక్షించి, లోకంబు దీపింపఁ గాఁ జేయువే? పాయవే పాపముల్ వేగ నీనామ సంభావనల్ సేయఁగా? తూడదే ఘోర సంసారసంతాప చక్రంబు నీదివ్యచారిత్ర సంకీర్తనల్ సల్పఁగా? నీపరబ్రహ్మ తత్వంబు నంజేరనా యోగ వైరాగ్య విజ్ఞాన సద్భక్తులుండకన్ దిక్కున్నదే? ముక్తిదన్నీదునే సుకరదైవంబవంచున్ సదా భక్తితోడన్ మహాసక్తితోడన్ బలే ముక్తినొందన్. మహాదేవ దేవేశ నీదివ్యతత్వ ప్రభావం బవేద్యం బభేద్యం బసాధ్యంబునై బ్రహ్మవైకుంఠ రుద్రేంద్ర యోగీశ్వరశ్రేణికే యుండ నే నెంతవాఁడన్ మహాదీనుఁడన్ బుద్ధి సామాన్యుఁడన్ మర్త్యుఁడన్ పుణ్యసంక్షిప్తుఁడన్ గాని నీభక్తుఁడన్ వేగ రక్షింపుమీ చెల్లనాయుల్లమందున్ భవత్పల్లవాంఘ్రుల్ సదా సంస్మరింతున్ చిదానందమూర్తీ, జగచ్చక్రవర్తీ, సువిఖ్యాతకీర్తీ, నమస్తే నమస్తే నమః॥ (అని సాష్టాంగనమస్కారంబుఁ గావించి) అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా, యాజ్ఞనొసంగిన వైకుంఠంబున నాపూర్వపదంబు స్వీకరింపం జనియెద. (విమానంబు వచ్చును.)

శ్రీకృ—ఓఁగాక! (జయుఁడు విమానారూఢుఁడై యాకాశమార్గంబున జనును.)

ధర్మరాజా, నీరాజసూయంబు నిర్విఘ్నంబుగఁ బరిసమాప్తినొందె. ఇఁక శిశు

చాల ప్రీతుండగు ధృష్టకేతునకుఁ బట్టాభిషేక మహోత్సవంబుఁ గావింపనేన తగవలయు. నీకేదేని కోరిక గలదేని తెలియఁ జేయుము.

ధర్మ—(సంతోషంబుతో)

మత్తకోకిల॥ దేవ నీ కరుణేక్షణంబుల గీప్తమయ్యెను సర్వమున్
భావమందలి కోర్కెలెల్లను బాగుగానమురారి మేల్
గావులెల్లరనోర్చి పోరుల రాజసూయముఁ జేసితిన్
భూవరేణ్యులలోన నేనతి పూజనీయుఁడనైతిఁ గన్॥

భక్తవత్సలా, నాకుఁ గోరవలసినది యింకేమిగలదు? అయిన దేవర యానతి యయ్యెగాన నీవిధంబున నేఁ గోరెద!

ఆ॥ వె॥ స్వస్తియగుతఁ బ్రజకుఁ బార్థివ స్తోమంబు
లవని నేలుఁగాత న్యాయరీతి
కుశలమగుత నెపుడు గోబ్రాహ్మణాళికి
సర్వలోకములకు సౌఖ్యమగుత॥

కృష్ణ—తథాస్తు.

తెరజాఱును.

ఇది పంచమాంకము.

ఇది శ్రీరామచంద్ర కరుణా కటాక్ష లబ్ధ కవితా వైభవ శ్రీవత్స
గోత్రోద్భవ దూర్వాసోవంశపయః పారావార రాకా
కైరవమిత్ర కామేశ్వరపవిత్ర పుత్ర విద్వజ్జన
విధేయ వరాహ నారసింహనామధేయ
ప్రణీతంబైన శిశుపాలీయ
నాటకంబు సర్వంబు
సంపూర్ణము.

శ్రీ రామచంద్ర పరబ్రహ్మార్పణమస్తు.

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
1	2	కలన	కలనా
2	1	కతంబు	కదంబు
3	4	సర్వోనియంబా	[illegible]
	21	[illegible]	[illegible]
4	5	సామర్థ్యగా	సామర్థ్య
	9	మసుమ	మనుమ
	16	నగల	నకల
	17	నిరాద్యాకారంబు	నిరవ్యాకారబు
	20	ధర్మస్థింబు_తె	ధర్మస్థిరచిత
5	13	నల	నన
		[illegible]	[illegible]
	25	అహం	అహో
6	8	ధంతల	[illegible]
7	4	[illegible]	[illegible]
	16	నియమ	నియమిక
8	13	థంగినం	భంగినం
	14	వలక	వలన
	27	నాదమా	నాదమో
9	18	కాల	[illegible]
	24	[illegible]	[illegible]
10	3	గావి	గావిగ

పుట.	పంక్తి.	తప్పు.	ఒప్పు.
10	7	జారక	జారరగ
11	2	పరిరమల	పరిమళ
	17	శర్క	శార్క
	24	కాంతిచుది	కాంతిమతి
12	8	యసి	యశస్విత్
13	17	నల్లని	నల్లని (అంతటబద్ధుడు)
	18	మల్లి	మలి
	22	చెనిక	చెనిక
14	15	రాజాజారు	రాజాగారు
15	19	శరశ్చేద	శరశ్చేత
16	15	యపుడు	యప్పుడు
	18	రూధన	రూధన (అంతటను)
	21	దోచు	దోచు
17	9	యనకస	యనకారక
	12	[illegible]	[illegible]
18	8	[illegible]	[illegible]
	22	[illegible]	[illegible]
19	2	[illegible]	[illegible]
	61	[illegible]	[illegible]
	18	[illegible]	[illegible]
	28	రావకంబు	రావకంబు

20	18	సంకరం	శంకరతరం	32
	25	సుకృతంబు	సుకృతంబు	34
21	11	నాహూయతంబు	నాహస్వనంబు	
	23	నిచట	నిట	
22	17	తమస్సు	తమస్సు	
	18	కాంతోర్వశ	కాంతోర్వశ	
	20	నాధుండు	నాధుండు (అంతట)	
23	4	రాలం	రాలం	35
	24	వెల్లపోవుట	పోవుట	37
24	21	కుక్కురాజ	కుక్కురాజ	38
	25	జాకు	జొట్టు (అంతట)	
	26	గొల్లలాడుచున్న వె ల్లకుంభిని	పల్లకిల్లుచున్న వెంతో యుగ్రమై	39 41
27	17	నగర	నగీ	43
	18	గొబ్బులుగ	గ్రొబ్బులుగ	
29	15	తదేత	తదిత	
	19	లదాంజలి	కలజామునకు	48
30	17	నిదలంచిన	నితలంచిన	49
		క్రిందమీద	చెలిలోన	
	18	రేఖ	రేఖ	50
	25	నిర్వాణకుదంబు	నిర్వాణాంబు	52
31	1	[illegible]	సామాయ్యంబు (అంతట)	54
32	13	ఘాతకము చేసి	జ్ఞప్తికి తెచ్చు	55

55	16	ధృతం	ధృత్వం	69
	19	నియమము	నియమము	
56	17	ధీమతు	దీమన	
	19	మీద	మీద	70
57	21	యసంబగు	యస్త్రంబగు	71
	22	వర్గనాధకము	వర్గనాధకత	
58	1	రేఖ	రేఖా	
	2	యుక్తవేమని	యుక్తవేమని	
	3	వేయు	నేయు	
	6	నమ్మ	యమ్మ	
	17-18	సాధ్వధికము	యుధికత	72
	24	గొమ్ములను	గొమ్ములయను	73
59	5	పూజితంబును	పూజ్యతము	
61	9	రథ	రథ (అంతట)	74
	22	ఆయోత్సంబు	ఆయతము	
62	14	జుట్టు	జుట్టు	76
	16	చెలించి	చలించి	77
63	9	తరుణ	తరుణ	81
	23	జాతవేదము	వేదగీతము	82
64	4	ప్రబలిం	ప్రబలిం	
	24	కురంత	కురంత	
65	2	యుక్తుడు	యుద్యుక్తుడు	83
	8	ఘోరంబు	ఘోరకృత్యంబు	84

22	సత్వరంబున	సత్వరంబుగ (అంతట)
1	[illegible]	[illegible]
	[illegible]	[illegible]
6	[illegible]	[illegible]
17	[illegible]	[illegible]
12	[illegible]	[illegible]
15	[illegible]	[illegible] (అంతట)
13	[illegible]	[illegible]
23	[illegible]	[illegible]
11	[illegible]	[illegible]
12	[illegible]	[illegible]
18	[illegible]	[illegible]
13	[illegible]	[illegible]
7	[illegible]	[illegible] (అంతట)
13	[illegible]	[illegible]
19	నర్తనంబు	[illegible]
14	[illegible]	[illegible]
	[illegible]	[illegible]
18	[illegible]	[illegible]
25	[illegible]	[illegible]
13	[illegible]	[illegible]
8	[illegible]	[illegible]
15	[illegible]	[illegible] (అంతట)

15	దీర్ఘకర్ణం	[illegible]
21	ఇవె	ఇవె
23	వనిష్ఠ	వనిష్ఠ
25	[illegible]	[illegible]
14	గుండ [illegible]	[illegible]
19	జెలచి	జెటిచి
	తత్సరిగణంబు	సద్వారగణము
24	యరణి	యరణి
25	జెరచి	జెటిచి
26	[illegible]	[illegible]
14	యానన	పీఠ [అంతట]
9	శరద	[illegible]
	నస్తల	శరద
19	[illegible]	[illegible]
20	[illegible]	[illegible]
4	[illegible]	[illegible]
6	[illegible]	[illegible]
8	[illegible]	[illegible]
12	[illegible]	[illegible]
14	[illegible]	[illegible]
	[ఆ పంక్తి యుంచు]	[illegible]
15	గారణం బెమి	గారణం బెమి
5	[illegible]	ముందఫు

84	16	సామాన్య	సామాన్య		18	[illegible]	[illegible]
	23	వయస్సు	వలయును	88	9	[illegible]	[illegible]
85	5	యుధిష్ఠిర	యుధిష్ఠిర [అంతట]	89	13	[illegible]	[illegible]
	18	[illegible]	[illegible]	90	15	నడినా	[illegible]
	24	[illegible]	[illegible]		20	[illegible]	[illegible]
86	16	[illegible]	[illegible]	91	23	[illegible]	[illegible]
87	3	పృథా[illegible]	పృథా[illegible]	92	3	[illegible]	[illegible]
	4	[illegible]	[illegible]	93	3	సంతోష	[illegible]
	5	[illegible]	[illegible]	94	7	[illegible]	[illegible]
	9	[illegible]	[illegible]		13	[illegible]	[illegible]
	15	[illegible]	[illegible]		18	[illegible]	[illegible]
	17	[illegible]	[illegible]				

ప్రకటన.

ఈ గ్రంథకర్తగారిచే

రచియింపఁబడిన యితర గ్రంథములు.

1 శ్రీరామాభ్యుదయము:— అధ్యాత్మ రామాయణము నందలి రామాభ్యుదయము [illegible] తెలుఁగు పద్యములతో వ్రాయఁబడినది. వెల రు 0—1—0.

2 [illegible]:— సుప్రసిద్ధమైన [illegible] వ్రత మహాత్మ్య మందలి [illegible] నాటకముగా వ్రాయఁబడినది. త్వరలోనే వెలువడును.

[illegible]

విశాఖపట్టణము జిల్లా.

[illegible]